ISSN : 0971-8729

# యోజన

సంపుటి : 44 సంచిక : 6 అభివృద్ధి మాసపత్రిక ఏప్రిల్ 2016 ₹ 22



## అభివృద్ధి పథంలో ఈశాన్య భారతదేశం

విధానాలతో మార్పు సాధ్యమా...?
సంజయ్ హజారికా

ఈశాన్య రాష్ట్రాల్లో విద్యా, ఉపాధి అవకాశాలు - ఒక ముందడుగు
నటాలీ వెస్ట్ ఖర్కోంగర్

ఈశాన్య భారతం : ఆరోగ్యరంగంలో అభివృద్ధి
డా॥ అరుణ భట్టాచార్య చక్రవర్తి

విశేష వ్యాసం
ఈశాన్య రాష్ట్రాల్లో వ్యవసాయం : సేంద్రియ పద్ధతుల్లో సత్ఫలితాలు
నరేంద్ర దేవ్

ప్రత్యేక వ్యాసం
ఈశాన్య భారతంలో గిరిజనాభివృద్ధి
ఎన్ సి సక్సేనా

## సిక్కిం (గాంగ్టక్)లో జాతీయ సేంద్రియ వ్యవసాయ పరిశోధన సంస్థ

సిక్కింలోని గాంగ్టక్‌లో జాతీయ సేంద్రియ వ్యవసాయ పరిశోధన సంస్థను ఇటీవల ప్రారంభించారు. సిక్కింను ఇటీవల దేశంలోని మొట్టమొదటి సేంద్రియ రాష్ట్రంగా ప్రకటించారు. మొత్తం దేశానికీ, ప్రత్యేకంగా ఈశాన్య ప్రాంతాలకు సేంద్రియ వ్యవసాయంలో తగిన సూచనలనూ, మార్గదర్శకత్వాన్నీ ఈ సంస్థ అంద చేస్తుంది. మరింత తక్కువ ఖర్చుతో ఎక్కువ గిట్టుబాటుగా ఉండే, ప్రకృతికి హాని కలిగించని విధానాలను ఈ సంస్థ ప్రజలకు అందిస్తుంది. ఇందుకు అవసరమైన శిక్షణను కూడ అందచేస్తుంది. దీనికి అవసరమైన ఆర్థిక వనరుల కేటాయింపు సిబ్బంది నియామకం వంటి విషయాలను ప్రభుత్వం చూసుకుంటుంది.

## "బేటీ బచావో, బేటీ పఢావో" పథకం మరో 61 జిల్లాలకు

కేంద్ర మహిళాశిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ బేటి బచావో, బేటీ పఢావో పథకాన్నిమరింత పటిష్టం చేసి, 11 రాష్ట్రాలలోని మరో 61 జిల్లాలకు వర్తించేసింది. గుజరాత్‌లోని నాలుగు జిల్లాలు, హర్యానాలోని ఎనిమిది జిల్లాలు, హిమాచల్ ప్రదేశ్‌లోని రెండు జిల్లాలు, జమ్మూ-కశ్మీర్‌లోని పది జిల్లాలు, మధ్యప్రదేశ్‌లోని రెండు జిల్లాలు, మహారాష్ట్రలోని ఆరు జిల్లాలు, ఢిల్లీలోని రెండు జిల్లాలు, పంజాబ్‌లో పది, రాజస్థాన్‌లోని నాలుగు జిల్లాలు, ఉత్తరప్రదేశ్‌లో పదకొండు, ఉత్తరాఖండ్‌లోని మూడు జిల్లాలు కలిపి మొత్తం 61 జిల్లాలను ఎంపికచేశారు. ఈపథకాన్ని మొదటగా జనవరి 22, 2015న హర్యానాలోని పానిపత్‌లో ప్రారంభించారు. మొదటి దశలో 100 సమస్యాత్మక జిల్లాలలో ప్రారంభించారు.

## "కౌశల్ వికాస్ యోజన"లో పది లక్షలు దాటిన నమోదు

ప్రధానమంత్రి కౌశల్ వికాస యోజన పథకంలో నైపుణ్య శిక్షణార్థుల నమోదు పది లక్షలు దాటింది. కేంద్ర నైపుణ్యభివృద్ధి మంత్రిత్వశాఖ ప్రధాన కార్యక్రమంగా దేశవ్యాప్తంగా 1012 శిక్షణ భాగస్వాముల సహకారంతో ప్రారంభించారు. మొత్తం 382 అంశాలలో 10,28,671 మంది ఉన్నత శిక్షణకోసం నమోదుచేసుకోగా, వారిలో 70 శాతం మంది ఇప్పటికే శిక్షణ పూర్తి చేసుకున్నారు. మొత్తం 29 రాష్ట్రాలు, ఆరు కేంద్రపాలిత ప్రాంతాలలో ప్రారంభించిన ఈ పథకంలో అంతర్జాతీయ స్థాయిలో పోటీపడే విధంగా శిక్షణనిస్తారు. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, తమిళనాడు, పశ్చిమబెంగాల్ మరియు ఆంధ్రప్రదేశ్‌లలో ఎక్కువమంది శిక్షణకోసం నమోదుచేసుకున్నారు.

## లేజర్ పరిశోధన కేంద్రానికి అనుమతి

గురుత్వాకర్షణ తరంగాలపై పరిశోధనలు చేసే మెగా ప్రాజెక్టు "లేజర్ ఇంటర్ఫెరోమీటర్ గ్రావిటేషనల్ వేవ్ అబ్జర్వేటరీ"-ఎల్.ఐ.జి.ఒ. ప్రాజక్టుకు కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయమైన అనుమతిని ఇచ్చింది. కేంద్ర అణుశక్తి విభాగంవారి నేతృత్వంలో పనిచేసే ఈ విభాగం ప్రపంచంలో ఇంతవరకూ అర్థంకాని రహస్యాలను గూర్చి పరిశోధిస్తుంది. ఖగోళశాస్త్ర రహస్యాలు ప్రధానంగా ఈ పరిశోధనలలో వెలుగుచూస్తాయి. మస్సాచుసెట్స్ విశ్వవిద్యాలయం సహకారంతో నడిచే ఈ ప్రయోగశాల శాస్త్రవేత్తలకూ, ఇంజనీర్లకు అనేక ఉపాధి అవకాశాలను కల్పిస్తుంది.

■

ఏప్రిల్ 2016 సంపుటి : 44 సంచిక : 6

ISSN : 0971-8729

# యోజన

ముఖ్య సంపాదకులు: దీపికా కచ్చల్
వరిష్ఠ సంపాదకుడు : విజయకుమార్ వేదగిరి
సంపాదకుడు : మహమ్మద్ సిరాజుద్దీన్

జాయింట్ డైరెక్టర్ (ప్రొడక్షన్): వి.కె. మీనా

e-mail : yojana_telugu@yahoo.co.in
e-mail : yojana.telugu@nic.in

*ఆనోభద్రా క్రతవోయన్తు విశ్వతః (ఉత్తమ భావాలు అన్నివైపుల నుండి రావాలి)*

## ఈ సంచికలో...

1. విధానాలతో మార్పు సాధ్యమా...? 5
– సంజయ్ హజారికా
2. కేంద్ర బడ్జెట్ 2016–17లో ఈశాన్య రాష్ట్రాలకు కేటాయింపులు 8
– యోజన సంపాదక వర్గం
3. ఈశాన్య రాష్ట్రాలు : కొన్ని వాస్తవాలు, గణాంకాలు 9
– యోజన సంపాదక వర్గం
4. ఈశాన్య రాష్ట్రాల్లో విద్యా, ఉపాధి అవకాశాలు – ఒక ముందడుగు – నటాలీ వెస్ట్ ఖర్కోంగర్ 11
5. ఈశాన్య రాష్ట్రాలలో నైపుణ్యాల వెలికితీతకు సమగ్ర కార్యాచరణ పథకం 13
– సంజీవ్ దుగ్గల్
6. ఈశాన్య భారతంలో గిరిజనాభివృద్ధి 16
– ఎన్ సి సక్సేనా
7. ఈశాన్య భారతం : ఆరోగ్యరంగంలో అభివృద్ధి 20
– డా॥ అరుణ భట్టాచార్య చక్రవర్తి
8. ఆరోగ్య సందేశాలు– సమర్థతకి–సాఫల్యానికీ సూచి 22
– డాక్టర్ సంజీవ్‌కుమార్
9. విజ్ఞాన విపంచి 26
10. దర్పణం 29
11. ఈశాన్య రాష్ట్రాల్లో వ్యవసాయం : సేంద్రియ పద్ధతుల్లో సత్ఫలితాలు 31
– నిరేంద్ర దేవ్
12. ఈశాన్య భారత దేశంలో జలమార్గాలు 34
– డా॥ విశ్వపతి త్రివేది
13. ఈశాన్య భారతానికి విద్యుత్ వెలుగులు : సవాళ్లు, అవకాశాలు 37
– కె.రామనాథన్
14. మనకు తెలియని అంబేద్కర్ అర్థశాస్త్ర నిష్ణాతుడు 40
– వెన్నెల మాధవి
15. ఈశాన్య భారతంలో మౌలిక సదుపాయాలు 43
– డాక్టర్ కృష్ణదేవ్
16. ఈశాన్య భారతంలో ఆరోగ్య పరిరక్షణ 47
– డా॥ బిమన్ టాడా

**ప్రణాళికలు, అభివృద్ధి కార్యక్రమాల గురించిన సమాచారాన్ని అందజేసేందుకు, తెలుగు, హిందీ, ఇంగ్లీషు, అస్సామి, బెంగాలి, తమిళం, ఉర్దూ, మరాఠీ, గుజరాతీ, మళయాళం, పంజాబీ, కన్నడ, ఒడియా భాషలలో వెలువడుతున్న మాసపత్రిక.**

## యోజన (తెలుగు) చందా వివరాలు

**1 సంవత్సరానికి - రూ. 230/- 2 సంవత్సరాలకు - రూ. 430/- 3 సంవత్సరాలకు - రూ. 610/-**

**మరిన్ని వివరాల కోసం : 040-27546312 /13 / 14 ఈ ఫోన్ నంబర్లకు సంప్రదించండి.**

**చందాను Bharatkosh.gov.in సైట్‌లో Publications Division లింకును క్లిక్ చేసి ఆన్‌లైన్ ద్వారా చెల్లించవచ్చు :**

ఎడిటర్, **యోజన (తెలుగు),** 205, 2వ అంతస్తు, సి.జి.ఓ. టవర్స్, కవాడిగూడ, హైదరాబాద్ – 500 080.


యోజన ప్రచురించిన వ్యాసాలలో వ్యక్తపరిచిన భావాలు ఆయా రచయితలవే, వారు పనిచేస్తున్న సంస్థలు, ప్రభుత్వ అభిప్రాయాలను అవి ప్రతిబింబించవు.
యోజనలో ప్రచురించే ప్రకటనలలోని అంశాలు ఆయా సంస్థలు, వారి ప్రతినిధులకు చెందినవి. ప్రకటన పాఠం / సారాంశం మూలంగా ఎదురయ్యే ఎటువంటి పర్యవసానాలకు యోజన బాధ్యత వహించదు.

ISSN : 0971-8729

# యోజన

చీఫ్ ఎడిటర్స్ డెస్క్

## సంపాదకీయం:



### ప్రగతి పథంలో ఈశాన్యం.

ఆ ఏడు రాష్ట్రాలనూ ముద్దుగా ఏడుగురు అప్పచెల్లెళ్ళు అంటారు. ఆ ఏడింటినీ సంస్కృతిక బంధం ఒకటిగా చేర్చింది. ఈ ఏడుగురు అప్పచెల్లెళ్ళు, అస్సాం, త్రిపుర, నాగాలాండ్, మేఘాలయ, మణిపూర్, అరుణాచల్ ప్రదేశ్ మరియు, మిజోరాం లకు ఇటీవల సిక్కిం వచ్చి చేరింది. దీనితో ఈ ఎనిమిది రాష్ట్రాలూ, వ్యూహాత్మకంగాను, భౌగోళికంగానూ ఎంతో కీలక స్థానంలో నిలిచాయి. ఈ ప్రాంత సరిహద్దు మ్యాన్మార్, బంగ్లాదేశ్, చైనాలతో అంతర్జాతీయ సరిహద్దులను పంచుకుంటున్నది. ఇంత కీలకమైన స్థానంలో ఉన్నందున, ఈ ఎనిమిది రాష్ట్రాల అభివృద్ధి, దేశానికి ఎంతో కీలకం.

ఈ ఏడు రాష్ట్రాలకు ఎన్నో సారూప్యాలున్నప్పటికీ, సంస్కృతి, భాష, భౌగోళిక–జీవన రీతులు వంటి వైరుధ్యాలు కూడ అంతే తీవ్రంగా ఉన్నాయి. ఒక బీహారీకి, పంజాబీకి ఎంత తేడా ఉంటుందో, ఒక అస్సామీ – ఒక నాగా పౌరునికీ కూడ అంతే వ్యత్యాసముంటుంది. కనుకనే, ఒక బోడో పౌరునికి, ఒక గారో పౌరునికి మనం తికమక పడరాదు. మొత్తంమీద, అధికశాతం ప్రజలు తమ తమ బలమైన సంప్రదాయాలతో కూడిన గిరిజనులు.

ప్రకృతి రమణీయకత, జీవవైవిధ్యాలకు ఈ ప్రాంతం పెట్టింది పేరు. అస్సాంలోని నేషనల్ పార్కు నుండి, మేఘాలయలోని జలపాతాలు, మంచుదుప్పటి కప్పుకున్న కాంచన్ జంగా పర్వతం నుండి, సిక్కింలోని బౌద్ధ దేవాలయాలు మొత్తం ప్రకృతి రమణీయకతకు పెట్టింది పేరు. ఇక్కడి హస్త కళలు, వస్త్రాలు ప్రపంచ ప్రసిద్ధిచెందినవైతే, ఇక్కడి నృత్యాలు ఎలాంటివారికైనా రసోద్దీపన కలిగిస్తాయి.

ఎంతటి స్వర్గధామంలాంటి ఈడెన్ గార్డెన్‌లో కూడ విషపు నాగు ఉన్నట్లు, ఈ ప్రాంతంలో ఉగ్రవాద కార్యకలాపాలు ప్రజలకు శాంతి లేకుండా చేస్తున్నాయి. అభివృద్ధి ఫలాలను ప్రజలకు అందకుండా మింగేస్తున్నాయి. ఇక విద్య, ఉపాధి అవకాశాల గురించి చెప్పేదేముంది? చాలా ఏళ్ళుగా ఈ ప్రాంత ప్రజలు చదువు, ఉపాధికోసం, తమ ప్రాతాలను వదలి వేరే ప్రాంతాలకు వలసలు పోతున్నారు. మాదక ద్రవ్యాలు ఇక్కడ మరో మహమ్మారిలాగా దాపురించాయి. చిన్న, పెద్ద అందరూ దీనికి బలైపోతున్నారు. ఇక్కడి ప్రజలకు వ్యవసాయం ప్రధానవృత్తి. తేయాకు, అల్లం, పండ్లు, కూరగాయలు ఇక్కడి ప్రధాన ఉత్పత్తులు. పూలతోటల పెంపకానికి కూడ ఈ ప్రాంతం ప్రసిద్ధిగాంచింది. ఇక్కడి ఆర్కిడ్ తోటలు ఎంతో పేరుగాంచాయి. అయితే, ఆధునిక వ్యవసాయ పద్ధతులు ఇక్కడి రైతులకు ఇంకా అందుబాటులోకి రాలేదు. దీనితో రైతులకు పెట్టుబడి గిట్టుబాటుగాలేదు. వరదలు ఈ ప్రాంత అభివృద్ధికి ఒక గొడ్డలిపెట్టులాగ ఉన్నాయి. బ్రహ్మపుత్ర నది వరదలకు ఎంతో ఆస్తి నష్టం, ప్రాణనష్టం ప్రతి సంవత్సరం రివాజు అయ్యింది. ఈ సమస్యలన్నింటికీ, శాశ్వత పరిష్కారలను కనుగొనాల్సి ఉంది. అప్పుడే ఈ ప్రాంతం మిగిలిన భారతదేశంతో సమానంగా పరిఢవిల్లగలదు.

■

# విధానాలతో మార్పు సాధ్యమా...?



'యాక్ట్ ఈస్ట్' పాలసీ అమలులో ప్రధానంగా కనెక్టివిటీ, ఈశాన్య రాష్ట్రాల్లోకి విదేశీ పెట్టుబడుల ఆకర్షణలో సవాళ్ళు ఎదురవుతూనే ఉన్నాయి. ఈ ఇబ్బందులను నివారించేందుకు కార్యాచరణకు దిగడమే సరైన వ్యూహం. ప్రభుత్వాలు చొరవను ప్రదర్శిస్తే శాంతి, ఆత్మగౌరవం, న్యాయం ఇనుమడించి ఈశాన్య ప్రాంతాల్లోని యువభారత జనాభా ఆశలు, ఆశయాలు తీరే ఒక ఆశావీచిక కనిపిస్తుంది. ఈ ప్రాంతాల్లో మౌలిక వసతుల నిర్మాణం, వ్యాపారం, అభివృద్ధి కార్యకలాపాలే కాకుండా అంతర్గత రాజకీయ, సామాజిక, ఆర్థిక రుగ్మతలను అధికమిస్తే ఈశాన్య ప్రాంతం భవిష్యత్తు ఉజ్వలంగా మారుతుంది.

ఆగ్నేయసియా ప్రాంతానికి ప్రవేశ, నిర్గమ ద్వారంగా ఈశాన్య ప్రాంతాన్ని తెరవాలన్న ఆలోచనలో భాగంగా ఎన్నో ప్రయత్నాలు 1990 దశకం నుంచి జరుగుతున్నప్పటికీ ఇంతవరకు చెప్పుకోదగ్గ పురోగతి కనిపించలేదు. 1990 నుంచి ఇప్పటికి దీనిపై ఎన్నో చర్చలు, సదస్సులు, అధికార స్థాయిలో ప్రయత్నాలు జరిగాయి. బంగ్లాదేశ్‌తో వాణిజ్య, రాజకీయ సంబంధాలు మెరుగుపరుచు కోవడం ఈ ప్రయత్నంలో ప్రధానాంశం. ఇలా చేయడం వల్ల దక్షిణాసియా, ఆగ్నేయాసియా ప్రాంతాల్లో ఈశాన్యం పాత్ర పెరుగుతుంది. ఈ రెండు ప్రాంతాల్లోను ఈశాన్య రాష్ట్రాలు పోషించే పాత్రపై ప్రధాని ఢాకా, గువాహతి పర్యటనల సందర్భంగా చేసిన ప్రకటనల్లో ప్రస్తావించడమే కాకుండా ఇతర నాయకులు కూడా ఈ విషయం ఎన్నో సందర్భాల్లో ప్రధానితో ప్రస్తావించారు.

ఈశాన్య ప్రాంతం అభివృద్ధి కోసం గతంలో అనుసరించిన 'లుకింగ్ ఈస్ట్' విధానానికి స్వస్తి చెప్పి దక్షిణ, పడమటి ప్రాంతాల వైపు దృష్టిని సారించడం ఇందులో ప్రధానం. మయన్మార్ సైనిక పాలన నుంచి పరివర్తన దశలోకి అడుగు పెట్టినప్పటికీ ఇప్పటికీ అక్కడ ప్రజాస్వామిక పవనాల విషయంలో నెలకొన్న అస్థిర వాతావరణం భారత ప్రభుత్వం తన లుక్ ఈస్ట్ పాలసీని సమీక్షించడానికి ప్రధాన కారణంగా చెప్పవచ్చు. బంగ్లాదేశ్ మద్దతుతో త్రిపురలో దేశంలో మూడవ ప్రధాన ఇంటర్నెట్ గేట్‌వే ప్రారంభం కావడం భారత్‌లో వ్యాపారానుకూల వాతావరణం కల్పనలో ఒక ప్రధానమైన ముందడుగుగా భావించాలి. సరిహద్దుల ఆవలి వైపు ఉన్న దేశాల నుంచి వస్తున్న వ్యాపార ప్రతినిధివర్గాలు తరచుగా ఎంతో ప్రశాంతంగా ఉండే త్రిపుర రాజధాని అగర్తలను సందర్శిస్తూ ఉండడం కూడా ఆ నగరంలో కొత్త శక్తిని నింపుతోంది. ఇతర ఈశాన్య రాష్ట్రాలతో పోల్చితే త్రిపురలో స్థిరమైన ప్రభుత్వం పనిచేస్తూ చక్కని సేవలందించేందుకు సిద్ధంగా ఉండడం కూడా ఆ రాష్ట్రానికి కలిసి వచ్చే అంశం. ఉగ్రవాదం అనేది అక్కడ గత చరిత్రగా మారిపోయింది. రాష్ట్రంలో శాంతి సామరస్యాలు వెల్లివిరుస్తూ ఉన్నందు వల్ల సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టం, కల్లోలిత ప్రాంతాల చట్టం రెండింటినీ 2015 సంవత్సరంలో రాష్ట్రప్రభుత్వం ఉపసంహరించింది. డార్జిలింగ్ వంటి పర్యాటక ప్రాధాన్యం గల ప్రదేశాలను సందర్శించే వారు కోల్కతా మీదుగా చుట్టూ

**సంజయ్ హజారికా,** ప్రొఫెసర్, జామియ మిలియా ఇస్లామియా, అలీగఢ్
E-mail: sanjoyha@gmail.com

తిరిగి వచ్చేందుకు బదులు నేరుగా రావడానికి వీలు కల్పిస్తూ బగ్దోగ్రాలో బంగ్లాదేశ్ కాన్సులర్ సర్వీసులు ప్రారంభిస్తోంది. ఇవి చిన్న అడుగులే అయినా భవిష్యత్తులో మంచి పురోగతికి అవకాశం ఉన్న చర్యలే అనడంలో ఎలాంటి సందేహం లేదు. గతంలో అయితే బంగ్లాదేశ్ సందర్శనకు అనుమతి పొందడం ఒక పీడకలగా ఉండేది. అప్పటికి సమీపంలోని బంగ్లాదేశ్ కాన్సులర్ కార్యాలయాలు కోల్కతా, అగర్తలలో ఉండేవి. ఈ కార్యాలయాలకు వచ్చి వీసా పొందాల్సి వచ్చేది. ఇందుకు కనీసం రెండు మూడు రోజుల వ్యవధి పట్టేది. ఇది వేలాది రూపాయల ఖర్చుతో కూడుకున్న పని. బంగ్లాదేశీయులు భారత భూభాగంలోకి అధికారికంగా అడుగు పెట్టాలన్నా (అక్రమ వలసదారులను పక్కన పెడితే) ఇంతే ఇబ్బంది పడాల్సివచ్చేది. సిల్హెట్, గువాహతిల్లో కాన్సులర్ కార్యాలయాలు తెరిచే ప్రయత్నం జరగడంతో కొన్ని దశాబ్దాల పాటు ఉభయ దేశాల ప్రజలు పడిన ఈ ఇబ్బందులకు తెర పడింది.

ఇన్ని ప్రయత్నాలు జరిగినా 'యాక్ట్ ఈస్ట్' పాలసీ అమలులో ప్రధానంగా కనెక్టివిటీ, ఈశాన్య రాష్ట్రాల్లోకి విదేశీ పెట్టుబడుల ఆకర్షణలో సవాళ్ళు ఎదురవుతూనే ఉన్నాయి. ఈ ఇబ్బందులు నివారించేందుకు తీసుకోవలసిన చర్యలపై కాగితాల మీద ఏవో ప్రతిపాదనలు చేయడం లేదా చర్చించడం కన్నా నేరుగా వాటిని నివారించే చర్యల కార్యాచరణకు దిగడమే సరైన వ్యూహం.

ఆరు దశాబ్దాలకు పైగా ఈశాన్య ప్రాంతం అంతర్గత తిరుగుబాట్లతో పాటు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా వెలుపలి నుంచి జరిగిన కుట్రలతో అల్లాడిపోయింది. ఈ కారణంగా ఈశాన్య ప్రాంతం యావత్తుకు 'కల్లోలిత ప్రాంతం' అనే ముద్ర పడింది. ఆ ముద్రను చెరిపివేయడం అంత తేలిక కాదు. ఈశాన్య ప్రాంతాలకు పెట్టుబడులు ఆకర్షించేందుకు ప్రభుత్వం ఎంత గట్టి ప్రయత్నం చేస్తున్నా ఆ ప్రాంతం అనాకర్షణీయంగా నిలిచేందుకు ఇదే కారణం. భద్రతాదళాలు వ్యక్తం చేసిన ఆందోళనలు, ఆ ప్రాంతాలు ప్రధాన జీవన స్రవంతికి వెలుపల ఉన్నందు వల్ల ఏర్పడిన విశ్వాసరాహిత్యం ఈ ప్రాంతాల విషయంలో కేంద్రప్రభుత్వ పాలసీల నిర్మాణానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయి. భద్రతాదళాలు మానవ హక్కుల ఉల్లంఘనలకు పాల్పడడం పరిస్థితిని మరింత సంక్లిష్టం చేసింది.

"ఈశాన్యాన్ని ఆగ్నేయాసియాతో అనుసంధానం చేస్తామని చెప్పడం తేలికే. కాని భద్రతాదళాల ఉక్కు పిడికిలిలో కొనసాగుతున్న సరిహద్దులతో కూడిన ఈ ప్రాంతాల్లో ఆ లక్ష్యాన్ని సాధించడం అంత తేలికేనా" అని 2014లో షిల్లాంగ్ టైమ్స్ ఎడిటర్ పాట్రీషియా ముఖిమ్ వ్యాఖ్యానించారు. ఈ పాలసీ వల్ల ప్రధానంగా కోస్తా తీరం అధికంగా ఉన్న పశ్చిమబెంగాల్, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలే ప్రయోజనం పొందాయి. రోడ్డు, రైలు మార్గాల ద్వారా రవాణా కన్నా అంతర్జాతీయ వ్యాపారానికి సముద్ర రవాణా ప్రధాన వాహికగా నిలవడమే ఇందుకు కారణం. దీర్ఘకాలంగా మౌలిక వసతుల లేమి ఈ ప్రాంతాన్ని కుంగదీసింది. వ్యాపార వర్గాలకు అత్యంత ప్రధానం భూ సేకరణ. భూమి దీర్ఘకాలికంగా ఈశాన్య ప్రాంతాల్లోని సాంప్రదాయిక, రాజకీయ, సామాజిక విభాగాల్లో ఆధిపత్యం ఉన్న చేతుల్లో బందీగా ఉండిపోవడం వల్ల ఆ వర్గాలు పరస్పరం సంఘర్షించుకోవడం పరిపాటి. పారిశ్రామికంగా పురోగమన స్థితిలో ఉన్న రాష్ట్రాలు మహారాష్ట్ర, తమిళనాడుతో పోల్చితే ఈశాన్య ప్రాంతాలు చాలా వెనుకబడిపోయి ఉండడం కూడా పెద్ద లోటు.

ప్రధానంగా సముద్రవాణిజ్యానికి దూరంగా ఉన్న ఈశాన్య ప్రాంతాలకు బంగాళాఖాతంతో అనుబంధం చేకూర్చడం ఈ వ్యూహంలో ప్రధానాంశం అవుతుంది. అగర్తల నుంచి బంగ్లాదేశ్‌లోని అఖౌరా మీదుగా చిట్టగాంగ్ రేవుకు రైల్వేలైన్‌తో అనుసంధానం కల్పించడం వల్ల ఈ లోటు తీరుతుంది. ఈ తరహా రైల్‌లింక్ ఏర్పాటులో కూడా పురోగతి చాలా మందకొడిగా ఉంది. ఈ అంశంపై కనీసం రెండు దశాబ్దాలుగా చర్చలు జరుగుతున్నాయి. తాజాగా బి.జి.వర్గీస్‌తో సహా ఉభయ దేశాలకు చెందిన పలువురు విధాన నిపుణులు దీని ప్రాధాన్యతను ప్రముఖంగా ప్రస్తావిస్తూనే ఉన్నారు. ఇది సాకారం అయితే బంగ్లాదేశ్‌కు భారత మార్కెట్ల నుంచి ప్రధానంగా ఈశాన్య భారతం నుంచి వస్తువులు అందుబాటులోకి రావడమే కాకుండా ప్రధాన సముద్ర పోర్టు ద్వారా బంగ్లాదేశీ మార్కెట్లు, ఇతర అంతర్జాతీయ మార్కెట్ల నుంచి కూడా వస్తువులు అందుబాటులోకి వస్తాయి.

ఈశాన్య రాష్ట్రాల్లో వెదురు పెంపకం ద్వారా ఏటా 20 మిలియన్ టన్నుల వెదురు పండించవచ్చునని, తద్వారా లక్షలాది మందికి ఉపాధి కల్పించవచ్చునని నేషనల్ బాంబూ మిషన్ అంచనా. కాని దీని ప్రాధాన్యం క్షేత్ర స్థాయిలో కనిపించడంలేదు. రేజర్ బ్లేడ్లు, పెన్సిళ్ళు, చేపలు–ఇతర ఆహార పదార్థాల నుంచి కార్లు, టెలివిజన్ సెట్ల వరకు అన్నింటికీ ఈశాన్య ప్రాంతం దిగుమతులపైనే ఆధారపడుతోంది. ఇది ఒక మార్కెట్‌గానే తప్ప ఉత్పత్తి కేంద్రంగా మారలేదు. వివిధ ఉత్పత్తులకు విలువ జోడించి ఇళ్ళలోని అలమారాల్లో అధిక కాలం మనగలిగే ఉత్పత్తులు అందించే ప్రాసెసింగ్ సెంటర్లు లేని కారణంగా పళ్ళు, కూరగాయలు...చివరికి పశువులు కూడా ఈశాన్య ప్రాంతాల నుంచి బంగ్లాదేశ్, మయన్మార్‌లకు ఎగుమతి అవుతున్నాయి.

మానవాభివృద్ధి సూచికల రీత్యా

కూడా ఈశాన్య ప్రాంతం ఎంతో వెనుకబడి ఉంది. బాలింత మరణాల సంఖ్యలో అస్సాం భారత్‌లోనే అత్యంత దారుణమైన స్థితిలో ఉంది. ప్రతి లక్ష మంది బాలింతల్లోను 300 మరణాల రేటుతో మానవాభివృద్ధి సూచికలో కనిష్ఠ స్థాయిలో ఉండిపోవడమే కాకుండా ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్‌ల కన్నా కూడా చాలా దారుణ స్థితిలో నిలిచింది. 2005-06లో నమోదైన 490 మరణాల రేటుతో పోల్చితే ఎంతో మెరుగుపడినా మానవ వనరుల గౌరవం, సమానత్వం విషయంలో పరిస్థితి మెరుగుపడకపోతే లుక్ ఈస్ట్/వెస్ట్/సౌత్ విధానం ఏదైనా వృథా ప్రయాసగానే మిగిలిపోతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ అంశంపై ప్రధానంగా దృష్టిని సారించాల్సి ఉంది.

అంతర్జాతీయ వాతావరణ మార్పుల వల్ల ఎదురవుతున్న వాతావరణపరమైన సవాలు మరో ప్రధానమైన అంశం. ఈ సవాలు కారణంగా ఈశాన్యం నుంచి భారత్‌లోని ఇతర ప్రాంతాలకు వలసలు పెరిగిపోయాయి. బ్రహ్మపుత్ర లోయ తరచుగా వరదలకు గురవుతూ ఉండడం పరిపాటి అయింది. తాజాగా సంభవించిన వరదల్లో 350 వరకు గట్లు కొట్టుకుపోయాయి. అయినా బ్రహ్మపుత్ర వరద గట్లు ఎంత బలహీనంగా ఉన్నాయన్న విషయంలో అటు ఈశాన్యంలో గాని, ఇటు దేశీయంగా గాని ఎలాంటి చర్చ జరగకపోవడం అత్యంత విచారకరమైన అంశం. దీనికి కూడా మనం ఒక ప్రత్యామ్నాయం ఆలోచించాల్సిన అవసరం ఉంది.

యాక్ట్ ఈస్ట్/లుక్ ఈస్ట్ విధానం ప్రశంసనీయమైనదే అయినా దానిలో ఒక మౌలికాంశం మీద ఎవరి దృష్టి పడలేదు. భారీ పరిమాణంలో వస్తువులను నదీమార్గంలో రవాణా చేసేందుకు అనువైన విధానం ఒకటి లేకపోతే అది బ్రహ్మపుత్ర ఇసుక పర్రల్లో కూరుకుపోయి ముందుకు కదలలేని పరిస్థితి వస్తుంది. అందుకే ఆ ప్రాంతాన్ని తెరిచేందుకు అక్కడ నదీ రవాణాను మెరుగుపరచాలన్న రవాణా మంత్రిత్వ శాఖ నిర్ణయం ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. సంవత్సరంలో కనీసం మూడు నుంచి ఐదు నెలల కాలం పాటు ఈశాన్య ప్రాంతాల్లోని రైలు, రోడ్డు వసతులు నీటిలో మునిగిపోవడం పరిపాటి అన్నది ఇక్కడ ప్రధానంగా గమనించాల్సిన అంశం. వర్తమాన లేదా భవిష్యత్తు ఆర్థిక విధానం ఏదైనా ఈ అంశంపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించాలి. మరోమాటలో చెప్పాలంటే వైపరీత్యాల నిర్వహణ వ్యవస్థ ప్రణాళిక రూపకల్పన నుంచి అమలు వరకు అన్ని దశలకు విస్తరించాలి. అయితే బ్రహ్మపుత్ర నదీపరీవాహక ప్రాంతాల్లో నివశిస్తున్న స్థానిక ప్రజల జీవనంపై దీని ప్రభావం ఎంతమేరకు ఉంటుందన్నది కూడా ఇక్కడ పరిశీలించాల్సిందే. బ్రహ్మపుత్ర నదిపై భారీ సంఖ్యలో తిరిగే నౌకల వల్ల ఈ ప్రాంతంలోని చేపలు, ఇతర జలచరాల పరిస్థితి ఏమిటి? వాటికి నష్టం కలిగితే అదే జీవనాధారంగా బతుకుతున్న పలు కుటుంబాల జీవనాధారం ఏమైపోతుంది? వంటి ఆందోళనలు కూడా ఉన్నాయి.

ఈశాన్య రాష్ట్రాల్లోని నదీజలాల్లో ఇలాంటి కార్యకలాపాలు పెరిగిపోవడం వల్ల జరిగే మౌలిక నష్టాలపై పలు నివేదికలు వెలువడ్డాయి, ఆ ప్రాంతానికి జరిగే నష్టాన్ని మదింపు చేశాయి. నదుల్లో నివశిస్తున్న జీవరాశులు, మత్స్యసంపద, ఈ ప్రాంతాలకే పరిమితమైన చేపల జాతులు, ఆయా జలసంపదపై ఆధారపడి జీవనం సాగిస్తున్న మత్స్యకారుల పరిస్థితి ఏమిటి? ఈ ప్రాంతాల్లోని డాల్ఫిన్స్ పరిస్థితి ఏమిటి? దక్షిణాసియాలో అంతరించిపోయే ముప్పును ఎదుర్కొంటున్న నదీజల జీవరాశుల్లో డాల్ఫిన్స్ ప్రధానమైనవి. ప్రస్తుతం వాటి సంఖ్య 400 కన్నా తక్కువ స్థాయికి పడిపోయిందని అంచనా.

ఇన్ని అవరోధాలున్నప్పటికీ చిత్తశుద్ధితో కృషి చేయగల విజయం సాధించగల కొన్ని రంగాలు మాత్రం ఉన్నాయి. 'సాఫ్ట్' విభాగాల్లో దక్షిణాసియా విశ్వవిద్యాలయాలు, మీడియా, హస్తకళా సంస్థలతో సహకారం విస్తరించుకోవచ్చు. సంగీతకారులను, లలితకళాకారులను ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి పంపడం ద్వారా ప్రజాబాంధవ్యాన్ని పటిష్ఠం చేసుకోవచ్చును. తొలిదశ అధికార స్థాయి చర్చల్లో ఈ అంశాలపై దృష్టి కేంద్రీకరించాలని ఆయా ప్రతినిధివర్గాలను కోరవచ్చు. దీనికి ప్రభుత్వాలు, అంతర్జాతీయ సంస్థలు, కార్పొరేషన్ల సహకారం చాలా అవసరం.

మొత్తం మీద ఈశాన్య ప్రాంతం ఎదుర్కొంటున్న సవాళ్ళను స్థానిక వర్గాల ప్రజలు, రాష్ట్రప్రభుత్వాల మధ్య చర్చలతో పరిష్కరించుకోవచ్చును. ఈ చర్చల వల్ల ఈశాన్య ప్రాంత ప్రదేశాలకు విదేశీ పర్యాటకుల సందర్శన పెరగడమే కాకుండా విదేశీ వ్యాపారవేత్తల పెట్టుబడులు కూడా వస్తాయి. (ఏ వ్యాపారవేత్త కూడా ఈశాన్య ప్రాంతాల్లో ఒక అలవాటుగా మారిపోయిన నిరంతరాయంగా జరిగే సమ్మెలు, బంద్‌ల వాతావరణంలో తమ ఉత్పత్తి, వ్యాపార ప్రయోజనాలకు భంగం కలగడాన్ని ఇష్టపడదు).

ప్రభుత్వాలు ఈ రకమైన చొరవను ప్రదర్శిస్తే శాంతి, ఆత్మగౌరవం, న్యాయం ఇనుమడించి ఈశాన్య ప్రాంతాల్లోని యువభారత జనాభా ఆశలు, ఆశయాలు తీరే ఒక ఆశావీచిక కనిపిస్తుంది. ఈ ప్రాంతాల్లో కళ్ళెదుట కనిపించే మౌలిక వసతుల నిర్మాణం, వ్యాపారం, అభివృద్ధి కార్యకలాపాలే కాకుండా అంతర్గత రాజకీయ, సామాజిక, ఆర్థిక రుగ్మతలను కూడా రూపుమాపే చర్యలు తీసుకోవడం వల్ల ఈశాన్య ప్రాంతం మొత్తం భవిష్యత్తు ఉజ్వలంగా మారుతుంది. ■

సమగ్రాభివృద్ధి

# కేంద్ర బడ్జెట్ 2016-17లో ఈశాన్య రాష్ట్రాలకు కేటాయింపులు



**ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సిక్కిం రాష్ట్రాన్ని దేశంలో తొలి సేంద్రీయ రాష్ట్రంగా ప్రకటించడంతో ఈశాన్య ప్రాంతానికి ప్రాముఖ్యత పెరిగింది. కొత్తగా ఏర్పాటు చేసిన రహదారుల అభివృద్ధి పథకానికి 150 కోట్ల రూపాయలు కేటాయించారు. బడ్జెట్‌లో ఈశాన్య అభివృద్ధి ఆర్థిక సంస్థ (ఎన్.ఈ.డి.ఎఫ్.సి) నిధులను 30 కోట్ల రూపాయల నుంచి 75 కోట్ల రూపాయలకు పెంచారు. దీంతో ఈ ప్రాంతంలో ప్రధాన మంత్రి అంకుర పరిశ్రమల కార్యక్రమానికి తోడ్పాటు లభిస్తుంది.**

సేంద్రీయ ఉత్పత్తుల విలువ అభివృద్ధి, రహదారుల అనుసంధానం, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యతతో కేంద్ర బడ్జెట్‌లో ఈశాన్య రాష్ట్రాల మంత్రిత్వ శాఖకు నిధుల కేటాయింపును పెంచారు. గత ఏడాది ఈ మంత్రిత్వ శాఖకు 2,334.50 కోట్ల రూపాయలు కేటాయించగా, 2016-17 బడ్జెట్‌లో రూ. 2,400 కోట్లు కేటాయించారు. ఈశాన్య రాష్ట్రాల సమగ్ర అభివృద్ధికి బడ్జెట్‌లో ప్రాధాన్యత నిచ్చారు. రహదారుల అనుసంధానం, నైపుణ్యాభివృద్ధి, సేంద్రీయ ఉత్పత్తుల విలువ అభివృద్ధి తదితర అంశాలకు ప్రాముఖ్యత నిచ్చారు. వినూత్న రీతిలో ఒక్క సేంద్రీయ ఉత్పత్తుల విలువ అభివృద్ధి పథకానికి 115 కోట్ల రూపాయలు కేటాయించారు. ఈ పథకం ఈశాన్య ప్రాంతంలో పెద్ద మార్పుకు నాంది పలుకుతుంది. దీని వల్ల ఈ ప్రాంతంలో ఇప్పటి వరకు సేంద్రీయ వ్యాపార సంస్థలకు ఊతం లభిస్తుంది. దేశం నలుమూలల నుంచి అంకుర సంస్థలు ఈశాన్య రాష్ట్రాలకు వచ్చి ఈ ప్రాంతం లో తమ సంస్థలు ఏర్పాటు చేయడానికి దోహద పడుతుంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సిక్కిం రాష్ట్రాన్ని దేశంలో తొలి సేంద్రీయ రాష్ట్రంగా ప్రకటించడంతో ఈశాన్య ప్రాంతానికి ప్రాముఖ్యత పెరిగింది.

ఈశాన్య రాష్ట్రాలకు ఈ బడ్జెట్‌లో కేంద్రంలోని 56 మంత్రిత్వ శాఖల ద్వారా 33097.02 కోట్ల రూపాయలు కేటాయించారు. ఇది గత ఏడాది బడ్జెటులో కేటాయించిన 29087.93 కోట్లా రూపాయల కంటే 14 శాతం ఎక్కువ. కాలపరిమితి లేని కేంద్ర వనరుల (ఎన్.ఎల్.సి.పి.ఆర్) నిధులను 90 కోట్ల నుంచి 2016-17 బడ్జెట్‌లో రెండు వందల కోట్ల రూపాయాలకు పెంచారు. ఈశాన్య మండలి నిధులను 7 వందల కోట్ల నుంచి ఈ ఏడాది 795 కోట్లకు పెంచారు.


కొత్తగా ఏర్పాటు చేసిన రహదారుల అభివృద్ధి పథకానికి 150 కోట్ల రూపాయలు కేటాయించారు. ఈ పథకం కింద ఈశాన్య రాష్ట్రాల్లో అంతర్ రాష్ట్ర రహదారులను అభివృద్ధి చేయడానికి దోహద పడుతుంది. దీనికి తోడు, ఈశాన్య రాష్ట్రాల్లో రహదారుల నిర్మాణం, నిర్వహణకు ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడిబి) నిధులు సమకూరుస్తోంది.

బడ్జెట్‌లో ఈశాన్య అభివృద్ధి ఆర్థిక సంస్థ (ఎన్.ఈ.డి.ఎఫ్.సి) నిధులను 30 కోట్ల రూపాయల నుంచి 75 కోట్ల రూపాయలకు

***తరువాయి 10వ పేజీలో...***

యోజన సంపాదక వర్గం

# ఈశాన్య రాష్ట్రాలు : కొన్ని వాస్తవాలు, గణాంకాలు




**కేంద్రంలోని వివిధ మంత్రిత్వ శాఖలు/విభాగాలూ తమకు కేటాయించిన స్థూల బడ్జెట్‌లో కనీసం 10 శాతం నిధులను ఈశాన్య ప్రాంతాల అభివృద్ధికి ఖర్చు చేయాల్సి వుంటుంది. సరిహద్దు ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర హోంమంత్రిత్వ శాఖ సరిహద్దు ప్రాంతాల అభివృద్ధి కార్యక్రమం కింద నిధులు మంజూరు చేస్తుంది. అంతర్జాతీయ సరిహద్దు ప్రాంతం లో నివశిస్తున్న ప్రజల సంక్షేమం కోసం ప్రత్యేక అభివృద్ధి నిధి కింద ప్రస్తుత ఆర్థిక సంవత్సరం లో రూ.27757.86 లక్షలు మంజూరు చేశారు.**

## ఈశాన్య రాష్ట్రాలకు జారీ చేసిన NLCPR నిధులు

ఈశాన్య రాష్ట్రాల్లో మౌలిక సదుపాయాల కొరతను తీర్చడానికి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు సమర్పించిన ప్రాధాన్యతా జాబితాలకు అనుగుణంగా అవసరమైన నిధులను కాల పరిమితి లేని కేంద్ర వనరుల (Non Lapsable Central Pool Resources, NLCPR) నుంచి మంజూరు చేశారు. NLCPR కింద ఫిబ్రవరి 2016 వరకు సుమారు 1569 ప్రాజెక్టులకు రూ. 14309.23 కోట్లను మంజూరు చేశారు. ఇందులో రూ. 5846.20 కోట్లతో చేపట్టిన 890 ప్రాజెక్టులు పూర్తయ్యాయి. రూ.8463.01 కోట్లతో చేపట్టిన 679 ప్రాజెక్టుల నిర్మాణం వివిధ దశల్లో వుంది. దీనికి అదనంగా, గత మూడు సంవత్సరాల్లో రూ. 3867.90 కోట్లతో 247 ప్రాజెక్టులను కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణంలో వున్న ప్రాజెక్టులకు (26 ఫిబ్రవరి 2016 వరకు) రూ. 376.61 కోట్లను విడుదల చేశారు. మరో 17 కొత్త ప్రాజెక్టులకు 120.97 కోట్ల రూపాయలు మంజూరు చేశారు.

## దేశ ఈశాన్యం లోని సరిహద్దు రాష్ట్రాల్లో ఆధునిక సౌకర్యాలు

ఈశాన్య ప్రాంతంలో సాంఘిక – ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేయడానికి కేంద్రం పలు చర్యలు చేపట్టింది. కేంద్రంలోని వివిధ మంత్రిత్వ శాఖలు/విభాగాలూ తమకు కేటాయించిన స్థూల బడ్జెట్‌లో కనీసం 10 శాతం నిధులను ఈశాన్య ప్రాంతాల అభివృద్ధికి ఖర్చు చేయాల్సి వుంటుంది. ఈ శాన్య రాష్ట్రాల్లో మౌలిక సదుపాయాల కొరతను తీర్చడానికి కేంద్రం లోని ఈశాన్య రాష్ట్రాల మంత్రిత్వ శాఖ, ఈశాన్య మండలి (NEC) నిధులు కేటాయిస్తాయి.

కేంద్రంలోని ఈశాన్య రాష్ట్రాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో NLCPR కింద ఇప్పటి వరకు వైద్య రంగం అభివృద్ధికి 53 ప్రాజెక్టులకు రూ. 63313.36 లక్షలు, విద్యారంగ అభివృద్ధికి 168 ప్రాజెక్టులకు గాను రూ.145416.55 లక్షలు మంజూరు చేశారు. ఈశాన్య రాష్ట్రాల్లో వివిధ రంగాల అభివృద్ధిని NEC నిర్వహిస్తోంది. పారిశ్రామిక రంగంలో NEC ఆమోదంతో రూ.17322.12 లక్షల వ్యయంతో చేపట్టిన 41 ప్రాజెక్టులు

యోజన సంపాదక వర్గం

కొనసాగుతున్నాయి. వైద్యరంగంలో 58 ప్రాజెక్టులను రూ. 40870.85 లక్షలతో చేపట్టారు. విద్యా రంగం లో రూ. 24294.98 లక్షలతో 78 ప్రాజెక్టులను NEC ఆధ్వర్యంలో చేపట్టారు.

సరిహద్దు ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర హోంమంత్రిత్వ శాఖ సరిహద్దు ప్రాంతాల అభివృద్ధి కార్యక్రమం (BADP) కింద నిధులు మంజూరు చేస్తుంది. అంతర్జాతీయ సరిహద్దు ప్రాంతం లో నివశిస్తున్న ప్రజల సంక్షేమం కోసం ప్రత్యేక అభివృద్ధి నిధి కింద ప్రస్తుత ఆర్థిక సంవత్సరం లో రూ. 27757.86 లక్షలు మంజూరు చేశారు.

కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ లోని పాఠశాల విద్యా, అక్షరాస్యతా విభాగం రాష్ట్రీయ మాధ్యమిక్ శిక్షా అభియాన్ (RSMA) కింద ఈశాన్య రాష్ట్రాల్లో 630 కొత్త పాఠశాలలను మంజూరు చేసింది. మరో 3,334 పాఠశాలలలో విద్యా ప్రమాణాలను పెంచడానికి పూనుకుంది.

ఈశాన్య ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి వున్న అవరోధాల పై అంచనా వేయడం ఈశాన్య ప్రాంతాల్లో సాంఘిక–ఆర్థికాభివృద్ధికి, మౌలిక వసతుల ఏర్పాటుకు ఎదురవుతున్న సవాళ్ళను ఈశాన్య మండలి ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్నది. ఇందులో ఈశాన్య రాష్ట్రాలలో ప్రత్యేక వేగవంతమైన రహదారుల అభివృద్ధి కార్యక్రమం (SARDP-NE) కింద చేపట్టిన రహదారి ప్రణాళిక, విద్యుత్తు పంపిణీ, సరఫరా, ఈశాన్య ప్రాంతాల విజన్ డాక్యుమెంటు–2020 ప్రధానమైనవి. ఈశాన్య ప్రాంతాల్లో పేదరిక నిర్మూలన కార్యక్రమం, పర్యాటక రంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక, వైద్య సిబ్బంది విస్తరణకు ప్రణాళిక, విమానాల అనుసంధానానికి వున్న అవకాశాలపై అధ్యయనం చేయడం ముఖ్యమైనవి.

ఈశాన్య మండలి ఏర్పడినప్పటి నుండి ఇప్పటివరకు వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల కింద రూ. 12756 కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. ఈశాన్య రాష్ట్రాల్లో రవాణా, సమాచార వ్యవస్థ, రహదారులు, బస్సులు, ట్రక్కుల టెర్మినళ్ళ ఏర్పాటు, విమానాశ్రయాలు, విద్యుత్తు ఉత్పత్తి, సరఫరా, సాగునీటి నిర్వహణ,విద్యా, క్రీడలు, వ్యవసాయం, పరిశ్రమలు, పర్యాటకం, శాస్త్ర సాంకేతిక రంగం, ఉపాధి అవకాశాలకు ఈ నిధులు వెచ్చించారు.

ఈశాన్య రాష్ట్రాల్లో 10949 కిలోమీటర్ల మేర ఆర్థిక ప్రాముఖ్యత కలిగిన అంతర్ రాష్ట్ర రహదారులు, 11 బస్సు టెర్మినళ్ళు, మూడు అంతర్ రాష్ట్ర ట్రక్కు టెర్మినళ్ళు, ఏర్పాటు చేయడం ఈశాన్య మండలి సాధించిన ప్రగతి అని చెప్పవచ్చు. భారత విమానాశ్రయాల ప్రాధికార సంస్థ (AAI) గౌహతి, సిల్చర్, జోర్హాట్, దిమాపూర్, అగర్తలా, ఇంఫాల్ తదితర 12 ప్రదేశాల్లో విమానాశ్రయాల అభివృద్ధికి ఈశాన్య మండలి 60 శాతం నిధులను అందించింది.

■

*8వ పేజీ తరువాయి...*

## కేంద్ర బడ్జెట్ 2016-17లో ఈశాన్య రాష్ట్రాలకు కేటాయింపులు

పెంచారు. దీంతో ఈ ప్రాంతంలో ప్రధాన మంత్రి అంకుర పరిశ్రమల కార్యక్రమానికి తోడ్పాటు లభిస్తుంది. నైపుణ్యాభివృద్ధికి నిధులను 16 కోట్ల నుంచి 56 కోట్ల కు పెంచడం వల్ల అంకుర పరిశ్రమలకు మరింత సహకారం లభిస్తుంది. ఈ ప్రాంతంలో పరిశ్రమలను ప్రోత్సహించడానికి ప్రధాని ప్రకటించిన మూడేళ్ళ పన్ను మినహాయింపు తో పాటు మూడు నెలల నిష్క్రమణ కాలాన్ని అమలు చేస్తున్నారు. వీటికి తోడు, ఈశాన్య రాష్ట్రాల మంత్రిత్వ శాఖ నూతన పరిశ్రమలకు "వెంచర్ ఫండ్" ను అందిస్తోంది. ఈశాన్య రాష్ట్రాల్లో గ్రామీణ ప్రజల ఉపాధి అవకాశాలకు ప్రాధాన్యతనిస్తున్నారు. ఇందు కోసంబడ్జెట్‌లో 150 కోట్ల రూపాయలు కేటాయించారు.

ఈశాన్య రాష్ట్రాల గురించి దేశవ్యాప్తంగా అవగాహన కలిగించడం వాటి అభివృద్ధికి ఎంతో ముఖ్యం. ఇందు కోసం బడ్జెట్‌లో నిధులను 10.50 కోట్ల నుంచి 17 కోట్లకు పెంచారు. ఈశాన్య ప్రాంతాల మంత్రిత్వ శాఖ ఈ ఏడాది ఫిబ్రవరి12 నుంచి 14 వరకు న్యూ ఢిల్లీలో "డెస్టినేషన్ నార్త్ ఈస్ట్ –2016" కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈశాన్య ప్రాంతాల చేనేతలు, వివిధ ఉత్పత్తుల ప్రదర్శనలతో ఈ ప్రాంతంలో వున్న సామర్థ్యం, అవకాశాల గురించి వివరించేందుకు ఈశాన్య ప్రాంతాల మంత్రిత్వ శాఖ ఇటువంటి మరిన్ని ప్రదర్శనలను నిర్వహించనుంది. 2016–17 మొదటి త్రైమాసికంలో ముంబై, బెంగుళూరులలో ఇటువంటి ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నారు.

'యాక్ట్ ఈస్ట్ విధానం' కింద భారత్–బాంగ్లాదేశ్ మధ్య రైల్వేల అభివృద్ధికి ఈశాన్య ప్రాంతాల మంత్రిత్వ శాఖ చొరవ చూపుతోంది. భారత్ వైపు నుంచి 587 కోట్ల రూపాయలను ఈశాన్య ప్రాంతాల మంత్రిత్వ శాఖ కేటాయిస్తుంది.

దేశంలో ఉన్నత విద్యా సంస్థల అభివృద్ధికి ప్రత్యేకంగా కేటాయించిన 10 వేల కోట్ల రూపాయలలో ఈశాన్య ప్రాంతాలకు ప్రత్యేకించి 1623 కోట్ల రూపాయలు కేటాయించారు. బోడోల్యాండ్ ట్రైబల్ కౌన్సిల్ కోసం ప్రభుత్వం మూడు వందల కోట్ల రూపాయలను కేటాయించింది.

■

ఆచారణ

# ఈశాన్య రాష్ట్రాల్లో విద్యా, ఉపాధి అవకాశాలు - ఒక ముందడుగు



ఈశాన్య రాష్ట్రాల సగటు అక్షరాస్యత జాతీయ సగటుకన్నా అధికంగా ఉన్నప్పటికీ విద్యావిధానం అసంఘటితంగా ఉండి అనేక పరిస్థిలు, సవాళ్ళతో సతమతమౌతున్నది. ముఖ్యంగా సాంకేతిక విద్యలో సరైన అవకాశాలు లేవు. అంతేకాదు, 8వ తరగతిలోపు సగానికిపైగా మధ్యలో బడి మానేస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానం, వ్యవహారిక పరిజ్ఞానం లేకుండా కేవలం పాఠ్య పుస్తకాలను మాత్రమే అభ్యసించడం వల్ల ఉపాధి అవకాశాలు బాగా తగ్గిపోతున్నాయి.

ఎనిమిది రాష్ట్రాలతో కూడిన ఈశాన్య ప్రాంతంలో అక్షరాస్యతా శాతం 77.76గా ఉంది. ఇది 2011 మార్చి నాటికి భారతదేశ సరాసరి అక్షరాస్యతా శాతం 74.04 కంటే అధికంగా ఉన్నప్పటికీ ఈశాన్య భారతంలో విద్యావిధానం అవ్యవస్థీకృతంగా ఉంది. అనేక పరిమితులూ, సవాళ్ళతో సతమతమౌతోంది. ముఖ్యంగా సాంకేతిక రంగంలో ఉన్నత విద్యను అభ్యసించాలకునేవారు ఎక్కువమంది ఈ ప్రాంతం నుంచి బయటకు వెళ్లి చదువు కోవలసివస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్న విద్యా విధానం జాతీయ స్థాయి విద్యా విధానంతో సమానంగా లేకపోవడమే ఇందుకు ప్రధానకారణం. ఈ రాష్ట్రాల్లో విద్యా విధానం ఇంకా సంప్రదాయ పద్ధతిలోనే కొనసాగుతోంది. ఈ రకమైన మూస విద్యా విధానం కారణంగా ఉన్నత చదువుల కోసం విద్యార్థులు ఇతర ప్రాంతాలకు తరలి పోవడంతో పాటు ఒకటవ తరగతి నుంచి 8వ తరగతిలోపు దాదాపు 50.05 శాతం విద్యార్థులు తమ చదువులను మధ్యలోనే ఆపివేస్తున్నారు. ఈ విధంగా దేశ వ్యాప్తంగా మధ్యలో చదువు ఆపివేసిన విద్యార్థుల సంఖ్య 40.80 శాతం మాత్రమే కావడం గమనార్హం.

సాంకేతిక పరిజ్ఞానం, వ్యవహారిక పరిజ్ఞానం లేకుండా కేవలం పాఠ్యపుస్తకాలను మాత్రమే అభ్యసించడం వల్ల ఉపాధి అవకాశాలు తగ్గడంతో పాటు నిరుద్యోగం పెరుగుతోంది. ఈ ప్రాంతంలో ఉన్నత పాఠశాల విద్యనూ అభ్యసించినవారు, పట్టభద్రులు, డిప్లమో చేసినవారు, ఎంతో మంది ప్రస్తుతం నిరుద్యోగులుగానూ లేదా తమ చదువు, పరిజ్ఞానం కంటే తక్కువ స్థాయి ఉద్యోగాలతో సరిపెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. దీనికితోడు దేశంలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే ఈశాన్య ప్రాంతాల్లో నాణ్యమైన విద్యా అవకాశాలు, వృత్తి విద్యా సంస్థల కొరత ఎక్కువగానే ఉన్నది. అంతర్గతంగా ఉన్న వ్యతిరేక అంశాలతోపాటు బంద్‌లు వంటి అనేక బాహ్యకారణాలవల్ల కూడా ఈశాన్య ప్రాంతంలో విద్యా విధానం తీవ్ర ఇబ్బందులకు గురౌతోంది. వీటివల్ల సంవత్సరంలో దాదాపు వంద రోజులు విద్యా సంస్థల్లో తరగతులు జరగటం లేదు. ఈ కారణాలవల్ల తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుల కోసం బయటి ప్రాంతాలకు పంపుతున్నారు. ఇది ఒక్కోసారి పిల్లల అక్రమ రవాణా వంటి వ్యక్తిగత నష్టాలకు కూడా దారి తీస్తోంది. 12 ఏళ్లలోపు పిల్లలను మణిపూర్ రాష్ట్రం నుంచి బయటకు పంపరాదని సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేయడానికి ఇది కూడా కారణం.

**నటాలీ వెస్ట్ ఖర్కోంగర్,** అసోసియేట్ ప్రొఫెసర్, ఐ.ఐ.యం, షిల్లాంగ్.
E-mail : nwk@iimshillong.in

ఈశాన్య రాష్ట్రాల నుండి విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్ళడానికి ఒక సంతృప్తి కరమైన విద్యావిధానం లేకపోవడంతో పాటు విద్రోహ కార్యకలాపాలు కూడా మరో కారణంగా ఉంది. ఈ ప్రాంతంలోని దాదాపు అన్నిరాష్ట్రాలు ప్రత్యక్షంగానో లేదా పరోక్షంగానో విద్రోహచర్యల ప్రభావనికి నష్టపోతున్నాయి. ఉదాహరణకు అస్సాంలో ఉల్ఫా మరియు కర్బీ ఆంగ్లాంగ్ అందోళన, నాగాలాండ్‌లో నాగాలిం వివాదం మరియు నాగా-కుకీ పోరాటం, అరుణచల్ ప్రదేశ్‌లో చక్మా హజోంగ్ మరియు అరుణాచలీయుల పోరాటంతో పాటు అన్ని ఈశాన్య రాష్ట్రాల్లో నెలకొన్న స్థానికుల, స్థానికేతరుల మధ్య సమస్యలు మొదలైనవి చెప్పుకోవచ్చు. సరిహద్దుల్లో అక్రమ సరకు రవాణా, తీవ్రవాదానికి తోడు తీవ్రవాదూలూ, సైన్యానికి మధ్య కొనసాగుతున్న పోరాటం కారణంగా ఈశాన్య ప్రాంతంలోని కొన్ని రాష్ట్రాల్లో జనజీవనం కష్టసాధ్యంగా మారింది. తీవ్రవాద బృందాలకు ఆశ్రయం కల్పించడం, రక్తపాతం, తరుచు సమ్మెలు సైనిక దళాలకు ప్రత్యేక అధికారాల చట్టం, ప్రభుత్వ శాఖల్లో అవినీతి ధోరణి వంటి సాంఘిక, రాజకీయ కారణాల వల్ల ఎన్నో దశాబ్దాలుగా ఈ ప్రాంతంలో ఆశాంతి నెలకొని ఉన్నది. ఏడాదిలో దాదాపు వంద రోజుల పాటు సమ్మెలు, దుకాణాలు, పాఠశాలలూ మూసివేయడం, ప్రజా రవాణా వ్యవస్థ స్తంబించడం వంటి వాటితో – ఈ ప్రాంతంలో చాలా చోట్ల ప్రజా జీవనం పీడకలలా తయారైంది. ఈ ప్రాంతాల్లో కనీసం రెండు గంటలు కూడా విద్యుత్ సరఫరా అందుబాటులో ఉండడం లేదు. వారంలో ఒకటి రెండు సార్లు మాత్రమే నీటి సరఫరా జరగుతోంది. సాయంకాలం నాలుగు గంటలు దాటితే దుకాణాలన్నీ మూత పడుతున్నాయి. రాత్రి 8 గంటలు దాటితే రోడ్లన్నీ నిర్మానుష్యంగా ఉంటున్నాయి. ఈ ప్రాంతంలోని కొన్ని రాష్ట్రాల్లో రాత్రిళ్ళు కాపలాకాసే పోలీసులుకానీ, తీవ్రవాదులు కానీ ఎవరినైనా వేధించవచ్చు లేదా హతమార్చవచ్చు అనే భయంతో ప్రజలు జీవనం సాగిస్తున్నారు.

అనేక సంవత్సరాలుగా ఇటువంటి దుర్భర పరిస్థితుల్లో తమ స్వంత గ్రామాలు, పట్టణాలు, నగారాల్లో నివసిస్తున్న ఈశాన్య రాష్ట్రాల ప్రజలు భారతదేశంలోని పెద్ద నగరాలకు ప్రపంచీకరణ ఫలాలు చేరేదాకా తమ స్వంత రాష్ట్రాలను విడిచి పోవడానికి ఉత్సాహం చూపిస్తూనే ఉంటారు. ప్రపంచీకరణ ప్రయోజనాలు ఈశాన్య ప్రాంతాల్లోని యువతను ఉపాధి వైపు – ముఖ్యంగా బి.పి.ఓ.,ల్లో, షాపింగ్ మాల్స్‌లో అలాగే ఆతిధ్య రంగంలో ఉద్యోగాల వైపు ఆకర్షిసున్నాయి. దీనికి తోడు ఈశాన్య ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో సరైన ఉపాధి అవకాశాలు లేకపోవడంతో ఈ ప్రాంతాల్లోని యువత బయట ప్రాంతాల్లో ఉద్యోగాల కోసం పరుగులు తీస్తున్నది.

వివిధ జాతుల మధ్య విభేదాలు, పోరాటాలు, విద్రోహ చర్యల వల్ల వందలాది గ్రామాలు ధ్వంసమయ్యాయి. ఎంతోమంది హత్యకు గురయ్యారు. మరెంతో మంది నిరాశ్రయులయ్యారు. అనాధలయ్యారు. చాలా మంది అంతర్గతంగా ఒక చోటు నుంచి మరొక చోటుకు తరలిపోగా మరికొంతమంది స్నేహితులు, బంధువులతో కలిసి ఢిల్లీ, కొలకత్తా, ముంబాయి, బెంగళూరు వంటి నగరాలకు వలసపోయారు. ఈశాన్య రాష్ట్రాల్లో చిన్న, పెద్ద నదులు తరచు వరదలకు గురై ఎక్కడికక్కడ నీరు పొంగుతూ ఉంటుంది. ఇటువంటి జల ప్రళయాల వల్ల సరుకు రవాణాకు, కమ్యునికేషన్ వ్యవస్థకు అంతరాయం కలుగుతూ ఉంటుంది. తద్వారా ఆదాయ వనరులు దెబ్బ తింటున్నాయి. దీంతో అర్హత కలిగిన విద్యావంతులైన విద్యార్థులు అవకాశాల కోసం ఇతర ప్రాంతాలకు తరలి పోతున్నారు. అంతేకాదు ఇక్కడ ఆధునిక సదుపాయాలైన విద్యుత్, ఇంటర్నెట్ సౌకర్యాలు కూడా సమృద్ధిగా లేవు. ఒక్కోసారి స్థానిక వార్తాపత్రికలు కూడా సుదూర ప్రాంతాలకు సకాలంలో చేరటం లేదు. ఈ ప్రాంతంలోని సమస్యలపై అటు పత్రికల్లో కాని, ఇటు ఎలక్ట్రానిక్ మీడియాలో కానీ కావలసినంత ప్రచారం జరగటం లేదు. అందువల్ల ఈశాన్య ప్రాంతం నుంచి వలస వచ్చేవారిలో ఎక్కువ మంది తమకు ఢిల్లీయే అత్యంత అనువైన అవాసయోగ్యమైన, ఉపాధి లభించే ప్రాంతంగా భావిస్తున్నారు.

ఈశాన్య ప్రాంతం నుంచి దేశంలోని ఇతర ప్రాంతాలకు వలసలను తగ్గించాలంటే విద్యావిధానంలో సమూలమైన మార్పులు తీసుకురావాలి. పారిశ్రామిక శిక్షణ, పరిమాణంలో నాణ్యత, పరిశోధన, వస్తువుల ఉత్పత్తివైపు యువత ఆకర్షింపబడేలా అనుభవాలను, అవకాశాలనూ కల్పించడం వంటి వాటిపై దృష్టి పెట్టాలి. ఉపాధి అవకాశాలు మెరుగుపడే విధంగా వ్యవస్థాత్మక సామాజిక బాధ్యత (సి.ఎస్.ఆర్ ఇనీషియేటివ్) కింద ఈ ప్రాంతంలో సాధారణ విద్యా సంస్థలను, సాంకేతిక విద్యా సంస్థలను నెలకొల్పడానికి కొన్ని కంపెనీలు కూడా ముందుకు రావాలి.

"మేక్-ఇన్-ఇండియా" "స్టార్ట్-అప్-మోడల్" కింద అవకాశాలను ఉపయోగించు కుని ఉపాధి కల్పన కోసం ఈశాన్య రాష్ట్రాలు తగిన ప్రతిపాదనలను రూపొందించాలి. ఇందుకోసం ఆయా రాష్ట్రాల్లో అందుబాటులో ఉండే ప్రాధమిక, మాధ్యమిక సేవా రంగాలు, ఖనిజాలు, అడవులు, పెట్రోలు, సహజ వాయువు, జలవనరులు, మత్స్య సంపద, పట్టు పురుగుల పెంపకం, పర్యాటక రంగం మొదలైన వాటిలో భవిష్యత్ ఉపాధి అవకాశాలపై సమాచారాన్నీ, వివరాలనూ సిద్ధం చేసుకోవాలి. ఈ సమాచారం ఆధారంగా విద్యా సంబంధమైన పాఠ్యప్రణాళికలను రూపొందించుకోవాలి. ఇందుకోసం పొరుగు దేశాలలో ఉన్న సదుపాయాలు, అధ్యాపకుల పనితీరు, సెలవుల్లో శిక్షణ, నూతన ఆవిష్కరణలకు అవసరమైన పరికరాలు, నైపుణ్యం, మొదలైన అంశాలపై దృష్టి పెట్టాలి.

*తరువాయి 15వ పేజీలో...*

# ఈశాన్య రాష్ట్రాలలో నైపుణ్యాల వెలికితీతకు సమగ్ర కార్యాచరణ పథకం



**ఈశాన్య భారతదేశం పరిస్థితులను పరిశీలిస్తే దేశీయ మార్కెట్‌కు అవసరమయ్యే కొన్ని ప్రత్యేక ప్రయోజనాలు ఇక్కడ ఉన్నాయి. పొరుగున ఉన్న బంగ్లాదేశ్, మయన్మార్ దేశాల వల్ల దక్షిణ, తూర్పు ఆసియా మార్కెట్‌లకు ఈశాన్య భారత ప్రాంతం ప్రవేశ ద్వారంగా ఉంది. మౌలిక వసతులను సద్వినియోగం చేసుకుంటే పేదరికం, నిరుద్యోగం తగ్గి అభివృద్ధి సుగమం అవుతుంది. శాంతి భద్రతల సమస్యలు తగ్గిపోతాయి.**

**ఈశాన్య రాష్ట్రాలలో ప్రభుత్వ ప్రాధాన్యతలు :**

ఈశాన్య రాష్ట్రాలలో నైపుణ్యాల వెలికితీతకు ప్రభుత్వం సింగిల్ పాయింట్ ఆఫ్ కాంటాక్టు ద్వారా అంకిత భావంతో కృషి చేస్తున్నది. ఇక్కడి ప్రతి రాష్ట్రాన్నీ జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ జాతీయ నైపుణ్యాభివృద్ధి ప్రాధికార సంస్థ ప్రాజెక్టుల్లో భాగస్వామిగా చేయటం, వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు నిధులు సమాన నిష్పత్తిలో అందేలా చూడటం.

యువతలో ఉన్న అద్భుతమైన నైపుణ్యాన్ని వెలికితీసి దానిని ఉపయోగించుకోవటం ద్వారానే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని, ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ఇచ్చిన పిలుపు మేరకు దేశంలోని అన్ని ప్రాంతాల్లో ఉన్న నైపుణ్య మిషన్ శాఖలు ఇందుకు దీటుగా కార్యకలాపాలు విస్తరిస్తున్నాయి. వెనుకబడ్డ ఈశాన్య ప్రాంతాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడం – కేంద్ర ప్రభుత్వ లక్ష్యాలలో ఒకటి. ఈశాన్య ప్రాంతాలలో నైపుణ్యాన్ని అభివృద్ధి చేసి ఈశాన్య భారతాన్ని అతి పెద్ద నైపుణ్య వేదికగా చేయడం అత్యవసరం. దేశంలోని ఈశాన్య ప్రాంతం అన్ని విధాలుగా స్వయం సమృద్ధి సాధిస్తే అది ఆ ప్రాంతానికే కాక దేశ ఆర్థికాభివృద్ధికి కూడా ఎంతో లాభం.

ఈశాన్య రాష్ట్రాలలో నైపుణ్య అభివృద్ధి కేంద్రాలు, క్రొత్త జిల్లాల్లో పారిశ్రామిక శిక్షణా సంస్థలు ఏర్పాటయ్యాయి. కేంద్ర నైపుణ్య అభివృద్ధి శాఖామంత్రి రాజీవ్ ప్రతాప్ రూఢీ ఈశాన్య ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. ఆ ప్రాంతంలో ఉన్న 40 పారిశ్రామిక మండళ్ల నుంచి ఒక్కొక్క సభ్యుడిని ఈ నైపుణ్య అభివృద్ధి కేంద్రాలకు సహకారం అందించవలసిందిగా కోరారు. నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా కార్యక్రమాలను పునర్నిర్మాణం చేసి అందులో ఈ సభ్యులకు భాగస్వామ్యం కల్పించాలని కోరారు. ఎనిమిది ఈశాన్య రాష్ట్రాలైన అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, మణిపూర్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, సిక్కిం, త్రిపురలో ఈ పథకాలను ప్రారంభించారు. అయితే త్రిపుర మిగిలిన రాష్ట్రాల కంటే విద్య తదితర అంశాలలో అభివృద్ధి చెందినా వ్యవసాయంలో వెనుకబడి

**సంజీవ్ దుగ్గల్,** మేనేజింగ్ డైరెక్టర్, సెంటమ్ లెర్నింగ్.
E-mail : sanjiv.duggal@centumlearning.com

అభివృద్ధిలో కుంటుపడింది. దీనిని దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాంతాలలో కేవలం ఉద్యోగ అవకాశాలను కల్పించడమే కాకుండా మౌలిక సదుపాయాలతో అన్ని విధాలుగా అభివృద్ధిని సాధించడం కోసం కేంద్ర ప్రభుత్వం ఈశాన్య ప్రాంతాల అభివృద్ధి మంత్రిత్వ (2004) శాఖకు 2015-16లో 2,362 కోట్ల రూపాయలను కేటాయించింది.

ఈశాన్య భారతదేశం పరిస్థితులను పరిశీలిస్తే దేశీయ మార్కెట్‌కు అవసరమయ్యే కొన్ని ప్రత్యేక ప్రయోజనాలు ఇక్కడ ఉన్నాయి. పొరుగున ఉన్న బంగ్లాదేశ్, మయన్మార్ దేశాల వల్ల దక్షిణ, తూర్పు ఆసియా మార్కెట్‌లకు ఈశాన్య భారత ప్రాంతం వాణిజ్యానికి ప్రవేశ ద్వారంగా ఉంది. ఈ ప్రాంతంలో ఉన్న సారవంతమైన భూముల వల్ల ఎక్కువ అభివృద్ధికి అవకాశం ఉంది. మౌలిక వసతులను సద్వినియోగం చేసుకుంటే పేదరికం, నిరుద్యోగం తగ్గి అభివృద్ధి సుగమం అవుతుంది. శాంతి భద్రతల సమస్యలు తగ్గిపోతాయి.

దేశంలో యువ శ్రామిక సామర్థ్యం అనేది ఇప్పుడు సంక్షోభంలో ఉంది. నాణ్యత గల నైపుణ్యం అనేది ఇప్పటికీ ఒక సవాలుగా నిలుస్తోంది. 2014లో నిర్వహించిన ఒక సర్వే ప్రకారం దేశంలో నైపుణ్యకొరత 57 శాతం ఉంది. 78 శాతం పారిశ్రామిక సంస్థలు వెల్లడించిన విషయమిది. నైపుణ్యంగల యువత లభించకపోవడంతో పారిశ్రామిక వర్గాల్లో ఆందోళన నెలకొంది. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 14 మిలియన్ల ఉద్యోగులు పనుల్లో ఉండగా, ఇందులో 2 మిలియన్ల ఉద్యోగులు మాత్రమే శిక్షణ పొందిన వారు.

కేంద్ర నైపుణ్య అభివృద్ధి మండలి సమాచారం ప్రకారం - ప్రతి 100 మందిలో 4.5 మంది మాత్రమే నైపుణ్యం ఉన్నవారు. ఈశాన్య రాష్ట్రాలలోనూ ఇదే పరిస్థితి. కొరియాలో 96 శాతం, జపాన్‌లో 80 శాతం నిపుణత కలిగిన కార్మికులు ఉన్నారు. ఈ దేశాలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు వెళ్ళాల్సిన అవసరం ఉంది. తగినంత నైపుణ్యం లేక అభివృద్ధి వెనుకబడింది.

## ఈశాన్య భారతంలో నైపుణ్య సవాళ్లు

నైపుణ్యతలను సమగ్రంగా అందించగలిగే ఒక విశ్వవిద్యాలయాన్ని ఈశాన్య భారతంలో తక్షణం ఏర్పాటు చేయవలసిన అవసరం ఉంది. ఈ విశ్వవిద్యాలయం ద్వారా వివిధ "వలస మద్దతు కేంద్రాలను" ఏర్పాటు చేసి ఉద్యోగ అవకాశాలను పెంపొందించాలి.

ఇక్కడ దీర్ఘ కాలంగా ఉన్న వామపక్ష తీవ్రవాదాన్ని సమసిపోయేలా చేసి స్థానిక వనరుల ద్వారా ఉపాధి అవకాశాలు పెరిగేలా ఈ విశ్వవిద్యాలయం పనిచేయాలి. ఈశాన్య రాష్ట్రాలన్నీ కొండ ప్రాంతాలు కాబట్టి ఆగ్రివుడ్ సాగు ఎక్కువ చేయవచ్చు. ఈ ఆగ్రివుడ్ ఉత్పత్తులన్నీ ప్రాసెసింగ్ చేసి ఉత్పత్తి చేసుకోవచ్చు.

2011 నుండి 2021 మధ్య కాలంలో ఈ ప్రాంతాలలో కేవలం 2.6 మిలియన్ల ఉద్యోగాలు మాత్రమే సృష్టించబడ్డాయి. ఇందులో సగం డిమాండ్ అస్సాంకే ఉంది.

2011-2022 మధ్య 14 మిలియన్ల మంది ఉద్యోగాలు ఆశించారు. ఈ ప్రాంతంలో 2.6 మిలియన్ల ఉద్యోగాలు ఉండగా ఉద్యోగాల సరఫరా 16.8 మిలియన్లుగా ఉంది. కాబట్టి స్థానిక ఉపాధి, వలస ఉపాధి ఇలా ఒక జంట విధానం కోసం నైపుణ్యాలను అభివృద్ధి చేయాలి.

మరొక సవాల్ ఏమిటంటే నైపుణ్యాలను అభివృద్ధి చేయడం. ఇందుకోసం దేశంలోని మారు మూల ప్రాంతాల్లో యువతను విద్య, నైపుణ్యం పరంగా అభివృద్ధి పరచడం. గత ముప్పై ఏళ్లుగా శిక్షణ అభివృద్ధి జరిగినప్పటికి అది కార్పోరేట్ ఉద్యోగుల సామర్థ్యం పెంచడానికి మాత్రమే ఉపయోగపడింది. నేను తరచుగా వివిధ వేదికల ద్వారా చెప్పిందేమిటంటే మహిళలకు వృత్తి విద్య తప్పని సరి చేయడం గురించి. దేశంలో ఉద్యోగాలు రావాలి. కేంద్ర ప్రభుత్వం మహిళల అభివృద్ధికోసం "బేటీ బచావో - బేటీ పఢావో" అలాగే ఇండియా డిజిటల్ పథకాలను నిర్వహిస్తోంది. అలాగే ప్రభుత్వ లక్ష్యం మహిళలు - తప్పనిసరిగా కంప్యూటర్లు ఉపయోగించాలి. అలాగే ప్రైవేట్ రంగంలో కూడా మహిళలు కంప్యూటర్‌లను ఉపయోగించేలా పారిశ్రామిక వేత్తలకు ప్రభుత్వం సూచనలు చేయాలి. మహిళలకు ప్రైవేట్ రంగంలో కంప్యూటర్ల ద్వారా ఉద్యోగ అవకాశాలు పెరిగేలా చూడాలి.

ప్రభుత్వం ప్రైవేట్ పరిశ్రమలన్నింటిని ఒక గొడుగు కిందకి తీసుకువచ్చి మహిళలకు సాంకేతిక నైపుణ్యత పెరిగేలా చూడాలి.

## నైపుణ్య వారధులు నిర్మించాలి.

దేశంలోని ఈశాన్య రాష్ట్రాలలో బహుళ నైపుణ్య కేంద్రాలను ఏర్పాటు చేయడం తక్షణ అవసరంగా ఉంది. ఈ ప్రాంతాలలో ఉన్నత విద్యకు పని ఆధారిత అభ్యాసం అవసరం. డిమాండ్‌కు తగ్గట్టుగా నైపుణ్యాన్ని అభివృద్ధి చేయడం, ఉద్యోగ అవకాశాలు పెంచి వలసలు లేకుండా చూడటం అవసరం. ఈశాన్య ప్రాంతాలలో ఇప్పటికీ వ్యవసాయం పైనే మక్కువ ఉంది. దీంతో పాటు సాంకేతిక నైపుణ్యాన్ని అభివృద్ధి చేసి మార్కెట్ అవసరాలకు అనుగుణంగా

ఉపాధి అవకాశాలను పెంపొందించాలి. ఈశాన్య ప్రాంతాలలో ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం మార్గసూచి తయారు చేయాలి.

ఈశాన్య రాష్ట్రాలలో పండ్ల పెంపకం, సాగు కూడా చెప్పుకోదగ్గ స్థాయిలో ఉంది. యువతకు ఉపాధి అవకాశాలను పెంపొందించే లక్ష్యంతో "ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్"లు విరివిగా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉన్నది. అలాగే ఇక్కడ చేనేతను కూడా బాగా అభివృద్ధి చేయడానికి అవకాశాలు ఉన్నాయి. ఇక్కడ స్థానిక అవసరాల కోసం చేనేతను బాగా ఉపయోగిస్తారు.

ఇక్కడ తయారైన చేనేత వస్త్రాలను దేశమంతటా వినియోగిస్తున్నారు. చేనేతకు సాంకేతిక నైపుణ్యం జోడిస్తే ఈ ప్రాంతంలో భారీ స్థాయిలో కంపెనీలు ఏర్పాటయ్యే అవకాశం ఉంది. సరైన పర్యావరణ వ్యవస్థ, స్మార్ట్ రాజధాని, మార్కెట్ నైపుణ్యాల కలయికతో ఈశాన్య రాష్ట్రాలు అభివృద్ధి బాటపట్టే అవకాశం ఉంది. ఈ ప్రాంతంలో కంప్యూటర్ బిల్లింగ్ సిబ్బంది కొరత ఉంది. హొటల్ మరియు హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్, వైద్య, బి.పి.వో, ఇంజనీరింగ్, టెక్స్‌టైల్, ఎలక్ట్రానిక్స్ రంగాలలో వృత్తి నైపుణ్యాలను పెంచే విధంగా శిక్షణ ఇవ్వాలి. పెద్ద పెట్టుబడుల ద్వారా పరిస్థితులలో మార్పు వస్తుంది. ఈశాన్య భారతంలోని గ్రామీణ ప్రాంతాలలో వివిధ శిక్షణా సంస్థలను నెలకొల్పి, శిక్షణ ఇచ్చి, సూక్ష్మరుణాల ద్వారా వారు స్వయం ఉపాధి సాధించేలా చూడాలి. పబ్లిక్- ప్రైవేట్ భాగస్వామ్యం ద్వారా ఆర్థిక స్వయం సమృద్ధి లక్ష్యందిశగా ముందుకు సాగాలి.

■

*12వ పేజీ తరువాయి...*

## ఈశాన్య రాష్ట్రాల్లో విద్యా, ఉపాధి అవకాశాలు - ఒక ముందడుగు

ఈశాన్య రాష్ట్రాల్లో ఎక్కువమంది ఇంగ్లీషులో మాట్లాడేవారు ఉండడం. భిన్న సంస్కృతుల సమ్మేళనంగా విద్యార్థులు ఉండడం, అక్షరాస్యత అధికశాతంలో ఉండడం. ఒక బలమైన ప్రోత్సాహకర అంశం. దీన్ని మరింత మెరుగు పరచవలసిన అవసరం ఉంది. ఇక ఇప్పుడు కావలసింది అధ్యయనం కాదు – ఆచరణ మాత్రమే. ఈ విషయమై ఇంతవరకు నిర్వహించిన అనేక సదస్సులు, వర్క్ షాపులు, గోష్టులు, సభలు, సమావేశాలు, చర్చలు మొదలైనవి ఎటువంటి ఆశించిన ఫలితాలనూ ఇవ్వలేదు. అయితే ఇప్పుడు మనం చేయవలసిందల్లా సరైన వ్యూహంతో, సరైన మార్గంలో ముందుకు వెళ్ళడమే. ఈశాన్య భారతాన్ని ప్రపంచంలోనే ఒక ఆదర్శవంతమైన పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దడానికి వివిధ స్థాయిల్లోని ప్రభుత్వ శాఖలతో పాటు ఐ.సి.సి., ఎఫ్.ఐ.సి.సి., ఫిన్నెర్ వంటి సంస్థలు, పౌర సమాజం తమ మేధస్సునంతా ఉపయోగించవలసి ఉంటుంది. పర్యాటక రంగంలో ఈశాన్య భారతానికి ఉన్న సామర్థ్యం గురించి ఇప్పటికే మనం చాలా మాట్లాడు కున్నాం. ఇప్పుడు మనకు కావలసిందల్లా ఒక ప్రణాళిక రూపొందించుకోవడం, తదను గుణంగా పని చేయడం. ఈ ప్రాంతంలోని ముఖ్యమైన పర్యాటక ప్రాంతాలను కలుపుతూ, మౌలిక సదుపాయాలను మెరుగుపరిచే విధంగా ఒక బహుముఖ వ్యూహాన్ని అత్యంత వేగంగా అమలుచేయాలి. కొండలు ఎక్కే క్రీడ ''ట్రెక్కింగ్''లో శిక్షణ ఇచ్చే సంస్థలకు ప్రోత్సాహకాలను ప్రకటించి, పర్యావరణ హిత పర్యాటకాన్ని ప్రోత్సహించాలి. అదేవిధంగా సాహస క్రీడల కేంద్రాన్ని నెలకొల్పి ఈ క్రీడల్లో నిపుణుల చేత శిక్షణ ఇప్పించాలి. ఈశాన్య రాష్ట్రాలను పర్యాటక పరంగా గోవా, కేరళ రాష్ట్రాలతో సమానంగా అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రూపొందించిన "పర్యాటక విధానం" కూడా చాలా ముఖ్యమైనది.

స్థానికంగా ఉండే అవకాశాలను ఉపయోగించుకునేందుకు సమర్థమైన ఒక రుణ ప్రణాళికను అమలు చేయడం ద్వారా సమాజ అభివృద్ధికి ఒక పటిష్టమైన వ్యూహాన్ని రూపొందించి సంస్థాపరమైన సమస్యలను అధిగమించవచ్చు. తూర్పు భారతదేశంలోని సంప్రదాయ స్వదేశీ మార్కెట్‌తో పాటు తూర్పు ప్రాంతంలోని ప్రధాన రాష్ట్రాలకూ, పొరుగున ఉన్న బంగ్లాదేశ్, మయన్మార్ దేశాలకూ ఈ ప్రాంతం ఏంతో అందుబాటులో ఉంది. ఇక్కడ ఉన్న అవకాశాలను అందిపుచ్చుకునేందుకూ, బ్యాంకు లావాదేవీల ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఆర్థిక సంస్థలు తమ వంతు కృషి చేయవలసిన అవసరం ఉంది. ఆర్థిక అవకాశాలను ముఖ్యంగా టీ, కాఫీ, సుగంధ, ఔషధ మొక్కలు, పండ్ల తోటల ఉత్పత్తులను ఉపయోగించుకునే విధంగా ప్రత్యేక ఆర్థిక మండళ్ళ (ఎస్.ఈ.జెడ్)ను నెలకొల్పవచ్చు. ఇక్కడ నెలకొనిఉన్న డిమాండ్‌కు అనుగుణంగా ఒక పటిష్టమైన పరిశోధనా, అభివృద్ధితో కూడిన విధానాన్నీ, పరిజ్ఞానాన్నీ చిన్న పారిశ్రామిక వేత్తలకు అనుకూలంగా అమలుచేయవచ్చు. అలాగే షిల్లాంగ్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ అఫ్ మేనేజ్‌మెంట్ (ఐ.ఐ.ఎమ్) వంటి ప్రతిష్టాత్మక సంస్థల సహకారంతో సమర్థవంతమైన సరఫరా విధానాన్ని, మార్కెట్ విధానాన్ని రూపొందించవచ్చు.

వీటన్నింటికంటే ముందు, రాజకీయ పట్టుదల, ఉన్నతోద్యోగుల మద్దతు, నిబద్ధత, సుపరిపాలన, వ్యాపారం చేసేందుకు సుముఖతతో పాటు ప్రయివేటు సంస్థలు, ప్రభుత్వం, ప్రజల భాగస్వామ్యం (పి.పి.పి) విధానం మొదలైనవి చాలా అవసరం. ప్రస్తుత విద్యా విధానాన్ని పటిష్టపరచి, ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు అందరూ కలసి కట్టుగా ప్రయత్నం చేయాలి. తద్వారా ఈశాన్య రాష్ట్రాలనుంచి ఇతర ప్రాంతాలకు వలసలను అరికట్టడంతో పాటు తీవ్రవాద సమస్యలను కూడా సమర్థంగా ఎదుర్కోవచ్చు.

■

సమగ్ర వ్యూహం

ప్రత్యేక వ్యాసం

# ఈశాన్య భారతంలో గిరిజనాభివృద్ధి



**ఈశాన్య భారత దేశంలో 220కి పైగా జాతులు, తెగలకు చెందిన ప్రజలు జీవిస్తున్నారు. అందరూ గిరిజనులే అయినా, మళ్లీ వారిలో సంస్కృతీ పరంగా, ఆచార వ్యహారాల పరంగా, భాష పరంగా ఇతరత్రా అనేక విభేదాలు, వ్యత్యాసాలు ఉన్నాయి. ఈ సాంస్కృతిక వైరుధ్యాలు గిరిజనుల మధ్య ఘర్షణలకు దారి తీస్తున్న సందర్భాలు కుడా అనేకం ఉన్నాయి. ఈ విభేదాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా అభివృద్ధి వేగాన్ని అడ్డుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈశాన్య రాష్ట్రాల గిరిజనుల అభివృద్ధి కోసం ప్రత్యేక చట్టాన్ని తెచ్చింది.**

మన దేశంలో ఉన్న మొత్తం గిరిజన జనాభాలో 12 శాతం మంది మాత్రమే ఎనిమిది ఈశాన్య రాష్ట్రాల్లో ఉన్నారు. అయితే, మిగిలిన రాష్ట్రాల్లో మైనారిటీలుగా ఉన్న గిరిజనులు, మిజోరాం, మేఘాలయ నాగాలాండ్ రాష్ట్రాల్లో మాత్రం ఆయా రాష్ట్రాల జనాభాలో 80 శాతం వరకు ఉన్నారు. అందుకే ఇతర రాష్ట్రాల కంటే ఈ రాష్ట్రాలలో గిరిజనులు రాజకీయ ప్రాధాన్యతను పొందగల్గు తున్నారు. అయితే, అనేక దశాబ్దాలుగా ఈ పరిస్థితి క్రమక్రమంగా మారుతూ వస్తోంది. ఇరుగు పొరుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు దేశం బంగ్లాదేశ్ నుంచి కుడా ఈశాన్య రాష్ట్రాలలోకి ఆర్థిక వలసలు యధేచ్ఛగా కొనసాగుతున్నాయి. ఫలితంగా,స్థానిక జనాభాకు వ్యతిరకంగా జనాభా సమతుల్యత దెబ్బతింటోంది. ఆ వివరాలలోకి వెళితే, 1951లో త్రిపుర జనాభాలో 56 శాతం ఉన్న గిరిజన జనాభా, 2001 నాటికి 30 శాతానికి పడిపోయింది. అలాగే అరుణాచల్ ప్రదేశ్ లో 1951లొ 90 శాతానికి పైగా ఉన్న గిరిజన జనాభా, 1991 నాటికే 64 శాతానికి పడిపోయింది. అస్సాంలోని మైదాన ప్రాంత గిరిజనులు, బోడోలు, బోడో స్వయం ప్రతిపత్తి మండలి ప్రాంతంలోని అనేక జిల్లాలలోనే మైనారిటీలుగా మారిపోయారు. బోడో భూములను వలస వచ్చిన ముస్లింలు బలవంతంగా ఆక్రమించుకున్నారు. ఈ క్రమంలో అనేక సందర్భాలలో హింస చోటు చేసుకుంది.

జనాభా విభజనలో వచ్చిన మార్పుల ఫలితంగా గిరిజనులు- గిరిజనేతరుల (అస్సాంలో ఆహోమ్స్, మణిపూర్‌లో మైతీస్, త్రిపురలో బెంగాలీలు) మధ్య అధికార సంబంధాలలో అసమతుల్యత చోటు చేసుకుంది. రాజకీయ,ఆర్థిక అధికార సంబంధాలలో గిరిజనేతరులదిపై చేయి అయింది. అలాగే గిరిజనులలో కూడా పెద్ద పెట్టున వైవిధ్యం చోటు చేసుకున్నది. ఈశాన్య భారత దేశంలో 220కి పైగా జాతులు, తెగలకు చెందిన ప్రజలు జీవిస్తున్నారు. అందరూ గిరిజనులే అయినా, మళ్లీ వారిలో సంస్కృతీ పరంగా,ఆచార వ్యహారాల పరంగా, భాష పరంగా ఇతరత్రా అనేక విభేదాలు, వ్యత్యాసాలు ఉన్నాయి. ఎవరి సంస్కృతి వారిది, ఎవరి సంప్రదాయాలు వారివి, ఎవరి భాష వారిది. ఇలా ఈశాన్య రాష్ట్రాల్లో నెలకొన్న ఈ సాంస్కృతిక వైరుధ్యాలు గిరిజనుల మధ్య ఘర్షణలకు దారి తీస్తున్న సందర్భాలు కుడా అనేకం ఉన్నాయి. ఈ విభేదాలు ప్రత్యక్షంగా,

**ఎన్ సి సక్సేనా,** సలహాదారు, ఐక్యరాజ్య సమితి అభివృద్ధి కార్యక్రమం (UNDP)
E-mail : naresh.saxena@gmail.com

పరోక్షంగా అభివృద్ధి వేగాన్ని అడ్డుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈశాన్య రాష్ట్రాల గిరిజనుల అభివృద్ధి కోసం ప్రత్యేక చట్టాన్ని తెచ్చింది. రాజ్యాంగంలో ఆరవ షెడ్యూలును చేర్చింది.

**ఆరవ షెడ్యూలు:**

1960లో అవిభక్త అస్సాం రాష్ట్రంలో మైనారిటీలుగా ఉన్న గిరిజనులు వారి అభివృద్ధి నమూనాలను వారే నిర్ధారించుకునేందుకు వీలుగా, అదే విధంగా, వారికి ప్రత్యేక గుర్తింపు తెచ్చి, వారి వారి సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించేందుకు వీలు కలిపిస్తూ, భారత రాజ్యాంగంలో ఆరవ షెడ్యూలును పార్లమెంట్ చట్టం ద్వారా చేర్చడం జరిగింది. అయితే, తదనంతర కాలంలో నాగాలాండ్, మిజోరాం, మేఘాలయ ప్రత్యేక రాష్ట్రాలుగా ఏర్పడడంతో సందర్భం మారిపోయింది. ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన అనంతరం నాగాలు ఆరవ షెడ్యూలును పక్కన పెట్టేశారు . మిజోరాంలో మైనారిటీ జాతులకు మాత్రమే ఆరవ షెడ్యూలు వర్తిస్తోంది. అయితే, మేఘాలయలో మాత్రం స్వయం ప్రతిపత్తి జిల్లా మండళ్లు (ఏడీసీ) శాసన సభకు దిగువ స్థాయి రాజకీయ సంస్థలుగా, శాసన సభకు ఎన్నిక కాలేని వారికి తాత్కాలిక ఉపాధి కేంద్రాలుగా కొనసాగుతున్నాయి. మేఘాలయ, అస్సాంలో భాగంగా ఉన్నప్పుడు ఈ మండళ్ళకు ఔచిత్యం ఉండేది, తమ చుట్టూ ఉన్న గిరిజనేతరుల మధ్య జీవిస్తున్న గిరిజనులకు స్వయం పాలన సంతృప్తిని ఇచ్చేందుకు ఈ మండళ్లు ఉపయోగపడ్డాయి. అయితే, ఇప్పుడు మేఘాలయ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడింది. రాష్ట్ర జనాభాలో 85 శాతం మంది గిరిజనులే ఉన్నారు. గిరిజనుల ప్రయోజనాలు పూర్తిగా రాష్ట్ర అధికార యంత్రాంగం పరిధిలో చేరిపోయాయి. ఈ నేపథ్యంలో ఇంకా స్వయం ప్రతిపత్తి జిల్లా మండళ్లను కొనసాగిచడంలో ఔచిత్యం ఏమిటి అన్న ప్రశ్న తలెత్తింది. రెండు సమాంతర వ్యవస్థలు పనిచేయడంవలన పరిపాలనలో ఒక విధమైన సందిగ్ధ స్థితి ఏర్పడింది. .

**ఆర్థిక అసమానత్వం:**

గిరిజనులు సహజంగా కొండలు, గుట్టలు,అడవులలో జీవిస్తుంటారు. అవే వారి జీవనాధారం. ఆ కొండలు, గుట్టలు, అడవులే వారి ఆదాయ వనరులు. అదే విధంగా వ్యవసాయంతో పాటుగా నేత పనులు, ఉన్ని ఉత్పత్తి చేసే జంతువుల పెంపకం ద్వారా కూడా ఆదాయం పొందుతుంటారు. ఈశాన్య రాష్ట్రాలలోని గిరిజనులు పోడు వ్యవసాయం చేస్తుంటారు. అది వారి సంస్కృతిలో భాగం. అలాగే గిరిజనుల సామాజిక – రాజకీయ జీవితాన్ని సంప్రదాయ చట్టాలు, ఆచారాలు నియంత్రిస్తుంటాయి. అయితే, గత కొన్ని దశాబ్దాలుగా మార్కెట్ వ్యవస్థ విస్తరించడం వలన, క్రమక్రమంగా గిరిజనతెగలు పోడు వ్యవసాయానికి స్వస్తి చెప్పి సాధారణ వ్యవసాయానికి అలవాటు పడ్డారు. ఆదాయ వనరులపై సామాజిక యాజమాన్య విధానాన్ని అలవరచుకున్నారు. దీంతో గిరిజన ఆర్థిక వ్యవస్థలో ఆర్థిక అసమానతలు అడుగు పెట్టాయి. దీని పర్యవసానంగా స్థానికేతరుల నుంచి స్థానికులకు రక్షణ కలిపించేందుకు, చట్టాలు పుట్టుకొచ్చాయి. అయితే, ఈ చట్టాలు గిరిజనులలో ఏర్పడిన వర్గ విభేదాలను నిరోధించలేక పోయాయి.

ప్రస్తుతానికి వస్తే, ఇప్పుడు గిరిజనలలో కొందరు కోటీశ్వరులు. కొందరు కుచేలురు. చాలా మంది ఎకరం భూమి అయినా లేని నిరు పేదలు. ఇదిలా ఉంటే ఇక్కడ మరో ఆసక్తికర అంశం ఉంది. అదేమంటే, ఈ నయా సంపన్న– ఉన్నత వర్గాలు, స్థానిక గిరిజన తెగలలోని పేదల కోసం ఉద్దేశించిన హక్కులను వారికి కాకుండా చేస్తున్నారు. తమ స్వప్రయోజనాల కోసం స్థానిక పేద ప్రజల హక్కులను హరించివేస్తున్నాయి. పేదలను అణచి వేస్తున్నారు. పళ్ల తోటలు, ఇతర వ్యవసాయ కార్యకలాపాలకు వాణిజ్య పరంగా ప్రోత్సాహం లభించడం, అదే సమయంలో పట్టణ ప్రాంతాల సమీప భూముల ధరలు పెరగడంతో సమాజ భూముల ప్రైవేటీకరణకు చాలా వరకు కారణమయ్యాయి. అయితే, నయా సంపన్న వర్గాలకు పరిశ్రమలను స్థాపించే వ్యాపార, వాణిజ్య నైపుణ్యం లేక పోవడం వలన పెట్టుబడులు చాలా వరకు రియల్ ఎస్టేట్ రంగానికే పరిమితమయ్యాయి.

**మహిళల పై ప్రతికూల ప్రభావం:**

ప్రైవేటీకరణతో మహిళలపై హానికర ప్రతికూల ప్రభావం అధికం అవుతూ వచ్చింది. ఉదాహరణకు, నాగా ప్రజల సంప్రదాయ చట్టాల ప్రకారం మహిళలకు భూమి పై హక్కు ఉండదు. ఆస్తి హక్కూ ఉండదు. వారసత్వ సంపద హక్కు అసలే ఉండదు. ఒక వేళ ఎవరైనా మహిళలు సాహసించి భూమి లేదా ఆస్తి హక్కును సొంతం చేసుకుంటే, వారు చేతబడి వంటి క్షుద్ర విద్యలకు పాల్పడుతున్నారని, సమజానికి హాని చేస్తున్నారని ముద్ర వేయడం జరుగుతుంది. ఇక అక్కడ నుంచి ఆ మహిళలను శారీరకంగా, మానసికంగా హింసించడం ప్రారంభమవుతుంది. అలాంటి మహిళలను సజీవ దహనం చేసిన ఉదంతాలు కుడా ఉన్నాయి. చేతబడి లాంటి క్షుద్ర విద్యల సంఘటనలు ఎక్కువగా గోల్పారా, బెంగాల్గావ్, కొక్రారఝార్, నల్బరి, ధుబ్రి జిల్లాలలో జరుగుతున్నాయి. ఇలా చేతబడులు, మంత్రాలూ, మాయలు, క్షుద్ర విద్యల పేరిట మహిళలను చిత్ర హింసలకు గురి చేయడానికి అనేక కారణాలు కనిపిస్తున్నాయి. అందులో, వనరుల పై అధిపత్యం, సంబంధిత తెగల పెద్ద మనుషులతో వ్యక్తిగత శతృత్వం, మూఢ నమ్మకాలు, అందులో ప్రధాన కారణాలు.

**భూమి రికార్డులు:**

నాగాలాండ్, అరుణాచల్ ప్రదేశ్, మిజోరాం, మేఘాలయ, మణిపూర్ కొండ ప్రాంతాలు, అస్సాంలోని కొన్ని గిరిజన ప్రాంతలలో భూమికి సంబంధించిన రికార్డులను నిర్వహించే వ్యవస్థ లేదు. అలాగే, భూ ఆదాయంపై పన్ను చెల్లింపు వ్యవస్థ కూడా లేదు. ఇలా భూయాజమాన్య పత్రాలు, ఇతర రికార్డులు ఏవీ లేక పోవడంతో పేద ప్రజలకు తాము తమది అనుకున్న భూమి పై తమకు ఎంతకాలం హక్కు ఉంటుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. అదే విధంగా భూమి లేని పేదల సంఖ్య పెరిగిపోతూ వచ్చింది. భూ యాజమాన్యం కొద్ది మంది చేతుల్లోకి వెళ్లి పోయింది. పోడు వ్యవసాయ ఆదాయం తరిగి పోయింది. స్వేచ్ఛా భూ విధానంలో ఎవరైనా, ఎక్కడైనా వ్యవసాయం చేసుకునే (అందరికీ అనుమతి, అందరికీ ఉచితం) అవకాశంతో అడవికి తోడు, సంపన్న వర్గాలు ప్రభుత్వ నిధులను కూడ ఎగరేసుకు పోవడం వలన ఈ రాష్ట్రాల్లో పేదరికం, ఆర్థిక అసమానతలు పెరిగి పోయాయి. సంపన్న వర్గాలు భూమిని ప్రైవేటీకరణ ద్వారా హక్కు భుక్తం చేసుకోవడం వలన వ్యవసాయ సంబంధాల పై ప్రతికూల ప్రభావాన్ని చూపాయి. కాబట్టి, ప్రైవేటీకరణ సానుకూల ముందడుగు అని భావించడం కుదరదు. ఆర్థిక అసమానతలు పెరిగిపోయి, సామాజిక సంబంధాలు నామమాత్రమైనాయి.

**నిధుల వినియోగ సామర్థ్య లేమి:**

వెనక బడిన ప్రాంతాల అభివృద్ధి కోసం ఏర్పాటైన ప్రాతీయ అభివృద్ధి మండళ్ళ (ఏడీసీ)కు రాజ్యాంగపరమైనస్థాయి, హోదా ఉన్నాయి. పరిపాలనలో కొంత మేర స్వయం ప్రతిపత్తి హోదా ఉంది. అయితే, అన్నీ ఉన్నా, తగినన్ని నిధులను సమకూర్చే వ్యవస్థ మాత్రం లేదు. ఈ కారణంగా ఈ అభివృద్ధి మండళ్లు తమ పరిధిలోని పరిపాలన విధులను సక్రమంగా నిర్వహించడంలో విఫలమై ప్రజల్లో అసంతృప్తి చోటు చేసుకుంది. ప్రత్యేక ప్యాకేజి ద్వారా తాత్కాలిక నిధులు సమకూర్చడం లేదా రాష్ట్ర ప్రణాళికలో ప్రత్యేకంగా కేటాయింపులు చేయడం ద్వారా ఈ సమస్య పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వం ఒక ప్రయత్నం చేసింది. అయితే, అభివృద్ధి మండళ్ళకు వినిమయ సామర్థ్యం అంత గట్టిగా లేక పోవడం వలన, కాదంటే రాష్ట్ర ప్రభుత్వాలదీ అదే పరిస్థితి కావడం వలన ఆశించిన ఫలితాలు అందకుండా పోతున్నాయి. ఉదాహరణకు, కేంద్ర ప్రభుత్వంలోని అన్ని మంత్రిత్వ శాఖలు కనీసం పది శాతం బడ్జెట్ ను ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధికి కేటాయిస్తున్నాయి. ఖర్చు కాకుండా మిగిలిపోయిన నిధులను తిరిగి తదుపరి సంవత్సరం వినియోగించుకునేలా నాన్-లాప్స్ పూల్‌కు బదిలీ చేయాలనే నిబంధన ఉంది. అయితే, వాస్తవంలో మాత్రం అది జరగడం లేదు. మొత్తం అందుబాటులో ఉన్న నిధులు సంతృప్తి కరంగా లేవు. రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలకు తగిన ప్రతిపాదనలు పంపక పోవడం వల్లనైతేనేమి, కేటాయించిన నిధులను సమర్థవంతంగా ఖర్చు చేయక పోవడం వల్లనైతేనేమి, అంతిమ ఫలితాలు అసంతృప్తిని మిగిలిస్తున్నాయి.

అదే విధంగా అనేక విదేశీ ప్రాజెక్టులు కూడా భూసేకరణ, పర్యావరణ అనుమతులు వంటి అనుశృతుల (ఫార్మాలిటీస్ ) కారణంగా నత్తనడకన సాగుతున్నాయి. ఫలితంగా ఆ ప్రాజెక్టుల విషయంలోనూ ఖర్చు కావలసిన నిధులు ఖర్చు కావడం లేదు.

**వియోగ ధృవీకరణ పత్రాలు సమర్పించక పోవడం:**

కేటాయించిన నిధులు విడుదల కాకపోవడానికి కూడా అనేక కారణాలు కనిపిస్తున్నాయి. ప్రాజెక్ట్ వివరాలు/కార్యాచరణ ప్రణాళికలు సమర్పించక పోవడం, రాష్ట్ర స్థాయి మంజూరు కమిటీలు సమావేశం కాకపోవడం, వంటి అనేక కారణాల వల్ల నిధుల విడుదల సక్రమంగా, సకాలంలో జరగడం లేదు. నిధుల వినియోగానికి సకాలంలో నిధులు విడుదల చేయడం మాత్రమే కాదు, దానితో పాటుగా, సిబ్బంది ఖాళీల భర్తీ, అవసరమైన నిర్మాణ సామగ్రి సేకరణ, రవాణా వంటి అనేక ఇతర చర్యలు తీసుకోవడం కూడా క్షేత్ర స్థాయి అధికారులకు అంతే అవసరం. ఇది జరగాలంటే, భూ సేకరణ, టెండర్ల ప్రక్రియ సకాలంలో పూర్తి కావలసి ఉంటుంది. మణిపూర్, నాగాలాండ్ లాంటి రాష్ట్రాలలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు తగినంతగా విడుదల కావడం లేదు. ఇందుకు నెట్ వర్క్ సమస్యలు ప్రధాన కారణమవుతున్నాయి, నెట్ వర్క్ వ్యవస్థ సమర్ధవంతంగా పని చేయక పోవడం వలన జిల్లా స్థాయి అధికారులకు అవసరమైన సమాచారాన్నిసమర్పించడంలో జాప్యం జరుగుతోంది. ఇది నిధుల విడుదలలో జాప్యానికి దారి తీస్తోంది.

ప్రణాళిక శాఖలను క్రియాశీలం చేయడం ద్వారా ఇలాంటి జాప్యాలను చాలా వరకు అరికట్టవచ్చు. రాష్ట్ర ప్రభుత్వాలు తమ తమ ప్రణాళిక శాఖలను బలోపేతం చేస్తే ఈ ప్రక్రియ లన్నింటినీ వేగంగా పూర్తి చేయవచ్చు. మరోవంక విదేశీ సహాయ, సహకారాలతో చేపట్టే ప్రాజెక్టులకు సంబంధించి మంచి ప్రతిపాదనలు చేయడంలో రాష్ట్ర ప్రణాళిక శాఖలు తగిన విధంగా సామర్థ్యాన్ని చూప లేక పోతున్నాయి. విదేశీ సహాయం అందే ప్రాజెక్టుల విషయంలో మాత్రమే కాదు, భారత ప్రభుత్వ పథకాల నుంచి నిధులు తెచ్చుకునే ప్రతిపాదనలు తయారు చేయడంలోనూ ప్రణాళిక శాఖలు తగిన చొరవ, సామర్థ్యం చూపడం లేదు. ఇదొక చేదు నిజం.

ప్రణాళిక శాఖను శక్తివంతం చేయడం ద్వారా అభివృద్ధి లక్ష్యాలను వేగంగా చేరుకోవచ్చు. ప్రణాళికశాఖ పటిష్టమైతే, సమర్థవంతంగా పనిచేయగలిగితే, గిరిజనుల ఆకాంక్షలకు అనుగుణంగా విస్తృత పరిధిలో, దీర్ఘకాల ప్రణాళికలను రుపొందించడంతో పాటుగా ప్రాధాన్యతా క్రమాన్నినిర్దేశించుకునే సౌలభ్యం స్థానిక యంత్రాంగానికి అందుబాటులోకి వస్తుంది. అలాగే, ప్రణాళిక శాఖ స్థానిక గిరిజనుల అవసరాలకు అనుగుణంగా వార్షిక, పంచ వర్ష ప్రణాళికలను రూపొందిస్తుంది. అదే విధంగా, ప్రణాళిక అమలు ప్రక్రియను పర్యవేక్షించడంతో పాటుగా ఎప్పటికప్పుడు సమీక్షించి అవసరమైన మార్పులు - చేర్పులతో వేగంగా ప్రాజెక్టులు పూర్తి చేసుకోవచ్చు. దీనితో నిర్దేశిత లక్ష్యాలను, నిర్దేశిత సమయంలో చేరుకోవడం సాధ్యమవుతుంది.

**ఇతర అంశాలు - సమస్యలు:**

కేవలం గిరిజన ప్రాంతాలు మాత్రమే కాదు, ఒక్క మిజోరాం మినహా మిగిలిన అన్ని ఈశాన్య రాష్ట్రాలలోను, తలసరి ఆదాయం, జాతీయ తలసరి ఆదాయం కంటే తక్కువగా ఉంది. ప్రైవేటు పెట్టుబడుల విషయంలో, మౌలిక సదుపాయాల కల్పనలో, సమాచార వ్యవస్థ పనితీరులో ఇలా అన్నిటా ఇదే పరిస్థితి ఉంది. ముఖ్యంగా రోడ్డు, రైలు చివరకు విమాన కనెక్టివిటీ విషయంలోనూ ఈశాన్య భారతం చాలా చాలా వెనక బడిపోయింది.

**విద్యుత్ పెద్ద ప్రతిబంధకం:**

ఈశాన్య భారతం ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి మైక్రో హైడల్ పవర్‌తో పాటుగా ఇతర పునరుత్పాదక వనరులను అభివృద్ధి పరచుకోవలసిన అవసరం చాలా ఉంది. మరో వంక, ఈశాన్య రాష్ట్రాలలో అంతర్గత ఆర్థిక వనరులు, పన్నుల ద్వారా వచ్చే ఆదాయం కేవలం నామమాత్రం గానే ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం పైనే ఈ రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థ ఆధారపడి ఉంటుంది. స్థానిక సంపన్న వర్గాలు, స్థిరాస్తులపై పెట్టుబడులు పెడతారే గానీ, ప్రమాదకరం అనుకున్న పెట్టుబడుల జోలికి పోనే పోరు.

ఈ రాష్ట్రాల అభివృద్ధికి అవసరమైన పెట్టుబడులను కేంద్ర ప్రభుత్వమే సమకూర్చినా, సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలు పరిపాలన వ్యవస్థలను మెరుగు పరచుకుని, తద్వారా పనులు జరిగేలా, ఫలితాలు వచ్చేలా చర్యలు తీసుకోవలసిన అవసరం ఉంది. ఈశాన్య రాష్ట్రాలలో చాల వరకు గ్రూప్ సి, డీ ఉద్యోగులు ఎక్కువగా ఉన్నారు. ఫలితంగా ఈ రాష్ట్రాల్లో ప్రణాళికేతర వ్యయం ఎక్కువగానూ, ఆదాయం తక్కువగాను ఉంది. ఫలితంగా, కేంద్ర ప్రభుత్వం ఉదారంగా నిధులు ఇచ్చినా, ప్రణాళిక వ్యయపద్దులు నిధుల కొరతను ఎదుర్కుంటున్నాయి. 2014-15 సంవత్సరంలో అస్సాం తలసరి ప్రణాళికా పెట్టుబడులు కేవలం రూ. 5.775గా ఉంది. అదే విధమైన పేద జనాభా అధికంగా ఉన్న ఒరిస్సా తలసరి ప్రణాళికా పెట్టుబడి రూ. 12, 807గా ఉంది.

ఈ పరిస్థితులలో ఫలితాల సాధన పై నిరంతర పర్యవేక్షణ, ప్రభుత్వ సిబ్బందిలో జవాబుదారీ తనం ఉండేలా చర్యలు తీసుకోవడం అవసరం. చాలా వరకు ప్రభుత్వ ఉద్యోగులు తమ వైఫల్యాలను కప్పి పుచ్చుకునేందుకు, నివేదికలలో ఫలితాలను ఎక్కువ చేసి చూపిస్తారు. ఇలా అధికార్లు సిబ్బంది వాస్తవాలను తారుమారు చేయడం వల్ల వాస్తవ పరిస్థితులు మరుగున పడిపోతున్నాయి. ఉదాహరణకు, ప్రభుత్వ లెక్కల ప్రకారం ఈశాన్య రాష్ట్రాలలో పోషక విలువలు గల ఆహారం లభించని పిల్లలు కేవలం, ఒక శాతం లేదా అంతకంటే తక్కువ ఉన్నారు. కానీ, ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్వహించిన సర్వే ప్రకారం, పోషక విలువల సమస్య చాలా ఎక్కువగా ఉంది. కనిష్టంగా మణిపూర్‌లో ఇది 3.5 శాతం ఉంటే గరిష్టంగా మేఘాలయ, త్రిపురలో 16 శాతం ఉంది. ఈ నేపథ్యంలో ఈ రెండు నివేదికలను తక్షణమే పునః సమీక్షించి వాస్తవ పరిస్థితిని అంచనా వేయవలసిన అవసరం ఉంది. అలా విశ్వసించదగిన నిర్దిష్ట గణాంకాలు ఉంటేనే ఆశించిన ఫలితాలను సాధించడం సాధ్యం అవుతుంది.

జాతీయ స్థాయిలో నమోదవుతున్న వృద్ధి రేటుకు ఈశాన్య రాష్ట్రాల గిరిజన ప్రాంతాలలో నమోదవుతున్న వృద్ధి రేటుకు మధ్య వ్యత్యాసాన్ని రానున్న దశాబ్ద కాలంలో పూర్తిగా తుడిచేసే విషయాన్ని పక్కన పెట్టండి, ఈ వ్యత్యాసాన్ని గణనీయంగా తగ్గించాలన్నా, ఈ రాష్ట్రాలలో పరిపాలన, అభివృద్ధి ఫలాల వితరణ తీరు తెన్నులలో భారీ స్థాయిలో మెరుగైన మార్పులు ఎంతో అవసరం. అంతేగాని కేవలం ఆర్థిక వనరుల ప్రవహ వేగాన్ని పెంచినంత మాత్రాన పరిస్థితి చక్కబడదు. ఈశాన్య రాష్ట్రాలలో అభివృద్ధికి ప్రధాన ప్రతిబంధకం నిధుల కొరత కానే కాదు. అందుబాటులో ఉన్న వనరులను సక్రమంగా వినియోగించుకునే వ్యక్తులు, వ్యవస్థలు లేకపోవడమే అభివృద్ధి లేమికి ప్రధాన ప్రతిబంధకంగా నిలుస్తున్నాయి. సంస్థలు, వ్యవస్థలను బలోపేతం చేయాలంటే రాష్ట్ర ప్రభుత్వాల శాఖలను, ఏజెన్సీ లను బలోపేతం చేయడం అవసరం. దానితో పాటుగా, రాష్ట్ర ప్రభుత్వం - పౌర సమాజం మధ్య ఫల ప్రదమైన భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం కూడా అంతే అవసరం. ముఖ్యంగా స్థానిక సంస్థలను బలోపేతం చేయడం చాలా అవసరం.

■

# ఈశాన్య భారతం : ఆరోగ్యరంగంలో అభివృద్ధి



**ఈశాన్య భారతాన్ని అనేక రుగ్మతలు పట్టి పీడిస్తున్నాయి. సామాజిక, రాజకీయ పరమైన కారణాలు కూడా ఈ ప్రాంతం వెనుకబాటుకు కారణాలౌతున్నాయి. దీనికితోడు సానుకూల చర్యలు చేపట్టడంలో రాజకీయ ఉదాసీనత కారణాంగా అభివృద్ధి మరింత కుంటు పడింది. ఈ వైఖరి అవినీతికి దారులు వేసింది. సామాజిక న్యాయం కొరవడింది.**

అభివృద్ధిపై జరిగే చర్చలో వివిధకోణాలు, వాటి లాభనష్టాలు, కీలక అంశాలు, వాటిసాధక బాధకాలు స్వల్పకాలికంగా దీర్ఘకాలికంగా అవి కలుగజేసే ప్రభావాలతో మొత్తంమీద ఒక అవగాహన అవసరం. వాస్తవానికి ఇది చాలా సంక్లిష్టమైన రంగం. సరైన లక్ష్యాలను సరైన సమయాల్లో సరైన ప్రదేశాల్లో సాధించటానికి సరైన ప్రణాళికలను రూపొందించాలి. ఈ ప్రణాళికా రచన ఆషామాషీ వ్యవహారం కాదు. ఇందుకు ఎంతో నైపుణ్యం, ముందుచూపు కావాలి.

ప్రధానంగా యువజన జనాభా అధికంగా గల భారతదేశంలో విద్య–ఆరోగ్యం అభివృద్ధికి కీలక సూచికలుగా పనిచేస్తాయి. కనుక దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ఈ రంగాలతో వ్యవహరించాలి. నోబెల్ బహుమతి గ్రహీత అమర్త్యసేన మాటల్లో చెప్పాలంటే – "సుస్థిర ఆర్థిక అభివృద్ధికి విద్యావంతులైన, ఆరోగ్యవంతులైన శ్రామికశక్తి అవసరం" అందుచేత భారత దీర్ఘకాలిక అభివృద్ధి లక్ష్యాలు సాధించలంటే తన యువతరాన్ని పదిలంగా చూసుకోవాలి. వారికి నాణ్యమైన ఆరోగ్య సంరక్షణను, విద్యాను అందజేయాలి. ఈ రంగాలపై తెలివిగా తన పెట్టుబడులను పెట్టాలి.

### ఈశాన్యంపై దృష్టి

అభివృద్ధి అంశాల విషయంలో ఈశాన్య భారతం, దేశంలోని ఇతర ప్రాంతాలకు భిన్నం కాదుకానీ ప్రధానంగా ఈ ప్రాంతాన్ని ప్రస్తావించినపుడు చర్చ ప్రత్యేక మలుపు తిరుగుతుంది.

అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, మణిపూర్, మేఘాలయ, మిజోరం, నాగాల్యాండ్, త్రిపుర – మొత్తం ఏడు రాష్ట్రాల సమాహారం ఈశాన్య భారతావని, భూటాన్, చైనా, మయన్మార్, బంగ్లాదేశ్‌లలో 2,000 కి.మీ. మించి సరిహద్దులను పంచుకునే ఈశాన్య భారతం భౌగోళికంగా రాజకీయంగా సంక్లిష్ట ప్రాంతం, కేవలం 20 కి.మీ. వెడల్పుగల ఇరుకైన నడవ భూభాగం ఈశాన్య ప్రాంతాన్ని మిగతా దేశంతో కలుపుతుంది.

దేశంలో వివిధ జాతులు, భాషలుగల అత్యంత వైవిధ్య భరితమైన ప్రాంతాలలో ఇది ఒకటి. నవనవలాడుతు ప్రకృతిమాత ఒడిలో వున్న ఈశాన్య భారతం అన్నిటా ప్రత్యేకమే, భిన్నజాతులు, ప్రజలు, వారి భాషలు, సంస్కృతి సంప్రదాయాలు ఏ ప్రాంతానికి అవే ప్రత్యేకం. అనేకానేక భాషలతో 166కు పైగా జాతులకు ఆలవాలమైనది ఈశాన్య భారతం భౌగోళిక, పర్యావరణ, రాజకీయ వైరుధ్యం ఈశాన్య

**డా॥ అరుణ భట్టాచార్య చక్రవర్తి,** అసోసియేట్ ప్రొఫెసర్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్, ఢిల్లీ.
E-mail: aruna.bhattacharya@iiphd.org

భారతాన్ని ఉపఖండంలోని ఇతర ప్రాంతాల నుండి విలక్షణంగా నిలుపుతుంది. అలాగే ప్రధాన భారతదేశం నుండి విభిన్నంగా చూపుతుంది. ఈ వైవిధ్యాలే ఒకపక్క అచ్చెరువు గొలుపుతుండగా మరోపక్క కంటకంగా మారి ఈ ప్రాంత అభివృద్ధికి, మొత్తం మీద దేశాభివృద్ధికి ఆటంకంగా నిలుస్తున్నాయి.

**ఈశాన్య భారతం – రుగ్మతలు**

ఈశాన్య భారతాన్ని అనేక రుగ్మతలు పట్టి పీడిస్తున్నాయి. దుర్లభమైన భూభాగం చేరికకు దుస్సాధ్యమైన తీరు ఈ ప్రాంత మందకొడి అభివృద్ధికి కారకాలుగా ఉన్నాయి. ఇంకా లోతుగా పరిశీలిస్తే వెలుపల అంతర్గతంగాను నెలకొనివున్న సామాజిక, రాజకీయ పరమైన కారణాలు కూడా ఈ మంద గమనానికి దోహదం చేస్తున్నాయి. దీంతో ఈశాన్య భారతంలో పెట్టుబడులకు పరిశ్రమలు ఆసక్తి చూపకపోవటం చేత సుస్థిర అభివృద్ధికి ప్రాథమిక, మౌలిక సదుపాయాల ఏర్పాటు అంతంత మాత్రంగా జరిగింది.

దీనికితోడు సానుకూల చర్యలు చేపట్టడంలో రాజకీయ ఉదాసీనత కారణాంగా అభివృద్ధి మరింత కుంటు పడింది. ఈ వైఖరి అవినీతికి దారులు వేసింది. సామాజిక న్యాయం కొరవడింది. శాంతి భద్రతల పరిస్థితి క్షిణించింది. ఈ పరిణామాలు ప్రజలపైన ముఖ్యంగా యువత మీద ప్రతికూల ప్రభావం చూపుతాయి. ఎదిగీ ఎదగని వారి మనస్సులు పెడతోవలు పడతాయి. “తగిన యుక్తాయుక్త వివేచన కలిగిన యువత అసాధ్యమైన దానిని యత్నించి సాధిస్తుంది. అనంతర తరాలు దానినే అనుసరిస్తాయని” సాహిత్యంలో నోబెల్ బహుమతి గ్రహీత పెర్ల్‌ఎస్‌బల్ చెప్పిన మాటలు ఇక్కట అక్షర సత్యాలుగా వర్తిస్తాయి.

**మాదకద్రవ్య వాడకం**

దేశంలోని ఏ ఇతర ప్రాంతంలోను లేని విధంగా మాదకద్రవ్య రవాణా యధేచ్ఛగా సాగుతూ ఈశాన్య భారతాన్ని కుదిపివేస్తోంది. అంతర్జాతీయ సరిహద్దులు పంచుకోవటంతో పాటు పేరుమోసిన స్వర్ణత్రిభుజానికి చెంతన వుండడం చేటుగా పరిణమించింది. ఇటీవల సంవత్సరాలలో మాదకద్రవ్యాల సూదీమందు వాడకం విపరీతంగా పెరిగి హెచ్.ఐ.వి. బారినపడే ప్రమాదం పెనుసవాలుగా మారింది.

మాదకద్రవ్య వాడకం అనేది ఒక క్లిష్టతరమైన అంశం సూదిమందు ముఠాలు, లైంగిక సంబంధ ముఠాలు పోటాపోటిగా విస్తరించీ మాదకద్రవ్యాల రవాణా సులభంగా మారి, హెచ్ఐవి వ్యాప్తి పెరగడంతో సమస్య మరింత జటిలమవుతుంది. మాదకద్రవ్యల వాడకంలో ప్రతికోణము ఒక సమస్యే. వాడే పదార్థాలు, పదార్థ సేకరణ, హాని తగ్గింపు సేవలపట్ల అవగాహన లోపం, సేవలను పొందటం మొదలుకొని సామాజిక, వ్యవస్థాగత రాజకీయ, చట్టపరమైన సమన్వయ అవరోధాలు మాదకద్రవ్య వాడకందారుల జీవితంలో పరిణామాలను మరింత దుర్భరం చేస్తాయి. భారత్‌లో లక్షా 80వేల మందికిపైగా సూదిమందు వాడేవారు వుండగా సూదులు–సిరంజిలు పంచుకోవడం వంటి సురక్షితం కాని పద్ధతులు అవలంభించేది అధికంగా ఈ ప్రాంతంలోని వారే కావటం గమనార్హం! అలాగే సురక్షితంకాని లైంగిక ప్రవర్తనల ద్వారా ముప్పు వుండేది కూడా ఈ వర్గం వారికే, ఈ పద్ధతులు, ఇందుకు సంబంధించి రిస్కు ప్రవర్తనుల భారీఎత్తున హెచ్ఐవి సత్వర వ్యాప్తికి దోహదం చేస్తాయి.

**స్త్రీ, పురుష బేధం – మాదకద్రవ్యాలు – ఆరోగ్యం**

మాదకద్రవ్య వాడకం వల్ల ఉత్పన్నమయ్యే సమస్యల పరిష్కారం ముఖ్యంగా స్త్రీలకు అలవికాని సవాలు. మన పురుషాధిక్య సమాజంలో ఇటువంటి విషయాలలో స్త్రీ పురుషుల మధ్య తీవ్ర అంతరం వుంటుంది. సురక్షితమైన లైంగిక సంబంధాలు కల్పించే పరిస్థితులు గురించి స్త్రీలు స్వేచ్ఛగా, నిర్భయంగా మాట్లడలేరు. సంకోచిస్తారు. బిడియ పడతారు. ఇందుకు సంబంధించిన సమాచారం వారికి అందదు. లభ్యమవుతున్న సేవల గురించి వారికి తెలియదు. ముప్పు తగ్గించుకునే సురక్షిత పద్ధతులను అవలంబించలేరు. దీనిపై సమాజంలో లభ్యమవుతున్న రెండు విధానాలు సమాచారం విద్య, కమ్యూనికేషను (IEC), ప్రవర్తన మార్పు కమ్యూనికేషను (BCC) కూడా వారికి హాని తగ్గించేందుకు ఉపయోగపడే ఐచ్ఛికాలను కల్పించవు. అయితే ఐసిసి–బిసిసి ఛత్రంకింద ఈ విధమైన వ్యూహకల్పనకు ఎంతో అవకాశం వుంది. లైంగికంగా సంక్రమించే ఇన్‌ఫెక్షన్లు (STIలు), లైంగిక పునరుత్పత్తి ఆరోగ్యం (SRH)కి సంబంధించి తగిన వ్యూహరచన చేయాలి. ఇట్టి వ్యూహాలు వారి అవసరాలను తీరుస్తాయి. వారికి మంచి రక్షణ కల్పిస్తాయి.

ఇంకా మాదకద్రవ్య ఇంజెక్షన్లు వాడే మహిళలు (FIDV), మహిళ సెక్కువర్కర్లు (FSW) సమాజంలో మరింత చులకన, వివక్షను ఎదుర్కోంటారు. మొత్తంమీద పురుషులతో పాటు మహిళలకు కుడా ముప్పు తగ్గే సేవలు అందాలంటే కమ్యూనిటీలను, సర్వీసు ప్రోవైడర్లను, ఇతర భాగస్వాములను చైతన్యవంతులను చేయాలి. మరీముఖ్యంగా మహిళా సెక్సువర్కర్ల విషయంలో ఇది మరింత అవసరం.

పరిస్థితిని మెరుగు పరిచేందుకు ఏమి చేయగలుగుతాం?

మాదకద్రవ్య ఇంజెక్షన్ల నెట్‌వర్కులు, లైంగిక నెట్‌వర్కులలో మాదకద్రవ్య వాడకంపట్ల, ఆరోగ్య మౌలిక సదుపాయాల లభ్యతపట్ల అవగాహన కల్పించాలి. వారి తరపున మాట్లడాలి. బహిరంగ చర్చ జరగాలి. సూదిమందు వాడకం వల్ల హాని తగ్గాలంటే బహుముఖ వ్యూహం అవసరం. క్లినికల్‌గా మానసికంగా సామాజికంగా ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి తగినట్టు ప్రత్యేక చర్యలతో ఈ వ్యూహం రూపొందించాలి. ఇంజెక్షన్లు వాడకానికి ఒక్కో వ్యక్తికి ఒక్కో కారణం వుంటుంది. ఏ ఇతర ప్రవర్తన తీరు మాదిరిగానే ఇందుకు ప్రతివ్యక్తికి గల కారణాలను అర్థం చేసుకోవాలి.

*తరువాయి 25వ పేజీలో...*

# ఆరోగ్య సందేశాలు- సమర్థతకి-సాఫల్యానికీ సూచి



**సాధారణంగా వాణిజ్యపరమైన సందేశాలతో పోలిస్తే ప్రభుత్వ సందేశ కార్యక్రమాలు విసుగెత్తించే మూస పద్ధతిలో ఉంటాయన్న భావన ఉంది. ప్రభుత్వ సేవలు, యంత్రాంగం 'ప్రతిష్ఠ'కు సంబంధించినవిగనుక వీటిలో మార్పు తేవడంద్వారా విభిన్నతను చూపడం అవసరం. సందేశాలను సరికొత్తగా రూపొందించడం, అవి అందరి దృష్టినీ ఆకర్షించేలా సరైన ప్రదేశాల్లో ఏర్పాటు చేయడం ముఖ్యం.**

ఆరోగ్య కార్యక్రమాల విజయవంతానికి, ప్రజారోగ్య స్థితిగతుల మెరుగుకు సామాజిక-ప్రవర్తనా పరివర్తన సందేశ వ్యాప్తి కీలక వ్యూహమన్నది సర్వామోదిత సత్యం. సందేశాలకుగల శక్తిసామర్థ్యాలను ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖల ప్రణాళికలు-కార్యాచరణలు తొలినాళ్లనుంచే మనకు తెలుస్తున్నాయి. ఆ మేరకు పోలియో, మశూచికం నిర్మూలన వంటి ఆరోగ్య పథకాలు, చర్యలద్వారా భారత్ గణనీయ ప్రగతి సాధించింది. అయిప్పటికీ కీలక ఆరోగ్య స్థితిగతులు, సూచీల విషయానికొస్తే దేశం నేటికీ పెనుసవాళ్లు ఎదుర్కొంటూనే ఉంది. ఆరోగ్యం రాష్ట్రాల పరిధిలోని అంశం కావడంవల్ల దేశంలో ప్రస్తుత ఆందోళనకర ప్రజారోగ్య పరిస్థితులకు వ్యాపిత సమస్యలు సహా అనేక కారణాలున్నాయి. మౌలిక వసతుల కొరత, మానవ వనరులలో అగాధం, నిధుల విడుదల-వినియోగంలో సవాళ్లు, సేవల నాణ్యత, అందుబాటు, నిర్వహణ-ఆచరణ సమస్యలు వంటివి ఇందులో కొన్ని. ఇక 'గిరాకీ వైపు'నుంచీ సమస్యలు తక్కువేమీ కాదు. సంఖ్య-వైవిధ్యం రీత్యా చూస్తే భారీ జనాభా, ఆచార సంప్రదాయాలు, అపోహలు-అపార్థాలు, విశ్వాసాలు- నమ్మకాలు, అలవాట్లు- ఆలోచనలు, విలువలు-పద్ధతులతోపాటు సందేశ-విజ్ఞాన- అవగాహన లోపం వంటివి కూడ ఉన్నాయి. పరిశీలనలో ఉన్న కొత్త ఆరోగ్య విధానంతో సహా సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు (SDG) రూపొందిన నేపథ్యంలో అవగాహన నుంచి ప్రవర్తనా పరివర్తనదాకా ఆరోగ్య సందేశాల పయనాన్ని అనుసరించడం ఉపయుక్తంగా ఉంటుంది. ఈ అన్వేషణద్వారా సరఫరా, గిరాకీల వైపునుంచి కీలక సవాళ్లను గుర్తించి వాస్తవ వేగంతో, వాస్తవిక మార్పును సాధించే దిశగా ముందడుగు వేసేందుకు తగిన మార్గసూచిని ప్రతిపాదించవచ్చు.

సుదీర్ఘ కాలంనుంచీ... అంటే 1950లలో ఆరోగ్య సందేశ కార్యక్రమాలు అవగాహన కల్పనమీద మాత్రమే దృష్టి సారించాయి. విజ్ఞానం పెంచడం, సమాచారం ఇవ్వడం-అవగాహన పెంచడం దిశగా సాగాయి. కానీ, 'తెలుసుకోవడం' అనే లోపంకన్నా ఏదైనా 'చేయడం' లేదా 'ప్రవర్తన మార్చుకోవడం' నుంచి ప్రజానీకాన్ని అడ్డుకుంటున్న లేదా ఆంక్షలు విధిస్తున్న మరిన్ని బలమైన కారణాలున్నాయని బహుశా

**డాక్టర్ సంజీవ్‌కుమార్,** ఎంబీఏ, పీహెచ్.డి.
E-mail: sanjeevbcc@yahoo.co.in

స్పష్టంగా గుర్తించడం జరగలేదు. కాబట్టి, సామాజిక-ప్రవర్తనా పరివర్తన దిశగా సాగే పయనానికి 'తెలుసుకోవడం', 'అమలుచేయడం' అన్న సందేశాలే ఆయువుపట్టు. ఆరోగ్య సందేశాల సమస్యను గుర్తించగలిగినా దేశంలోని కాలమాన పరిస్థితుల్లో పరిమితులు, పరిధులను సరిగా అర్థం చేసుకోలేదన్నది ఈ రచయిత అభిప్రాయం. ఎందుకంటే పాశ్చాత్య లేదా ప్రగతిశీల ఆర్థిక వ్యవస్థల్లోని పరివర్తన సూత్రాలను అందినవి అందినట్లు యథాతథంగా అనువర్తింప చేయడం వల్ల సదరు పరిమితులు, పరిధుల నడుమ సంయమనం తప్పింది. మునుపటి నమూనాలతోసహా ఆరోగ్య విద్య, ప్రోత్సాహక ప్రణాళికా చట్రాల రూపకల్పనలో వ్యష్టివాదం-సామాజిక జీవనాల మధ్య మౌలిక భేదాలకు స్థానం లభించలేదు. ఏమి అందించాలో సరఫరా పక్షానికి 'తెలుసు' కానీ, అందుకోవాల్సిందేమిటో ప్రజానీకానికి 'తెలియదు'గనుక వ్యవస్థ నుంచి అవగాహన ప్రసారం ఏకమార్గ పరిమితమైంది. ఇదంతా తమ లబ్ధి కోసమేనన్న తర్కం, హేతుబద్ధతలే తమ ప్రవర్తన, ఆచరణలను మార్చుకుని, ప్రజలను ఈ పద్ధతులకు అలవాటుపడేలా చేస్తాయన్న ఓ సాదాసీదా నమ్మకమే ఇందుకు కారణం.

ఆనాటి కృషిని పూర్వపక్షం చేయడం ఈ విశ్లేషణ ఉద్దేశం కాదు. వాస్తవానికి ప్రజలపరంగా ఆరోగ్య ప్రోత్సాహక కార్యక్రమా లేగాక చిత్తశుద్ధి, ఉత్సాహాలతో ఎంతో కృషి కూడా సాగిందనడంలో సందేహం లేదు. ఆ తర్వాత పరిభాష, సమాచార విద్య-అవగాహన (ఐఈసీ) స్వల్పంగా విస్తరించినా సమాచార ప్రసారం మీదనే అధికశాతం దృష్టిని నిలిపారు. ఈ దశలో ప్రజానీకం 'చూసి' స్వీయాను భవంతో తెలుసుకుంటారని లేదా ఇతరుల ప్రవర్తనను ఉదాహరణగా స్వీకరిస్తారని ఊహాజనిత అంచనాలు సాగాయి. ప్రమాణాలే కాకుండా కుటుంబ నియంత్రణ, పౌష్టికాహారం వంటి అనేక కీలక ఆరోగ్య పరివర్తనాంశాల పరంగా వాస్తవ పురోగతి సాధనలో వైఫల్యం తప్పలేదు. దీనికి కారణమైన సవాళ్ల గురించి అవగతం చేసుకున్న తర్వాత కార్యక్రమ రూపావళి 'ప్రవర్తన పరివర్తన సందేశ' (బీసీసీ) చట్రంవైపు మళ్లింది.

అయితే, క్లిష్టమైన ప్రశ్నలకు సమాధానం కనుగొన్నామా? సందేశాల శక్తి సామర్థ్యాలు, ఉపకరణాలమీద పెట్టుబడులపై మన అవగాహనలో మార్పు వచ్చిందా? సందేశ వ్యాప్తిని మద్దతు వ్యూహంగాకాక ప్రధాన, కీలక వ్యూహంగా పరిగణించాలని, దాంతోపాటు వనరులు, కార్యకలాపాలు, ప్రచారం సమాంతరంగా సాగడంపై పెట్టుబడులు ఫలితాలిస్తాయని ప్రతిపాదించ గలిగామా? ప్రజా జీవితాల్లో ప్రమాణాలపరంగా నాణ్యమైన మార్పును వేగవంతం చేయగ లిగామా? ప్రజలు, కుటుంబాలు, సమూహాలు, సమాజాలు, వ్యవస్థల గతిశీలతల్లోని లోతైన, విస్తృత అవగాహనను పసిగట్టామా? వాటి ఆధారంగా రూపొందిన సరికొత్త ఉపకరణాలు, సాంకేతికతలకు అనుగుణంగా సందేశాల రూపకల్పన, సరఫరా వ్యవస్థలు సిద్ధమ య్యాయా? సంఖ్యాపరంగా కాకుండా పరివర్తన తీసుకురాగల రూపకర్తలుగా మనం ఎది గామా? మన క్షేత్రస్థాయి కార్యకర్తలకు పడికట్టు పద్ధతుల నుంచి విముక్తి కల్పించి, సాధికారతతో ప్రపంచాన్ని మార్పువైపు నడిపించగలవారుగా తీర్చిదిద్దామా? ఇలా తరచి చూసుకుంటే విధాన రూపకల్పన స్థాయిలో మార్పులు కనిపిస్తున్నాయిగానీ అవి అట్టడుగుస్థాయికి చేరి, కార్యకర్తలవైపు సాగలేదన్నది స్పష్టమవుతున్నది. సందే శమన్నది మూలాలకు చేరితేనే దాని శక్తి పూర్తిగా వినియోగంలోకి వస్తుంది. సాధికార, స్పర్ధాపూర్వక, సహానుభూతిగల కార్యకర్తలను రూపొందించడానికి అది దోహదపడుతుంది. వారి తోడ్పాటుతో చైతన్యవంతులయ్యే పౌరులు స్వయంగా సామర్థ్యం సంతరించుకుని కార్యసాధకులైతే నివారణ, ప్రోత్సాహక కృషి ఇనుమడిస్తుంది. రానున్న సంవత్సరాల్లో జాతీయ ఆరోగ్య విధాన రూపకల్పన సంద ర్భంగా ఆరోగ్య సందేశాల వ్యాప్తికి మార్గసూచి కోసం ఆరు స్పష్టమైన మార్గాల్లో ప్రధాన, సార్థకాంశాలపై మరింత లోతైన పరిశీలన అవసరం.

మొదటిది... కేంద్ర, రాష్ట్రాల స్థాయిలో ఆరోగ్య అవగాహన చర్యలకు బడ్జెట్ కేటాయిం పులలో వ్యూహాత్మక మార్పు తేవాలి. ప్రస్తుతం ఇస్తున్న నిధులు ఎంతమాత్రం సరిపోవు. పైగా ఈ నిధులను కూడా రాష్ట్రాలు సవ్యంగా వినియోగించలేని దుస్థితిలో ఉండటంతో వ్యూహకర్తలకు కేటాయింపు వ్యవహారం కొన్నిసార్లు కష్టతరమవుతోంది. కాబట్టి మరిన్ని నిధులు కేటాయించాలన్న వినతులను ఎలా సమర్థించుకోగలం? ఇది కొంతవరకూ నిజమేగానీ, ఆరోగ్య అవగాహన కోసం కేటాయిస్తున్న నిధులను సమర్థంగా, ఔచిత్యంతో వినియోగించుకోవడంలో ఆయా రాష్ట్రాలు లేదా సంస్థలు ఎదుర్కొంటున్న లోటుపాట్లు, సవాళ్లు ఏమిటో శోధించడానికి వ్యవస్థను అప్రమత్తం చేయడం అవశ్యం. ఇక్కడ రెండు అంశాలను చూడాలి. ఒకటి... ఏ ప్రాతిపదికన నిధులు కేటాయిస్తున్నారు- అవసరాల మేరకా... పనితీరు ప్రకారమా? పనితీరు ఆధారంగా నిధుల కేటాయింపువల్ల బహుశా రెండు లోపాలను సరిచేయవచ్చు. ఒకటి జవాబుదారీతనం, రెండోది అవగాహన కార్యక్రమాల్లో నాణ్యతసహా నిధుల వ్యయంపై దృష్టిగాక కృషికి స్పష్టమైన ఫలితాలు లేదా ప్రభావం కనిపించడం. ఆరోగ్య అవగాహన విభాగంలో విధాన రూపకల్పన నుంచి క్షేత్రస్థాయి కార్యకర్తలదాకా అన్ని స్థాయిలలో పనితీరు ఆధారిత ప్రోత్సాహకాలు ఇవ్వడాన్నీ పరిశీలించవచ్చు.

రెండోది... సమాచార విభాగం సిబ్బంది, శిక్షణ సంస్థల సామర్థ్యాన్ని సంపూర్ణ స్థాయిలో పెంచాలి. మార్పునకు చోదకులు వారే కాబట్టి సరికొత్త, వినూత్న ఉపకరణాలు–సాంకేతిక నైపుణ్యంలో వారికి సాధికారత అవసరం. అలాగే వాటిని సంతరించుకున్నవారు కూడా మెరుగైన, సత్వర ఫలితాల సాధన దిశగా నిత్యం తమ ప్రతిభకు పదును పెట్టుకోవడం, నైపుణ్యాన్ని మెరుగుపరచుకోవడమూ అవశ్యం. ఇది భారీ కసరత్తే అయినా అత్యవసర కార్యమే. దీని కోసం జాతీయ, రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శిక్షణ సంస్థలతో (NIHFW, SIHFW)సహా లెక్కకు మిక్కిలిగా ఏర్పాటవుతున్న నైపుణ్య శిక్షణ సంస్థల్లో బోధనకు 'అవగాహన ప్రత్యేక, అవగాహన ప్రధాన' పాఠ్యాంశాలు రూపొందించాలి. అవగాహన సామర్థ్యంపై దృష్టి సారించి శిక్షణ సంస్థల్లో నూతనోత్తేజం, శక్తి నింపడం అత్యావశ్యకం. ఈ శిక్షణ కూడా ఫలితాలతో ముడిపడిన పనితీరు ప్రాతిపదికగా ఉంటే మంచిది. వ్యక్తుల మధ్య సరళ సమాచార వినిమయాన్ని మించి ముందడుగు వేయాల్సిన అవసరముంది. ఈ మేరకు అవగాహన, స్ఫూర్తిని నింపడం మాత్రమేగాక ఒప్పించడం, సంప్రదించడం, ప్రభావితం చేయడం వంటి నిర్దిష్ట చర్యలను పెంపొందించేదిగా ఉండాలి. ఈ కృషిలో సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖలోని "క్షేత్రస్థాయి ప్రచార విభాగం (DFP), గేయ నాటక విభాగం (SDD), దూరదర్శన్ (DD), ఆకాశవాణి (AIR), దృశ్య–శ్రవణ ప్రచార సంచాలక" (DAVP) విభాగాలను మరింత చురుకైన భాగస్వాములుగా చేయవచ్చు.

మూడోది... సత్ఫలితాలు, జవాబు దారీతనం కోసం ఆరోగ్య సందేశాల వ్యాప్తిపై మెరుగైన పర్యవేక్షణ, పరిశీలన, పరిశోధన, అంచనా, మూల్యాంకనం అవసరం. కానీ, ఈ అంశాలను ముఖ్యమైనవిగా పరిగణించకుండా వినియోగ ధ్రువీకరణ పత్రాలు (UC), ఛాయాచిత్రాలు, పత్రిక–ప్రసార సంస్థల్లో వార్తాకథనాల వంటివాటిని ఆధారాలుగా పరిగణిస్తూ వచ్చారు. వీటిమధ్య నిర్మాణాత్మక, సంకలిత పరిశోధనలు అరుదుగా, స్వల్పంగా మాత్రమే సాగాయి. కార్యక్రమ నిర్వాహకులు, అధికారులకు ఈ అంశాల్లో సాధికారత కల్పిస్తే ఇందులోని భాగస్వాములు, సంస్థలు సత్వర పరిశోధన నిర్వహించి, నాణ్యమైన అంచనాలను సత్వరం నివేదించేలా చేయగలరు. ఆరోగ్య సందేశ వ్యాప్తి కార్యకలాపాల సూచీల పర్యవేక్షణ మరో అంశం. ఇప్పటిదాకా వీటిలో అధికశాతం సాధకాలు, ప్రక్రియలు, ఫలితాలకు మాత్రమే పరిమితమయ్యాయి. కానీ, మార్పు నిరంతరత్వాన్ని అనుసరిస్తూండాలంటే వీటిని మార్చడం అవసరం. అలాగే కార్యక్రమాలపై అభిప్రాయ సేకరణ, అనుసరణ యంత్రాంగాలను కూడా బలోపేతం చేయాలి.

నాలుగోది... సందేశవ్యాప్తి సరంజామా కార్యకలాపాల సృజనాత్మక కూర్పు, భావాత్మకతను వెల్లడించడంలో బలమైన మార్పులు తేవాలి. అంతర్గతంగానూ, సంస్థాగతంగానూ రూపొందించిన సందేశ వ్యాప్తి ఉత్పాదకాల సామర్థ్యం పరిమితంగానే ఉంటోంది. సందేశ రూపకల్పన, వ్యాప్తి, విస్తరణ, ముద్ర తదితరాల నాణ్యత ఈ రంగంలో పెనుసవాలు. ఈ ప్రక్రియను సంస్థాగతంగానూ, బాహ్య సేవలద్వారానూ చేపట్టవచ్చు. అయితే, బాహ్యసేవలలోనూ సేకరణ, నిర్వహణ, వ్యయాలపరంగా కొన్ని సవాళ్లున్నాయి. ఆ కార్యక్రమాలు నిర్దేశిత సమూహాల అవసరాలు, ఆకాంక్షలకు అనుగుణంగా వారికి చేరువ కాగలవా? అన్నది ప్రధానంగా పరిశీలించాల్సిన అంశం. ఇవన్నీ ప్రభుత్వం కోసం చేపట్టే ప్రచారానికి ఉద్దేశించినవి కాబట్టి ప్రభుత్వ కార్యకలాపాల్లో కొంతభాగం అనివార్యంగా ఈ బాహ్యశక్తులపరం కావడం అదనపు సవాలు. కాబట్టి వాటి ఉనికి, అధీకృత గళం, ఆమోదాలను అవసరమైతే తప్ప దూరంగా ఉంచితేనే మంచిది. సాధారణంగా వాణిజ్యపరమైన సందేశాలతో పోలిస్తే ప్రభుత్వ సందేశ కార్యక్రమాలు విసుగెత్తించే మూస పద్ధతిలో ఉంటాయన్న భావన ఉంది. ప్రభుత్వ సేవలు, యంత్రాంగం 'ప్రతిష్ఠ'కు సంబంధం చినవిగనుక వీటిలో మార్పు తేవడంద్వారా విభిన్నతను ఆపాదించడం అవసరం. సందేశాలను సరికొత్తగా రూపొందించడం, అవి అందరి దృష్టినీ ఆకర్షించేలా సరైన ప్రదేశాల్లో ఏర్పాటు చేయడం ముఖ్యం. అలా చేస్తేనే ప్రజలు వాటిపై ఆసక్తి చూపి, మార్పు ప్రక్రియ దిశగా చొరవ తీసుకునేందుకు సిద్ధమవుతారు.

ఐదవది... కేంద్ర, రాష్ట్రాల్లో ఆరోగ్య సందేశ వ్యాప్తి కూర్పును మార్చాల్సి ఉంది. కేంద్రంలో "సమాచార అవగాహన–వ్యాప్తి (IEC) విభాగాలు, రాష్ట్రాల్లో IEC బ్యూరోలు, జిల్లాల్లో ప్రవర్తన పరివర్తన కేంద్రాలు" (BCC) పేరుగొప్పకే ఏర్పాటయ్యాయి. కొద్దిమంది అధికారులు, ఇతర వనరులకే పరిమితం కావడంతో వీటిలో అధికశాతం IEC సరంజామా రూపకల్పన, పంపిణీ కేంద్రాలుగా మిగిలిపోయాయి. ఇక దశాబ్దాల కిందట ఏర్పాటైన సమాచార విభాగం స్వరూప, స్వభావాల్లో, విధుల్లో మార్పుచేర్పుల మాటే లేదు. అందువల్లే పరిశీలనాంశాలు, విధుల విస్తృతి కేవలం రూపకల్పన లేదా సేకరణ, పంపిణీలకు మాత్రమే పరిమితమైంది. పాత్రికేయ సమావేశాల ఏర్పాటు, మంత్రిత్వ శాఖల, ఉన్నతాధికారుల కార్యకలాపాల నివేదన, పత్రికా ప్రకటనల తయారీవంటి విధులతో చివరకు కార్యక్రమ నిర్వహణ (ఈవెంట్ మేనేజర్) విభాగాలుగా అవి మిగిలాయి. అత్యంత ప్రధానమైన సామాజిక,

వ్యక్తి ప్రవర్తన మార్పు దిశగా వృత్తినిబద్ధత, వ్యూహాత్మక సందేశ రూపకల్పన సామర్థ్యాలకు కొన్నిసార్లు ప్రాధాన్యం లేకుండాపోతోంది. వీటి స్థానంలో పాలన సంబంధిత, రవాణా, నిర్వహణాంశాలే సిబ్బందికి ప్రధాన విధులుగా మారుతున్నాయి. ఈ విభాగాలు జవాబుదారీ తనంతో కర్తవ్యాన్ని నిర్వహించాలంటే సరిపడా వనరులు, ప్రత్యేక నైపుణ్యం, పరికరాలు వంటివి సమకూర్చడం అవసరం. ఇవన్నీ ఉంటే పైన పేర్కొన్న నాలుగు అంశాల్లో కూడా పరిపూర్ణత్వానికి వీలుంటుంది.

ఆరవది... ఆరోగ్య సందేశ కృషికి అన్ని స్థాయిలలో భాగస్వామ్యాన్ని సృష్టించి, ప్రోత్సహించడం ఎంతయినా అవసరం. స్వచ్ఛంద సేవా (NGO), సామాజిక (CBO) సంస్థలు జన సమూహాలకు చేరువగా, అందుబాటులో ఉండటమేగాక విశ్వసనీయత కలిగి ఉంటాయిగనుక వాటిని ఆరోగ్య అవగాహన కార్యక్రమాలలో నిమగ్నం చేయవచ్చు. దీంతోపాటు ఆయా కార్యక్రమాలపై సానుకూల కథనాలతోపాటు ప్రజల్లోకి చొచ్చుకుపోయే నివేదికలకు వీలుగా ప్రచురణ, ప్రసార మాధ్యమాలకు భాగస్వామ్యం కల్పించడాన్ని మరింతగా ప్రోత్సహించాలి. సలహాలు, సూచనలివ్వడంతోపాటు సమాచారాన్ని విస్తృత జన బాహుళ్యానికి వ్యాపింపజేయడంలో మాధ్యమాలు ఎంతగానో ఉపయుక్తం. అలాగే ప్రైవేటు రంగం, భారీ పరిశ్రమలతో భాగస్వామ్యం వల్ల వాటినుంచి నిర్వహణ–కార్యకలాపాలపరంగానేగాక సాంకేతిక నైపుణ్యంతోపాటు పారిశ్రామిక సామాజిక బాధ్యత (CSR) నిధుల మద్దతు కూడా అందుకోవచ్చు. విశ్వసనీయ సంస్థలు, భావ సారథులు, విద్యావేత్తలు, పరిశోధన సంస్థలు, అంతర్జాతీయ విభాగాలు, ఐక్యరాజ్య సమితితోపాటు బహుళపక్ష సంస్థలు, సేవా సంస్థలు, శరణాలయాలు వగైరాలన్నీ ప్రజానీకంతో నిత్య సంబంధాలు కలిగి ఉంటాయి గనుక ప్రవర్తన పరివర్తనను అవి విస్తృతంగా ప్రభావితం చేయగలవు.

అయితే, 'గిరాకీ'వైపు శ్రద్ధ కాస్తా 'సరఫరా'పై నిర్లక్ష్యం, వైఫల్యం లేదా విధుల స్తంభనకు దారితీయకూడదు. గిరాకీపై పెరుగుతున్న అంచనాలను అందుకోలేకపోతే, ఇటు రూపకర్తలు, అటు ప్రజలలో నిరాశానిస్పృహలకు దారితీసే ప్రమాదం ఉంది. అంటే 'గిరాకీ'ని 'సరఫరా'వైపు చర్యలను అనివార్యం చేసే మార్పుగా కాకుండా ఆరోగ్య వ్యవస్థ సంస్కరణల సాధనకు ప్రత్యామ్నాయంగా చూడవచ్చు. ఇక సరఫరావైపు వనరులు, వ్యవస్థాగతంగాగల వాస్తవ ఆటంకాల తొలగింపు ప్రక్రియ నిరంతరం సాగుతూండాలి.

అంతిమంగా దేశవ్యాప్తంగా ఆరోగ్య రంగంలో పథకాలు, చర్యల ప్రభావం, ఫలితాల పురోగతిలో గణనీయ వేగం సాధించాలంటే వ్యూహాత్మక ఆరోగ్య సందేశవ్యాప్తి కృషిని మరింత బలోపేతం చేయాల్సి ఉంది. నానాటికీ పెరుగుతున్న సాంక్రమిక, అసాంక్రమిక వ్యాధుల బెడదను తగ్గించాలంటే వ్యాధి నిరోధం, ప్రవర్తన పరివర్తన అవగాహన చర్యలు అత్యవసరం. ఇవన్నీ సృజనాత్మకంగా, ఆదేశపూర్వకంగా, వాస్తవాధారితంగా, వృత్తినిబద్ధతతో, భాగస్వామ్యాన్ని బలోపేతం చేసుకుంటూ సాగాలి. ఆపాదింపు–సహకారాలతో ఆరోగ్యాభిలాష కోరే ప్రవర్తనలో పరివర్తన సాధించాలి. అలాగే వాంఛనీయ ఆరోగ్య పరిరక్షణ కార్యకలాపాల ఆచరణకు దోహదపడేలా వాటిపై నిరంతర పర్యవేక్షణ, మూల్యాంకనాలు అవశ్యం. ఆరోగ్య సందేశాల శక్తి సామర్థ్యాలు 'సంభావ్య–సంభాషణా' పటాటోపంగా ఉండిపోవడంగాక వాటిని వాస్తవీకరించి, సాకారం చేసినప్పుడే పన్నెండో పంచవర్ష ప్రణాళికను విజయవంతం చేయడంతోపాటు సుస్థిర అభివృద్ధి లక్ష్యా (SDG)లను అందుకోగలం.

■

*21వ పేజీ తరువాయి...*

## ఈశాన్య భారతం: ఆరోగ్యరంగంలో అభివృద్ధి

ఎ. మాదకద్రవ్య వినియోగానికి ప్రతి వ్యక్తికీగల కారణాలు, ప్రభావితం చేసే అంశాలు.

బి. మరింత సురక్షితమైన ప్రవర్తనలు అవలంబించటానికి గల ఐచ్ఛికాలు, అవకాశాలు,

సి. ముందస్తు నిర్ణయం లేకుండా, సున్నితంగా కుటుంబ సభ్యులు, సమాజం ఇచ్చే అసరా – అనే అంశాలతో అన్ని కోణాలనుంచి సమస్యను అర్థం చేసికోని వ్యూహరచన చేయాలి.

ఇక హాని తగ్గించే కార్యక్రమాలు తరుచు కొత్త సమస్యలు తలెత్తే చర్యలతో కూడివుంటాయి. కనుక ఈ వ్యూహంలో ఎకాఎకిన ఒకేమారు చికిత్సను కాక నిరోధక చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలి. వీటివల్ల మరింత మంచి ఫలితం లభిస్తుందునే విషయాన్ని కార్యక్రమ నిర్వాహకులు విధిగా అర్థం చేసుకోవాలి.

**యువతకు సాధికారత కల్పన!**

**కిశోరప్రాయులకు ప్రాథమిక దశలో నిరోధక చర్యలు**

కిశోరప్రాయులు, యువజన బృందాలపై దిద్దుబాటు చర్యలపట్ల నేరుగా దృష్టిసారించటం ముఖ్యం. వాడకందారుల కుటుంబాలలో ఇది మరిముఖ్యం. వీరి కుటుంబ సభ్యులలోనే సూదిమందు ప్రవర్తనలు ప్రారంభమయ్యే ప్రమాదం ఎక్కువ.

**ముగింపు**

ఈశాన్య ప్రాంత అభివృద్ధిపై చర్యలకు బహుముఖ అవగాహన, వివిధ భాగస్వాములు, దృఢనిశ్చయంతో కూడిన రాజకీయ నిర్ణయంతో పాటు ఆ ప్రాంత ప్రజలతో నిరంతర సంభాషణలు జరగాలి. భాగస్వామ్యంతో సాధికారత నిర్మితమవుతుంది. సాధికార జనాభా అభివృద్ధికి కీలకం.

■



# విజ్ఞాన విపంచి

## ప్రాతూరి పోతయ్య శర్మ

1. ఇటీవల దాదా సాహెబ్ ఫాల్కే అవార్డ్ మనోజ్ కుమార్‌కి ప్రకటించారు. ఈయన నటించిన సినిమాలేవి?
   ఎ) పూరబ్ ఔర్ పశ్చిమ్, కాంచ్‌కి గుడియా.
   బి) రోటి కపడా ఔర్ మకాన్.
   సి) క్రాంతి డి) పైవన్నీ
2. "సేతు భారతం" ప్రాజెక్ట్ వివరాలేని?
   ఎ) రూ. 50,800 కోట్ల ప్రాజెక్ట్ ఇది.
   బి) 2019 నాటికి అన్ని జాతీయ రహదారిపై రైల్వే లెవల్ క్రాసింగ్స్ ఉండవు.
   సి) రూ. 20,800 కోట్లతో 208 రైల్ ఓవర్ బ్రిడ్జిలు & అండర్ బ్రిడ్జిలు నిర్మిస్తారు. రూ. 30,000 కోట్ల ఖర్చు పెట్టి 1,500 దశాబ్దాల పురాతమైన బ్రిడ్జిలు పునర్నిర్మిస్తారు.
   డి) పైవన్నీ.
3. P.A. సంగ్మా చేపట్టని పదవి ఏది?
   ఎ) లోకసభ స్పీకర్ బి) భారత రాష్ట్రపతి
   సి) మేఘాలయ ముఖ్యమంత్రి
   డి) కామర్స్ & సివిల్ సప్లైస్ మంత్రి (స్టేట్ ర్యాంక్)
4. ఈ క్రింది వాటిల్లో ఏది కరెక్ట్? (రాష్ట్రాలు : అసెంబ్లీ సీట్లు)
   ఎ) పశ్చిమ బెంగాల్ : 294
   బి) అస్సాం : 126
   సి) తమిళనాడు : 234 డి) పైవన్నీ
5. "మెడిసిన్ విత్ ది రెడ్‌లైన్" అనే ప్రచారం వేటి వాడకం గురించి తెలియచేయడానికి వాడుతున్నారు?
   ఎ) "యాంటి బయోటిక్స్" విచక్షణతో వాడకం కోసం బి) రేడియేషన్ చికిత్స
   సి) ఆయుర్వేద మందులు
   డి) హోమయోపతి మందులు
6. ఈ క్రింది అవయవాలు దానం చేసేనప్పుడు ఏవి ఎంతెంత సమయంలో ఆపరేషన్ చేసి తిరిగి అమర్చాలి?
   ఎ) గుండె : నాలుగు గంటలలోపు
   బి) లివర్ : 8 నుండి 12 గంటలలోపు
   సి) కిడ్నీ : 12 నుండి 15 గంటలలోపు
   డి) పైవన్నీ
7. దేన్ని "మనీ బిల్లు" అంటారు?
   ఎ) పన్నులకి సంబంధించినవి.
   బి) ప్రభుత్వం అప్పులు తీసుకోవడం.
   సి) కన్సాలి డేటెడ్ ఫండ్ ఆఫ్ ఇండియా నుండి చేసే ఖర్చు & దీనిలో జమ చేసే రిసీట్స్ (వసూళ్ళు) డి) పైవన్నీ
8. మనీ బిల్లు తొలుత ఎక్కడ మాత్రమే ప్రవేశ పెట్టాలి?
   ఎ) లోకసభ బి) సుప్రీం కోర్టు
   సి) ప్రధానమంత్రి కార్యలయములో
   డి) రాష్ట్రపతి కార్యలయములో
9. క్వాడ్రిలేటరల్ కో ఆర్డినేషన్ గ్రూప్ (QCG)లో ఉన్న దేశాలేవి?
   ఎ) USA డి) చైనా
   సి) పాకిస్తాన్ & అఫ్ఘనిస్తాన్
   డి) పైవన్నీ
10. 'తీస్త' నది ఒప్పందాన్ని ఏ దేశం తనతో చేసుకోమని భారతదేశాన్ని కోరుతుంది?
    ఎ) పాకిస్తాన్ బి) శ్రీలంక
    సి) బంగ్లాదేశ్ డి) మయన్‌మార్
11. నాబార్డ్ జారీచేయనున్న టాక్స్ ఫ్రీ బాండ్స్ వివరాలేవి?
    ఎ) రూ. 3,500 కోట్ల విలువగలవి, ఇవి
    బి) కాలపరిమితి 10 లేక 15 సంవత్సరాలుగా ఉంటుంది.
    సి) కూపన్ రేటు 7.04% లేక 7.35%గా ఉంటుంది. డి) పైవన్నీ
12. 108వ భారత రాజ్యాంగ సవరణ బిల్లు దేనికి సంబంధించినది?
    ఎ) అసెంబ్లీ పార్లమెంటులలో మహిళల రిజర్వేషన్. బి) GST బిల్లు
    సి) వ్యవసాయ భూముల బిల్లు
    డి) పట్టణ భూసేకరణ బిల్లు
13. రాబర్ట్ P. జార్జ్ దేనికి ఛైర్మన్?
    ఎ) U S కమీషన్ ఆన్ ఇంటర్నేషనల్ రెలిజియస్ ఫ్రీడం (USCIRF) బి) NASA
    సి) NATO డి) IMF
14. ఇటీవల నూ ఢిల్లీలో నిర్వహించిన "రైసినా డైలాగ్" ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ వివరాలేవి?
    ఎ) "ఏషియన్ కనెక్టివిటి" దీని థిమ్.
    బి) 40 దేశాల ప్రతినిధులు వచ్చారు.
    సి) అబ్జర్వర్ రిసెర్చ్ ఫౌండేషన్ దీని ఏర్పాటులో సహకరించింది. డి) పైవన్నీ
15. ఈ క్రింది వాటిల్లో ఏది కరెక్ట్?
    ఎ) BCIM : బంగ్లాదేశ్, చైనా, ఇండియా, మయన్‌మార్
    బి) SA GAR : సెక్యూరిటీ & గ్రోత్ ఫర్ అల్ ఇన్ ద రీజియన్
    సి) OBOR : వన్ బెల్ట్ వన్ రోడ్
    డి) పైవన్నీ
16. వ్యవసాయదారుల ఈ-మార్కెట్ వివరాలేవి?
    ఎ) దీన్ని ఏప్రిల్ 14 నాడు ప్రారంభించదలిచారు.
    బి) అగ్రికల్చరల్ ప్రొడ్యూస్ మార్కెటింగ్ కమీటి యాక్ట్ (APMC)కి సవరణ చేయాలి.
    సి) ఫిజికల్ లాజిస్టిక్ సపోర్ట్ ఏర్పాటు చేయాలి.
    డి) పైవన్నీ
17. UDAY బాండ్స్ జారీచేయటానికి ముందుగా ఏ రాష్ట్రాలకి అనుమతి లభించింది?
    ఎ) ఉత్తర్ ప్రదేశ్ బి) రాజస్థాన్
    సి) జార్ఖండ్ & ఛత్తీస్‌గఢ్ డి) పైవన్నీ
18. బాంబే స్టాక్‌ఎక్స్ఛేంజ్ & నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల్లో, ఫారెన్ ఎక్స్ఛేంజ్‌లు ఎంతవరకు హోల్డింగ్‌లు పెంచుకోవచ్చును?
    ఎ) 15 శాతం బి) 40 శాతం
    సి) 50 శాతం డి) 75 శాతం
19. 340 రోజుల అంతరిక్షయాత్ర పూర్తి చేసుకొని ఇటీవల భూమికి (కజకిస్తాన్) తిరిగి వచ్చిదెవరు?
    ఎ) స్కాట్ కెల్లీ (USA)
    బి) నీల్ ఆర్మ్ స్ట్రాంగ్ సి) ఎడ్విన్‌ఆల్డ్రిన్
    డి) యూరిగగారిన్.
20. ASEAN – ప్లస్‌లో అబ్జర్వర్ దేశాలు ఏవి?
    ఎ) ఇండియా, జపాన్, దక్షిణ కోరియా.
    బి) చైనా, రష్యా, USA
    సి) ఆస్ట్రేలియా & న్యూజిల్యాండ్
    డి) పై 8 దేశాలు, పూనాలో జరిగిన FTX-2016 అనే మిలటరీ డ్రిల్లులో ఇవి పాల్గొన్నాయి.
21. ఈ క్రింది వాటిలో ఏది కరెక్ట్?
    ఎ) FRL : ఫుల్ రిజర్వాయర్ లెవల్
    బి) WAPCOS : వాటర్ & పవర్ కన్సల్టెన్సీ సర్వీసెస్.
    సి) TMCFT : ట్రైమిలియన్ క్యూబిక్ ఫీట్
    డి) పైవన్నీ (వాటర్ ప్రాజెక్ట్‌లకు సంబందించినవి)
22. నల్లధనం వెలికితీతకు 2016-17 బడ్జెట్‌లో ప్రకటించిన ఇన్‌కం డిక్లరేషన్ స్కీం (IDS) ఎప్పుడు నుండి మొదలౌతుంది?
    ఎ) 01.01.2015 బి) 01.06.2016
    సి) 30.09.2016 డి) 01.04.2017
23. భారతదేశంలో వ్యవసాయ భూమి ఉన్న ఎంత మంది వ్యవసాయదారులకు, సాయిల్ హెల్త్ కార్డులు జారీ చేయనున్నారు?

ఎ) 14 కోట్లు బి) 124 కోట్లు
సి) 50 కోట్లు డి) 25 కోట్లు

24. బ్యాంక్ బోర్డు బ్యూరో తొలి ఛైర్మన్‌గా ఎవర్ని నియమించారు?
ఎ) V.K. షుంగ్లూ బి) వినోద్ రాయ్
సి) C. రంగరాజన్ డి) U.K. సిన్హా

25. బ్యాంక్ బోర్డు బ్యూరో విధులేవి?
ఎ) ప్రభుత్వ రంగ బ్యాంకుల సంస్కరణలో కీలక పాత్ర పోషించడం.
బి) ప్రభుత్వ రంగ బ్యాంకుల ఉన్నత పదవుల నియామకాలకు రికమెండ్ చేయడం.
సి) నిధులు సమకుర్చుకోటానికి సలహా ఇవ్వడం, బ్యాంకుల విలీనం ఎలాగో తెల్పడం.
డి) పైవన్నీ

26. "లో కార్బన్ లైఫ్ స్టైల్" అనే డాక్యుమెంట్ ప్రకారం ఈ క్రింది వాటిలో ఏది కరెక్ట్?
ఎ) ట్రాఫిక్ సిగ్నల్ పడ్డప్పుడు, కారు స్వీచ్ ఆఫ్ చేయడం వల్ల 85 నుండి 122 కిలోల కార్బన్ డయాక్సైడ్ విడుదల అవుతుంది. సంవత్సరంలో
బి) రోజు ట్రెడ్‌మిల్ మీద వ్యాయామం చేసే వ్యక్తి సంవత్సరంలో 544.215 యూనిట్ల విద్యుచ్ఛక్తి ఖర్చు చేస్తాడు.
సి) యోగ చేయటం వలన, 44 వృక్షాలను ఇంధనం కోసం నరకటం ఆపవచ్చును.
డి) పైవన్నీ

27. రసూల్‌పుకుట్టికి గోల్డెన్ రీల్ అవార్డ్ వచ్చింది. ఈ అవార్డ్ పూర్తి పేరు ఏది?
ఎ) అమెరికాన్ మోషన్ పిక్చర్ సౌండ్ ఎడిటర్స్ (MPSE) వార్షిక గోల్డెన్ రీల్ అవార్డ్
బి) గోల్డెన్ గ్లోబ్ అవార్డ్
సి) గ్రామీ అవార్డ్ డి) BAFTA అవార్డ్

28. ఇటీవల ఏ దేశ పార్లమెంట్‌లో రికార్డ్ బ్రేకింగ్ స్థాయిలో "ఫిలిబస్టర్" ప్రకియ నిర్వహించారు, ప్రతిపక్ష పార్టీవారు?
ఎ) దక్షిణకోరియా బి) ఉత్తరకోరియా
సి) జపాన్ డి) గ్రీస్

29. 19వ శతాబ్దపు బ్రిటీష్ జియోఆర్కియాలజిస్ట్, రాబర్ట్ బ్రూస్ ఫూట్ ముఖ్యంగా దేనిమీద పరిశోధన చేశాడు?
ఎ) సింధునాగరికత
బి) భారతదేశంలో శిలాయుగంనాటి రాతి పనిముట్లు / పరికరాలు.
సి) హరప్పా నాగరికత డి) ఆర్యసంస్కృతి

30. హర్ష ఛాద-షా భారతదేశంలో ఏ పద్ధతి ద్వారా పుట్టిన శిశువు?
ఎ) IVF (టెస్ట్‌ట్యూబ్ బేబి) బి) వాసెక్టమీ
సి) ట్యూబెక్టమీ డి) ఇవేవికావు

31. "సర్‌క్రీక్" అనే సరిహద్దు ఎక్కడుంది?
ఎ) జమ్ము & కాశ్మీర్ బి) గుజరాత్ దగ్గర
సి) పంజాబ్ డి) రాజస్థాన్

32. "యాంకర్ బ్యాంక్స్"గా వేటిని గుర్తించనున్నారు?
ఎ) SBI బి) బ్యాంక్ ఆఫ్ బరోడా
సి PNB & కెనరా బ్యాంక్ డి) పైవన్నీ

33. "ధర్మశాల" పట్టణం ఎక్కడుంది? (ఇటీవల క్రికెట్ న్యూస్‌లో ఉంది)
ఎ) హిమాచల్‌ప్రదేశ్ బి) పశ్చిమబెంగాల్
సి) ఉత్తర్‌ప్రదేశ్ డి) బీహార్

34. మార్చ్ 3, 2015 నాటికి, ఎంత మంది LPG ఇళ్ళవారు "సబ్సిడి గివ్ అప్" (వదులుకున్నారు) చేశారు (లక్షలలో)?
ఎ) 80 బి) 153 సి) 40 డి) 16

35. "సాగర్‌మాల" ప్రాజెక్ట్ వివరాలేవి?
ఎ) రూ. 90,000 కోట్ల, ఓడరేవుల అధునీకరణ వంటి మేజర్ అభివృద్ధి ప్రోగ్రాంలు.
బి) రూ. 1.20 లక్షల కోట్ల ఓడరేవుల కనెక్టివిటి.
సి) రూ. 90,000 కోట్ల ఓడరేవుల సారధ్యం వహించే పారిశ్రామీకరణం.
డి) పైవనీ (దీనిలో సాగర తీరప్రాంత జనుల అభివృద్ధి కూడ భాగం)

36. ఏప్రిల్ 14-16, 2016లో ఎక్కడ ఇండియన్ మారిటైం సమ్మిట్ నిర్వహిస్తారు? (దీనిలో గుర్తించిన రూ. 72,864 కోట్ల విలువగల 109 ప్రాజెక్టలకు సంబంధించిన ఎగ్రిమెంట్‌లు చేసుకోనున్నారు. (సాగర్‌మాల ప్రాజెక్ట్‌లో ఉన్న 150 ప్రాజెక్ట్‌లు చూపమన్నారు).
ఎ) చెన్నయ్ బి) ముంబాయ్
సి) విశాఖపట్నం డి) కోచి

37. 30.11.2015 నాటికి భారతదేశానికి ఎంత వాణిజ్య ఓడల ఫ్లీట్‌స్ట్రెంగ్త్ (ఓడల సామర్థ్యం) ఉంది?
ఎ) 1,246 ఓడలు (15.37 మిలియన్ల డెడ్ వైట్ టన్నేజ్ (DWT) ఉంది.
బి) 500 షిప్‌లు సి) 600 షిప్‌లు
డి) ఇవేవికావు.

38. బ్రిటీష్ ప్రభుత్వం భారతదేశానికి క్రొత్తగా ఎవర్ని హై కమీషనర్‌గా నియమించింది?
ఎ) సర్ డొమినిక్ ఆస్ క్విత్
బి) ఎడ్గార్ D. మిషల్ సి) టూంమాక్కార్టీ
డి) సర్ జేమ్స్ బేవాన్

39. IRNSS-1F వివరాలేవి?
ఎ) దీని బరువు 1.425 కిలోగ్రాములు.
బి) PSLV-C32 రాకెట్ ద్వారా పంపించారు.
సి) IRNSS లో ఉన్న 7 ఉపగ్రహాలలో ఇది ఒకటి డి) పైవన్నీ.

40. 2015-16లో తెలంగాణ రాష్ట్ర ఆర్థికాభివృద్ధి రేటు ఎంత?
ఎ) 11.7% బి) 15%
సి) 8.6% డి) 7.6%

41. 2015-16 సంవత్సరంలో తెలంగాణ రాష్ట్ర GSDP ఎంత? (ప్రస్తుత ధరలలో)? (లక్షల కోట్ల రూపాయాలలో)
ఎ) 4.83 బి) 5.83
సి) 2.83 డి) 7.83

42. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి (2015-16లో) ఏది కరెక్ట్?
ఎ) వ్యవసాయం & సంబంధిత కార్యకలాపాల వృద్ధి రేటు 0.8%
బి) పరిశ్రమల ఉత్పత్తి వృద్ధి రేటు 8.3%
సి) సర్వీసెస్ సెక్టర్ వృద్ధి రేటు 14.9%
డి) పైవన్నీ

43. తెలంగాణ రాష్ట్రంలో తలసరి ఆదాయం 2015-16లో ఎంత?
ఎ) రూ. 1,43,023 బి) రూ. 1,29,182
సి) రూ. 93,231 డి) ఇవేవికావు.

44. "మిషన్ భగీరథ" కింద తెలంగాణ రాష్ట్రంలో డిసెంబర్ 2016లోగా ఎన్ని గ్రామాలకు మంచినీరు అందించనున్నారు?
ఎ) 6,100 బి) 2,000
సి) 3,000 డి) ఇవేవికావు

45. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 2016-17 సంవత్సరపు బడ్జెట్ ఎంత? (లక్షల కోట్ల రూపాయాలలో)
ఎ) 1.35 బి) 2.35
సి) 4.35 డి) ఇవేవికావు

46. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2016-17 వార్షిక బడ్జెట్‌లో దేనికెంత కేటాయించింది? (కోట్ల రూపాయాలలో)
ఎ) వ్యవసాయం గ్రామీణ అభివృద్ధి మొదలైన వాటికి 13,648.72
బి) సోషల్ సర్వీసెస్ 21,556.97
సి) ఇరిగేషన్ 7.325.21
డి) పైవన్నీ

47. ఏ బాక్టీరియా పాలిఎథిలిన్ టెరాఫ్థలేట్ (PET) మట్టిలా మార్చగలదు అంటున్నారు.
ఎ) ఇడియోనెల్లా శాకెయిన్ సిస్ 201-F6 (Ideonella Sakainsis 201-F6)
బి) ట్యూబర్‌క్యులోసిస్ బాసిలస్.
సి) E కోలి డి) ఇవేవికావు.

48. ఫోచేరా జలపాతం ఎక్కడుంది?
ఎ) ఆదిలాబాద్ జిల్లా
బి) నల్గొండ జిల్లా సి) వరంగల్ జిల్లా
డి) మహబూబ్‌నగర్ జిల్లా

49. ఈ క్రింది వాటిల్లో ఏది కరెక్ట్?
ఎ) ISRO ఛైర్మన్ : A.S. కిరణ్‌కుమార్
బి) డిఫెన్స్ మినిస్టర్ సైంటిఫిక్ ఎడ్వైజర్ : జి. సతీష్ రెడ్డి
సి) నేషనల్ ఏరో స్పేస్ లేబరేటరీస్ డైరెక్టర్ శ్యాం చెట్టి డి) పైవన్నీ

50. తూర్పు గోదావరి జిల్లాల్లో కలిసిపోయిన మండలాలేవి?
ఎ) కూనవరం బి) వి.ఆర్.పురం
సి) చింతూర్ & నెల్లిపాక డి) పైవన్నీ

51. పశ్చిమ గోదావరి జిల్లాల్లో కలిసిపోయిన మండలాలేవి?
ఎ) కుకునూర్ బి) బూర్గంపాడు
సి) వేలూరుపాడు డి) పైవన్నీ

52. "మిషన్ కాకతీయ" కింద తొలి దశలో 8,016 చెరువుల అభివృద్ధి మరమ్మత్తులు పునర్నిర్మాణం చేపట్టారు. రెండవ దశలో ఎన్ని చెరువులకు సంబంధించి పనులు చేపట్టనున్నారు?
ఎ) 4,500 బి) 1,300
సి) 4,193 డి) 3,800

53. CCMB ఎక్కడెక్కడ ఆపిల్ మొక్కలు నాటి పంటకు సిద్ధం చేసింది?
ఎ) అరుకు, పాడేరు, చింతాపల్లి (ఆంధ్రప్రదేశ్)
బి) కోరాపుట్ (ఒడిషా)
సి) ఆదిలాబాద్ (తెలంగాణ) డి) పైవన్నీ

54. కాక్రపార్ అటమిక్ పవర్ స్టేషన్ (KAPS) ఏ రాష్ట్రంలో ఉంది?
ఎ) గుజరాత్ బి) తమిళనాడు
సి) రాజస్థాన్ డి) మహారాష్ట్ర

55. కాక్రపార్ అటమిక్ పవర్ స్టేషన్‌లో కూలెంట్ సిస్టం ఫీడర్ (Feeder) పైప్‌లో ఏది సర్క్యులేషన్‌లో (ప్రైమరీ హీట్ ట్రాన్స్‌పోర్టు సిస్టంలో) ఉంటుంది?
ఎ) భారజలం బి) లిక్విడ్ సోడియం
సి) హీలియం డి) యూరేనియం

56. ఈ క్రింది వాటిలో ఏది కరెక్ట్?
ఎ) AERB : అటమిక్ ఎనర్జీ రెగ్యూలేటరీ బోర్డ్
బి) PHWR : ప్రెజరైజ్డ్ హెవీ వాటర్ రియాక్టర్
సి) DAE : డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటమిక్ ఎనర్జీ
డి) పైవన్నీ

57. ఈ క్రింది మహిళల్లో ఎవరు, ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో, ఫైటర్ స్ట్రీంలో, రెండవదశ ట్రైనింగ్‌లో ఉన్నారు?
ఎ) భావనాకాంత్ బి) అవని చతుర్వేది
సి) మోహన్‌సింగ్ డి) పై ముగ్గురూ.

58. యమునా-సట్లేజ్ లింక్ కెనాల్ (SYL) వివరాలేవి?
ఎ) దీనికి శంకుస్థాపన 1982లోనే చేశారు.
బి) దీనివల్ల పంజాబ్, హర్యానా రాష్ట్ర రైతులకు లబ్దిచేకూరుతుంది.
సి) ఈ ప్రాజెక్ట్ అనేక కారణాల చేత, కోర్టు కేసులవల్ల ముందుకు సాగడం లేదు.
డి) పైవన్నీ

59. గ్రామీణ రైతుల వ్యవసాయ ఆధారిత ఆదాయం పెరగడం కోసం, భారత ప్రధానమంత్రి నరేంద్రమోది రైతులు తమ వ్యవసాయ భూమిని ఎన్ని రకాలుగా విభజించి వాడుకోవాలన్నారు?
ఎ) సాంప్రదాయ వ్యవసాయం కోసం.
బి) "ట్రీ" లే "టింబర్" (కలప) ప్లాంటేషన్ (పొలంగట్ల వెంబడి మొక్కలు నాటడం)
సి) పశుపోషణ కోసం
డి) పై మూడు రకాలుగా

60. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అసెంబ్లీ సీట్లు 175 నుండి ఎంతకి పెంచదలిచారు?
ఎ) 225 బి) 250 సి) 260 డి) 293

61. బకింగ్‌హాం కెనాల్, కాకినాడను దేనితో కలుపుతుంది?
ఎ) చెన్నయ్ బి) కోల్‌కత
సి) విశాఖపట్నం డి) కటక్

62. ప్రతిపాదిత నేషనల్ వాటర్ వే (NW) నంబర్ 4 కాకినాడ పుదుచ్చేరి కెనాల్ సిస్టం (1078 కిలోమీటర్ల పొడవు) మొత్తం నిర్మాణ వ్యయం ఎంత? (కోట్ల రూపాయాల్లో)
ఎ) 3,426 బి) 2,800
సి) 1,000 డి) 1,200

63. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ యాక్ట్‌లోని సెక్షన్ 12 ప్రకారం ఏ ముఖ్య సేవాలు రిలీఫ్ క్యాంప్‌ల వద్ద అందించాలి?
ఎ) షెల్టర్ (నివాసం)
బి) ఆహారం తాగేందుకు మంచినీరు
సి) మెడికల్ సదుపాయాలు, శానిటేషన్
డి) పైవన్నీ

64. బ్యాంక్ బోర్డ్ బ్యూరోలో ఎంత మంది ఉంటారు?
ఎ) ఒక ఛైర్మన్ బి) 3 ఎక్స్ అఫిషియో సభ్యులు సి) 3 ఎక్స్‌పర్ట్ సభ్యులు
డి) పైవన్నీ (మొత్తం 7 మంది)

65. భారత రాజ్యాంగంలోని ఎన్నవ అర్టికల్ ప్రకారం కంట్రోలర్ & అడిటర్ జనరల్ అఫ్ ఇండియా (CAG) పదవీ విరమణానంతరం ఏ ఉద్యోగం, ప్రభుత్వంలో చేయరాదు?
ఎ) 148(4) బి) 256 సి)259 డి) 370

66. ఎవరెస్ట్ శిఖరం ఎక్కేందుకు సహాయపడే "ఐస్ డాక్టర్లు" (Ice Doctors) ఎవరు? ఏమి చేస్తారు?
ఎ) వీరు బాగా నైపుణ్యంగల పర్వత రోహకులు
బి) ప్రతి సిజన్‌లోను మొదట వీరు పర్వతం ఎక్కుతారు.
సి) తాళ్ళు, నిచ్చెనలు వాడుతు, మంచు అఘాతాల మధ్య రహదారి మార్గలు ఏర్పరుస్తారు. డి) పైవన్నీ.

67. భారతీయ జ్ఞానపీఠ్ వారి "మూర్తి దేవి" (Moorti Devi) అవార్డ్ ఇటీవల ఎవరికిచ్చారు?
ఎ) కొలకలూరి ఇనాక్ (పుస్తకం పేరు అనంత జీవనం)
బి) డా॥ సి.నారాయణ రెడ్డి
సి) విశ్వనాథ సత్యనారాయణ
డి) రావూరి భరద్వాజ

68. ఏప్రిల్, డిసెంబర్ 2015 మధ్య కాలంలో భారతదేశానికి వచ్చిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులలో అనగా US $ 30 బిలియన్లలో 60% ధనం ఏ దేశాల నుండి వచ్చింది?
ఎ) సింగపూర్ & మారిషస్
బి) UK సి) ఫ్రాన్స్ డి) జర్మనీ

69. G-20 దేశాల ఫైనాన్స్ మినిస్టర్స్ & సెంట్రల్ బ్యాంకర్స్ గవర్నర్ల సమావేశం ఇటీవల ఏక్కడ నిర్వహించారు.
ఎ) ప్యారిస్ బి) షాంఘై, చైనా
సి) బెర్లిన్ డి) టోకియో

70. G-20లో ఏ దేశాలు ఉన్నాయి?
ఎ) USA బి) చైనా, బ్రెజిల్
సి) ఇండోనేషియా, టర్కీ డి) పైవన్నీ

71. ఏప్రిల్ 2015లో అజయ్‌కుమార్ కమిటీని దేని కోసం నియమించారు?
ఎ) వ్యాపారం సులువుచేయడం కోసం, మల్టిపుల్ పర్మిషన్లు ముందుగా తీసుకోవడం వంటి వాటిని తగ్గించడం కోసం.
బి) గనుల తవ్వకం కోసం
సి) విద్యుత్ ఛార్జీల పెంపకం కోసం
డి) టెలికాం సర్వీసులకోసం

72. మైల్డ్రోనేట్ (Mildronate) అనే మందు వాడడం వలన ఏ టెన్నిస్ క్రీడా కారిణి సస్పెన్షన్‌కి గురయ్యింది?
ఎ) వీనస్ విలియమ్స్ బి) మారియా షరపోవా
సి) సేరీనా విలియమ్స్ డి) ఏంజాలా కెర్బర్


73. నేషనల్ శిల్ప్ గురు అవార్డ్-2014 ఎవరికిచ్చారు? ఈయన అనుచరులు ఎవరికి సాయపడతారు?
ఎ) కోవా నానేశ్వర్, కేస్లాగూడా, కేరామేరి
బి) సాంప్రదాయ విత్తనాలు నాటే పరికరాలు, దీపాలు, గంటలు తయారుచేసి గోండులకు సాయపడతారు.
సి) మాస్కులు, శిల్పాలు కూడ చేసి గోండులకు సాయపడతారు డి) పైవన్నీ

74. "సిల్వస్స" దేని రాజధాని? ఏ పారిశ్రామిక నగరాల మధ్య దారిలో ఉంది?
ఎ) దాద్ర & నాగర హవేలి రాజధాని
బి) ముంబాయ్ & అహమ్మదాబాద్ మధ్య దారిలో ఉంది.
సి) ఇక్కడ ఇండస్ట్రియల్ పార్క్ రానున్నది.
డి) పైవన్నీ

## జవాబులు (ఏప్రిల్ - 2016)

| | | | |
|---|---|---|---|
| 1-డి | 19-ఎ | 37-ఎ | 56-డి |
| 2-డి | 20-డి | 38-ఎ | 57-డి |
| 3-బి | 21-డి | 39-డి | 58-డి |
| 4-డి | 22-బి | 40-ఎ | 59-డి |
| 5-ఎ | 23-ఎ | 41-బి | 60-ఎ |
| 6-డి | 24-బి | 42-డి | 61-ఎ |
| 7-డి | 25-డి | 43-ఎ | 62-ఎ |
| 8-ఎ | 26-డి | 44-ఎ | 63-డి |
| 9-డి | 27-ఎ | 45-ఎ | 64-డి |
| 10-సి | 28-ఎ | 46-డి | 65-ఎ |
| 11-డి | 29-బి | 47-ఎ | 66-డి |
| 12-ఎ | 30-ఎ | 48-ఎ | 67-ఎ |
| 13-ఎ | 31-బి | 49-డి | 68-ఎ |
| 14-డి | 32-డి | 50-డి | 69-బి |
| 15-డి | 33-ఎ | 51-డి | 70-డి |
| 16-డి | 34-ఎ | 52-ఎ | 71-ఎ |
| 17-డి | 35-డి | 53-డి | 72-బి |
| 18-ఎ | 36-బి | 54-ఎ | 73-డి |
| | | 55-ఎ | 74-డి |

### కృత్రిమ మాంసం



మాంసాహారులు త్వరలోనే, జంతువులను చంపకుండ మాంసాహారాన్ని తినవచ్చు. జంతువులకు ఎలాంటి హాని/గాయం చేయకుండానే వాటి మూలకణాల నుండి మాంసాన్ని ఉత్పత్తి చేసే వినూత్న ప్రక్రియను భారత సంతతికి చెందిన కార్డియాలజిస్ట్ డా. ఉమ వేలేటి అభివృద్ధి చేశారు. మిన్నెసోట విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్న డా. ఉమ, మెంఫిస్ మీట్ అనే ఒక సంస్థను ఏర్పాటుచేసి, బాక్టీరియా వంటి కాలుష్యాలు, అత్యధిక కొవ్వు వంటి సమస్యలు లేకుండా, మరీ ముఖ్యంగా జీవహింస లేకుండా ఈ కృత్రిమ మాంసాన్ని అందు బాటులోకి తెస్తున్నారు. ముందుగా ఆరోగ్య వంతమైన మూలకణాలను సేకరించి, వాటికి అదనపు పోషకాలు, ఆక్సిజన్‌లను జోడించి, అభివృద్ధిచేస్తారు. ముందుగా అమెరికన్ రెస్టారెంట్లలో అందుబాటులోకి తీసుకువచ్చి, క్రమేణా భారత్, చైనాలలో కూడ విస్తరిస్తారు.

### త్రి-డి స్పీడ్ బ్రేకర్లు



రోడ్డు ప్రమాదాలలో మరణించేవారి సంఖ్యలో మన దేశం ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉన్నది. అహ్మదాబాద్‌కు చెందిన తల్లీ కూతుళ్ళు సౌమ్య పండ ఠాకుర్, శకుంతల పాండ్యలు సృజనాత్మకంగా పైబొమ్మలోచూపినవిధంగా త్రి-డి స్పీడ్ బ్రేకర్లను రూపొందించారు. ఈ నమూనాను అహ్మదాబాద్ నగర అధికారులు ఎంతో ప్రశంసించారు. మనదేశంలోనే ఇది ఒక వినూత్న నమూనా. ఎక్కువ ప్రమాదాలు జరిగే కూడళ్ళలో ఈ నమూనా ఎంతో ఉపయోగకరం.

### డిజిటల్ ప్రాధమిక ఆరోగ్య కేంద్రం



మహారాష్ట్ర లోని జలగావ్ జిల్లాలోని పటొండ గ్రామంలోని ప్రాధమీక ఆరోగ్యకేంద్రం లో వైద్యురాలిగా పనిచేస్తున్న ఢా. మనీషమహాజన్ కేంద్ర ప్రభుత్వం నుండి ఎటువంటి సహాయము లేకుండా 24/7 WIFI తో పనిచేసే పూర్తి డిజిటల్ ప్రాధమీక ఆరోగ్య కేంద్రాన్ని రూపొందించింది. కొంత విరాళాల రూపంలో సేకరించి, మరికొంత స్వయంగా తాను వెచ్చించి, తన కలలకు ఒక రూపాన్నిచ్చింది డా. మనీష. డిజిటల్ సాఫ్టవేర్‌ను, సి.సి.టి.వి. కెమెరాలను, వైఫైలను ఏర్పాటుచేసి, ముందుగా తను పనిచేస్తున్న ప్రాధమీక ఆరోగ్య కేంద్రాన్ని, పేపర్లెస్ కార్యాలయంగా మార్చింది. చుట్టుపక్కల 13 గ్రామాల ప్రజలకు సేవలందిస్తూ, చిన్నపిల్లల టీకాలకు తల్లిదండ్రులకు సకాలంలో సూచనలివ్వడం వంటి ఆధునిక చర్యలను చేపట్టింది. దీనితో ఈకేంద్రానికి వచ్చే రోగుల సంఖ్య 30-40 శాతం పెరిగింది.

### నగదు రహిత సమాజం దిశగా




భారతీయ సమాజం క్రమంగా నగదు రహిత సమాజంగా రూపు దిద్దుకుంటున్నది. ఉన్నతవర్గాలవారు ఇప్పటికే నగదుపై ఆధారపడటాన్ని 30-40 శాతం తగ్గిస్తే, పేదలు మాత్రం, కమీషన్ల రూపంలో అదనంగా చెల్లిచాల్సి వస్తుందని కార్డులను వినియోగించడంలేదు. అయితే, పట్టణ పేదలలో మాత్రం, ఈ-కామర్స్, మొబైల్ బ్యాంకింగ్, జనధనయోజన ఖాతాలు, ఆన్ లైన్ బ్యాంకింగ్‌ల వంటి నూతన అవిష్కరణల కారణంగా, నగదు లావాదేవీలను చాలావరకు తగ్గించారు. ఇప్పటికీ, దేశంలో జరుగుతున్న మొత్తం లావాదేవీలలో అన్-లైన్ లావాదేవీలు కేవలం ఐదు శాతం మాత్రమే! నగదు లావాదేవీలు తగ్గితే, చలామణీలోని నగదు మొత్తం తగ్గుతుంది, తద్వారా ద్రవ్యోల్బణం, నల్లధనం వంటి సమస్యలు తగ్గుతాయి.

### దేశంలోని మొదటి డిజిటల్ రాష్ట్రం కేరళ



కేరళరాష్ట్రాన్ని దేశంలోని మొదటి డిజిటల్ రాష్ట్రంగా రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ

ప్రకటించారు. కొజికోడ్ జిల్లాలో డిజిటల్ సశక్తీకరణ అవగాహన ర్యాలీని ప్రారంభిస్తూ ఆయన, ఈమేరకు ఒక ప్రకటన చేశారు. దీని ప్రత్యేకతలేమంటే, ప్రతి గ్రామానికీ హైస్పీడ్ బ్రాడ్బాండ్ కనెక్షన్, 2,500 అక్షయ కేంద్రాలు, అన్ని రకాల ప్రభుత్వ కార్యకలాపాలకూ తగిన సాఫ్ట్ వేర్ ఉపయోగం వంటివి. రాష్ట్రంలోని 60 శాతం జనాభాలో, 95 శాతం డిజిటల్ అక్షరాస్యత ఉన్నది.

**నూతన రియల్ ఎస్టేట్ బిల్లు**




కొనుగోలు దారులకు, నిర్మాణ రంగంలోని వారికీ కూడ ఉపయోగపడేలా రియల్ ఎస్టేట్ బిల్లుకు రాజ్యసభ ఇటీవల తన ఆమోదాన్ని తెలిపింది. 'ద రియల్ ఎస్టేట్ రెగ్యులేషన్ బిల్' అని పిలిచే ఈ బిల్లు ప్రకారం, నిర్మాణదారులు అపార్టుమెంట్లు కానీండి, వ్యక్తిగత ఇళ్ళు గానీండి, భారీనిర్మాణాలు కానీండి, లేఅవుట్ ప్రణాళికలు, భూమి యాజమాన్య స్థితిగతులు, పని ఎప్పుడు మొదలెడుతున్నారు, ఎప్పటికి ఖచ్చితంగా పూర్తి చేస్తారు వంటి వివరాలన్నింటినీ ముందుగా ప్రతి జిల్లా ప్రధానకేంద్రంలో ఉండే రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అధారిటీ వద్ద తప్పనిసరిగా నమోదు చేయించాలి. ఈ జిల్లా స్థాయి అథారిటీలను త్వరలో ఏర్పాటు చేస్తారు. చివరకు ఖాళీజాగాలు అమ్మాలన్నా, ముందుగా రిజిష్టర్ చేయించాలి. అంతేకాదు, నిర్మాణదారులు కొనుగోలు దారులు చెల్లించిన మొత్తంలో సగం మొత్తాన్ని ఈ అధారిటీ వద్ద డిపాజిట్ చేయాలి. ఒకవేళ నిర్మాణదారులు పని మధ్యలో ఆపేస్తే, ఈ మొత్తంతో మిగిలిన పని పూర్తి చేయిస్తారు. ఇక నిర్మాణదారులకు వెసులుబాటు ఏమంటే, ప్రభుత్వం బయటినుండి వనరుల సేకరణకు మద్దతునిస్తుంది.

**వ్యవసాయోత్పత్తుల మార్కెటింగ్‌కు నూతన సౌలభ్యం**



కర్ణాటక లోని దాదాపు 1.4 మిలియన్ల మంది రైతులు మధ్య దళారుల ప్రమేయం లేకుండ తమ ఉత్పత్తులను ఆన్-లైన్‌లో గిట్టుబాటైన ధరలకు అమ్ముకో గలుగుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన 'యూనిఫైడ్ మార్కెటింగ్ ప్లాట్ ఫారం'లో సభ్యులుగాచేరి, అంతర్జాలంలో గిట్టుబాటైన ధరలను ఎంచుకుని అమ్ముకోగలుగుతున్నారు. 2014 లో ఏర్పాటైన 'రాష్ట్రీయ ఈ-మార్కెట్ సర్వీసు దీనికి సంధానకర్తగా వ్యవహరిస్తున్నది. దీనివల్ల, మధ్య దళారుల ప్రమేయం తగ్గడమే కాక, ఉత్పత్తులను కొనుగోలుచేసే వ్యాపారులు చెల్లింపులు ఆలస్యం చేయకుండ కూడ నివారించ గలుగుతున్నారు.

**ఎక్కడ మత, ధన, రాజకీయాల ప్రస్తావన ఉండదో...**



ఈ భూమిమీద ఎక్కడైనా మతము, రాజకీయాలు, ధనానికి అత్యధిక ప్రాధాన్యముంటుంది. ఈ మూడింటి వికృత కేళి మానవత్వాన్ని మంటగలుపుతున్న విషయం మనకందరకూ అవగతమే! ఇవిలేని ప్రదేశం స్వర్గధామమే కదా! మనదేశంలోనే అలాంటి ఒక ఊరు ఉన్నది. అదే తమిళనాడులోని విల్లుపురం జిల్లాలోని "ఆరోవిల్లి" . పుదుచ్చేరికి అత్యంత సమీపంలో ఉన్న ఈ ఊరు ప్రముఖ ఆధ్యాత్మిక నేత శ్రీ అరవిందుల వారి అనుయాయి మీర్రా అల్ఫాసా (Mirra Alfassa) గారి ఆధ్యాత్మిక కేంద్రం కూడ. ఈవిడే మదర్ పేరుతో ప్రసిద్ధిచెందారు. మనిషిని పరిణామక్రమానికి ప్రతిరూపంగా నమ్మే ఈ విధానంలో మనిషికి మాత్రమే విలువనిస్తారు. రోజువారీ కార్యకలాపాలలో ఈ పట్టణ పరిధి వరకూ డబ్బు/కరెన్సీ ప్రస్తావన ఉండదు. అందరూ "ఆరో కార్డ్"నే ఉపయోగిస్తారు. కేవలం బయటి ప్రపంచంతో లావాదేవీలకు మాత్రమే డబ్బును వాడతారు. అలాగే ఈ పట్టణంలో నివసించేవారందరూ, అరవిందుని మార్గాన్ని మాత్రమే అనుసరిస్తారు. ఇతర మతాల ప్రస్తావన ఉండదు. మరో ప్రత్యేకత ఏమంటే, ఇక్కడ రాజకీయ పరిపాలన ఉండదు. మైనారిటీ దాటిన ప్రతిపౌరుడూ సభ్యునిగా ఉండే ఒక సంఘం పట్టణ పరిపాలనా వ్యవహారాలను చూసుకుంటుంది. ఎంత బాగుందో! ■

విశేష వ్యాసం

# ఈశాన్య రాష్ట్రాల్లో వ్యవసాయం : సేంద్రియ పద్ధతుల్లో సత్ఫలితాలు



**సిక్కిం, దేశంలో తొలి సేంద్రియ వ్యవసాయం రాష్ట్రంగా ఎదిగింది. ఈ ఘనత సాధించి నందుకుగాను 2016 జనవరి 18న ప్రధాని మోదీ సిక్కింను పూర్తి స్థాయి తొలి సేంద్రియ వ్యవసాయ రాష్ట్రంగా ప్రకటించారు. ముఖ్యంగా గత దశాబ్ద కాలంగా సిక్కింలో 75 వేల హెక్టార్ల విస్తీర్ణంలోని వ్యవసాయ క్షేత్రంలో సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయం చేయడం మొదలు పెట్టారు.**

ఈశాన్య రాష్ట్రాల ప్రజలకు వ్యవసాయమే ప్రధాన వృత్తి. ముఖ్యంగా వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి పరచడం ద్వారా పలు సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది. ప్రధానంగా ప్రకృతి పరమైన సమస్యలు అలాగే వెనుకబాటుతనం వల్ల వెల్లువెత్తుతున్న హింస తదితర సమస్యలన్నింటినీ వ్యవసాయ అభివృద్ధితో అధిగమించవచ్చు. ఈశాన్య రాష్ట్రాలుగా పిలవబడే ఎనిమిది రాష్ట్రాలైన అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, సిక్కిం, మణిపూర్, మిజోరాం, మేఘాలయా, నాగాలాండ్, త్రిపుర రాష్ట్రాల్లో ప్రజల జీవన స్థితిగతులను అభివృద్ధి చేసేందుకు వ్యవసాయాభివృద్ధిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

ఇదిలా ఉంటే ఈశాన్య రాష్ట్రాల్లో ప్రతి రాష్ట్రంలోనూ భిన్నమైన పరిస్థితులు ఉంటాయి. అలాగే అక్కడ వ్యవసాయవిధానాల్లోనూ ప్రతి రాష్ట్రంలోనూ భిన్నత్వం కనిపిస్తుంది. కాగా భారత దేశమే భిన్నసంస్కృతుల సమాహారం. ముఖ్యంగా భిన్న నాగరికతల నడుమ ప్రజలు జీవనం కొనసాగిస్తుంటారు. అయినప్పటికీ సమస్యలను అధిగమిస్తూ సాగడం భారతీయ సంస్కృతిలో ప్రధాన బలంగా ఉంది. ప్రతి ప్రాంతంలోనూ ప్రత్యేక వ్యవసాయ పద్ధతులు ఉంటాయి. అందుకు కారణాలు లేకపోలేదు. స్థానిక పరిస్థితులు, నేల స్వభావం, నీటి లభ్యతను బట్టి ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక వ్యవసాయ పద్ధతులుంటాయి. తద్వారా నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని వ్యవసాయ పద్ధతులు అవలంబించాల్సి ఉంటుంది.

సంప్రదాయ పద్ధతుల్లో జల వనరులను కాపాడుకోవడం అలాగే స్థానిక పరిస్థితులపై పట్టు కలిగిఉండటం ద్వారా సంప్రదాయ నీటి నిర్వహణ పద్ధతులపై అవగాహన ఏర్పడే అవకాశం ఉంది.

ముఖ్యంగా నీటి నిర్వహణ పద్ధతుల్లో భాగంగా అస్సాంలో డోంగ్స్ అనే సంప్రదాయ పద్ధతులను అనుసరిస్తే, మేఘాలయాలో వెదురు బొంగులతో బిందు సేద్యం లాంటి పద్ధతులు అమల్లో ఉన్నాయి. ఇక అరుణాచల్‌లోని జిరొ లోయలో వరి మళ్లలో చేపల పెంపకం చేపడుతుంటారు. అలాగే నాగాలాండ్‌లోని చక్సేసంగ్ నాగా తెగ వారు జాబో అనే నీటి నిర్వహణ పద్ధతిని పాటిస్తారు. ఈ పద్ధతిలో భాగంగా నాగాలాండ్‌లోని ఫెక్ అనే జిల్లాలో ఇంటి పైకప్పుపై వర్షపునీటిని నిల్వ చేసుకుంటారు. ఇక సిక్కింలో ప్రకృతి సేద్య పద్ధతులను చేపడుతారు. ఇలా ఒక్కో

**నిరేంద్ర దేవ్,** ప్రత్యేక ప్రతినిధి, "ద స్టేట్స్‌మన్" దినపత్రిక, న్యూ ఢిల్లీ
E-mail : nirendev1@gmail.com

రాష్ట్రంలో ఒక్కో రకంగా నీటి నిర్వహణా పద్ధతులు, వ్యవసాయ పద్ధతులు అమలులో ఉన్నాయి.

అలాగే ఈశాన్య రాష్ట్రాల్లో ప్రధానంగా ఝూం వ్యవసాయ పద్ధతిని అవలంబిస్తారు. ఈ పద్ధతిలో మొదటి అడవులను తొలగించి వాటిని తగులబెడతారు. అప్పుడు బూడిద నేలకు చేరి నేలలో పొటాషియం, ఇతర ఖనిజ లవణాలు అందుతాయి. ఇలా నేలను వ్యవసాయయోగ్యంగా మార్చుకోవడం ఈశాన్య రాష్ట్రాల్లో గమనిస్తాము.

కాగా ఝూం వ్యవసాయ పద్ధతిలో మొత్తం 85 శాతం మేర ఉత్పత్తి ఈశాన్య రాష్ట్రాల్లో జరుగుతోంది. మరోవైపు డిమాండ్‌ను బట్టి సాగు విస్తీర్ణం కూడా ఈ పద్ధతిలో పెరుగుతోంది. తద్వారా పర్యావరణం మీద సైతం ప్రతికూల ప్రభావం కనిపిస్తోంది. ఈశాన్య రాష్ట్రాల భౌగోళిక విశిష్టత గురించి– ఇది రుతుపవనాల ప్రభావం ఎక్కువగా ఉండే ఉప ఉష్ణమండల వాతావరణానికి చెందిన ప్రాంతము. వ్యవసాయం ద్వారా నీటి నిర్వహణతో పాటు మట్టికోతను సైతం అరికట్టవచ్చు. తద్వారా నేల సారాన్ని కాపాడవచ్చు.

నీటి నిర్వహణ పద్ధతిలో ఉన్న ఈ మెళకువల ద్వారా ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయం పాత్ర నానాటికి వృద్ధి చెందుతోంది. ఇదిలా ఉంటే సాంప్రదాయ వ్యవసాయ పద్ధతులు, నీటి వనరులు, సారవంతమైన నేలలు ఇలా ఎన్ని ఉన్నప్పటికీ ఈశాన్య రాష్ట్రాల్లో వ్యవసాయం కూనరిల్లుతోంది. అందుకు ప్రధాన కారణం పెట్టుబడి, మెళకువలు లేకపోవడంగా చెప్పవచ్చు. ముఖ్యంగా ఈశాన్య రాష్ట్రాల్లో వ్యవసాయ మార్కెటింగ్ విధానం చాలా బలహీనంగా ఉంది. అంతే కాదు వ్యవసాయాధారిత పరిశ్రమలు సైతం ఈశాన్య రాష్ట్రాల్లో పెద్దగా లేకపోవడం ఒక రకంగా వెలితి అనే చెప్పవచ్చు. ప్రధానంగా వ్యవసాయ అనుబంధ పరిశ్రమల ఏర్పాటుతో పాటు శీతల గిడ్డంగులు, మార్కెట్ యార్డుల ఏర్పాటు ద్వారా ఈశాన్య రాష్ట్రాల్లో వ్యవసాయాన్ని వృద్ధి చేయవచ్చు.

ప్రధాని మోదీ నేతృత్వంలో ఏర్పడిన నూతన ప్రభుత్వం ఈశాన్య రాష్ట్రాల్లో వ్యవసాయాభివృద్ధిపై దృష్టి సారించింది. రెండో హరిత విప్లవంలో భాగంగా నూతన వ్యవసాయ విధానాలను ఈశాన్యరాష్ట్రాల్లో అవలంబించే దిశగానూ, అలాగే తోడ్పాటు అందించే దిశగానూ కేంద్రం అడుగులు వేస్తోంది.

ఇదిలా ఉంటే ఇప్పటికీ ఈశాన్య రాష్ట్రాల్లో వ్యవసాయం పలు ఆటంకాలను ఎదుర్కొంటోంది. అందుకు ప్రభుత్వం అనేక చర్యలను తీసుకుంటోంది. అయితే వ్యవసాయ రంగం ఈశాన్య రాష్ట్రాల్లో ఆర్థికంగా ఒక ప్రబల శక్తిగా ఎదగాల్సిన అవసరం ఉంది. తద్వార ఆర్థిక స్థిరీకరణ జరగడంతో పాటు వ్యవసాయాధారిత పరిశ్రమల స్థాపనతో పాటు ఉపాధి అవకాశాలు మెండుగా ఏర్పడే అవకాశం ఉంది.

ఇక వ్యవసాయం ఈశాన్య రాష్ట్రాల్లో గణనీయమైన పాత్ర పోషిస్తోంది. సుమారు 75 శాతం మంది ప్రజలు వ్యవసాయం ద్వారా మాత్రమే తమ జీవనాధారాన్ని కలిగిఉన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు వ్యవసాయమే జీవనాధారంగా జీవిస్తున్నారు. అయినప్పటికీ, సాగుభూమి విస్తీర్ణంలో మాత్రం జాతీయ సగటు కన్నా ఈశాన్య రాష్ట్రాలు 20 శాతం తక్కువగా ఉన్నాయి.

ఈశాన్య రాష్టాలు వ్యవసాయ పరంగా దేశంలోని ఇతర ప్రాంతాల కన్నా వెనుకబడి ఉన్నమాట వాస్తవం. కనుకనే ఆహార ఉత్పత్తుల కోసం ఈశాన్య రాష్ట్రాలు ఇతర రాష్ట్రాలపై ఆధారపడుతున్నాయి. కేవలం ఆహార ధాన్యాల విషయంలోనే కాదు ఇతర వ్యవసాయ ఉత్పత్తులు, పండ్లను సైతం ఈశాన్య రాష్ట్రాలు ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాయి. ఇలా ఈశాన్య రాష్ట్రాలు వ్యవసాయమే ప్రధానంగా జీవనోపాధి గల ప్రజలు పెద్ద ఎత్తున్న ఉన్నప్పటికీ డిమాండ్‌నకు తగిన ఆహార ఉత్పత్తులను సాగించలేక పోతున్నాయి.

కాగా ఈశాన్య రాష్ట్రాలు ఆహార ధాన్యాల ఉత్పత్తిలో వెనుకబడి ఉన్నప్పటికీ ఇతర వ్యవసాయ ఉత్పత్తుల్లో మాత్రం ముందంజలో ఉన్నాయి. ముఖ్యంగా హార్టీకల్చర్ రంగంలోనూ, అలాగే తేయాకు ఉత్పత్తిలో అస్సాం వంటి రాష్ట్రాలు ముందున్నాయి. అస్సాం రాష్ట్రం దేశంలోనే తేయాకు ఉత్పత్తి చేసే రాష్ట్రాల్లో ముందంజలో ఉంది. అలాగే వరి, బంగాళా దుంప, జనపనార, అరటి, బొప్పాయి, నారింజ, ఆకు కూరలు లాంటి ఉత్పత్తుల్లో కూడా అస్సాం రాష్ట్రం గణనీయమైన ఉత్పాదకతను సాధించింది. సుగంధ ద్రవ్యాల ఉత్పత్తిలో కూడ ఈశాన్య రాష్ట్రాలు ఇతర రాష్ట్రాల కన్నా ముందున్నాయి.

ఈశాన్య రాష్ట్రాల్లో ఒకటైన మేఘాలయ జీడి మామిడి ఉత్పత్తిలో ముందంజలో ఉన్నది. ఇక త్రిపురలో అల్లం, మిర్చి లాంటి పంటల సాగు చేస్తున్నారు. మిజోరాం, మణిపూర్, నాగాలాండ్‌లలో వెదురు ఉత్పత్తి అధికంగా అవుతుంది. అలాగే అనాస సాగులో కూడా ఈశాన్య రాష్ట్రాలు గణనీయమైన ఉత్పాదకతను సాధిస్తున్నాయి.

ప్రతికూలతలు ఉన్నప్పటికీ హార్టీ కల్చర్ మరియు ఆహార ఉత్పత్తులను వృద్ధి చేయడం ద్వారా ఈశాన్య రాష్ట్రాల్లో వ్యవసాయ విప్లవం సృష్టించవచ్చు.

**ప్రజల సామర్థ్యత..**

ఈశాన్య రాష్టాల్లో మెజారిటీ ప్రజలు గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చినవారే

ఎక్కువగా ఉన్నారు. వీరంతా వ్యవసాయంతోనే ఎక్కువగా మమేకమై ఉన్నారు. అలాగే స్థానికులు చాలా వరకు గ్రామాలతో అనుబంధం కలిగి ఉంటారు. సాధారణంగా ఉన్నత ఉద్యోగాలు చేసేవారు సైతం వ్యవసాయం చేసేందుకు ఏమాత్రం సందేహించకపోవడం మనం ఈశాన్య రాష్ట్రాల ప్రాంత ప్రజల్లో గమనిస్తాము. ఈ తరహా మానవ వనరులు కలిగి ఉండటం ద్వారా నూతన వ్యవసాయ పద్ధతులను ప్రవేశపెట్టడం సులువు అవుతుంది. అలాగే ఉత్పాదకతను పెంచేందుకు కూడా దోహదపడుతుంది. దీంతో పాటు వ్యవసాయాధారిత పరిశ్రమల వృద్ధితో నూతన ఉపాధి అవకాశాలు కూడా అందుతాయి.

ఇక నీటినిర్వహణా పద్ధతిలో ప్రధానంగా చెప్పుకోదగ్గ పద్ధతి అరుణాచల్ ప్రదేశ్‌లో కొనసాగుతోంది. అదే వరి మడుల్లో చేపల పెంపకం. ఇలా వరి మడుల్లో చేపలపెంపకం ద్వారా చేపల ఉత్పత్తితో పాటు నీటి నిర్వహణ కూడా జరుగుతుంది. అలాగే చేపల విసర్జితాలతో చేనుకు బలం చేకూరుతుంది. ఇక సేంద్రీయ పద్ధతులలో వ్యవసాయాన్ని చేసి సిక్కిం, దేశంలో తొలి సేంద్రియ వ్యవసాయం రాష్ట్రంగా ఎదిగింది. ఈ ఘనత సాధించినందుకుగాను 2016 జనవరి 18న ప్రధాని మోదీ సిక్కింను పూర్తి స్థాయి తొలి సేంద్రీయ వ్యవసాయ రాష్ట్రంగా ప్రకటించారు. ఈ ఘనత వెనుక సిక్కిం ప్రభుత్వం తీసుకున్న చొరవ గురించి పేర్కొనాల్సి ఉంది. ముఖ్యంగా గత దశాబ్ద కాలంగా సిక్కింలో 75 వేల హెక్టార్ల విస్తీర్ణంలోని వ్యవసాయ క్షేత్రంలో సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయం చేయడం మొదలు పెట్టారు. అంతేకాదు ఇలా సేంద్రీయ పద్ధతుల్లో వ్యవసాయం చేయడం ద్వారా సిక్కిం ఇతర ప్రాంతాలను చాలా బాగా ఆకర్షించింది. ముఖ్యంగా పర్యాటక రంగం సైతం వృద్ధి చెందింది. సేంద్రీయ పద్ధతుల్లో పెరిగిన ఆహార ఉత్పత్తులకు ఉన్న డిమాండ్- దృష్ట్యా ఎగుమతుల ద్వారా ఆదాయం కూడా పెరిగింది.

ఇక నాగాలాండ్‌లోని ఫెక్ జిల్లాలో జాబో పద్ధతుల్లో వ్యవసాయం చేస్తున్నారు. దీన్ని రక్షిత అడవుల్లోని కొండ ప్రాంతాల నీటి వనరులను వినియోగించుకొని చేసే పోడు తరహా వ్యవసాయ పద్ధతి. ఇందులో నీటి నిర్వహణ చాలా సమర్థవంతంగా చేస్తారు. పొలాలకు నీటిని తరలించే కాలువలను పశువుల కొట్టం ద్వారా ప్రవహించేలా చేస్తారు. తద్వారా పశువులకు నీరు అందడంతో పాటు నీటి వినియోగం కూడా జరుగుతుంది. అలాగే ఆయా కాలువల్లో పశు విసర్జితాలు కూడా పడడంతో ఆ నీరు చేనుకు సేంద్రియ ఎరువులను అందజేస్తుంది.

ఇలాంటి మేలైన పద్ధతుల ద్వారా వ్యవసాయం బహుళ ప్రయోజనాలు అందిస్తోంది.

**వ్యవసాయం ద్వారా జరిగే మరికొన్ని ప్రయోజనాలు**

1. నిరుద్యోగాన్ని పారదోలడం, అలాగే ఉపాధి కల్పన
2. అలాగే వ్యవసాయ కుటుంబాలకు సురక్షిత నీరు, గ్రామీణ రహదారులు, విద్య, వైద్యం, గృహనిర్మాణం, అలాగే ఎరువులను అందుబాటులో ఉంచితే జీవన ప్రమాణాలు పెరగడంతో పాటు వ్యవసాయ ఉత్పాదకతలో అభివృద్ధి సాధ్యం అవుతుంది.
3. అలాగే సంపద సృష్టిలోనూ వ్యవసాయం ప్రముఖ పాత్ర వహిస్తుంది.
4. అభివృద్ధితో పాటు నిరంతర పురోగమనం సైతం వ్యవసాయం ద్వారా సాధ్యం అవుతుంది.

అస్సామీ సాహిత్యంలో ప్రశాంతమైన జీవితానికి అర్థాన్ని ఇలా చెబుతారు. ఏ ప్రాంత ప్రజలైతే వారి మాతృ భూమిలో సకల సౌకర్యాలు పొందుతున్నారో అదే ప్రశాంతమైన జీవితానికి అర్థమని తెలిపారు.

ఈశాన్య ప్రాంత ప్రజలు వ్యవసాయం ద్వాం వలసలకు వెళ్లకుండా మాతృ భూమిలోనే నూతన వ్యవసాయ విధానాలతో సుఖమైన జీవితాన్ని పొందవచ్చు. మాతృ భూమి అమ్మ ఒడితో సమానమని పెద్దలంటారు. స్థిరమైన అభివృద్ధితోనే మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించబడతాయి.

■

ISSN : 0971-8729

**యోజన**

**యోజన** మే, 2016 సంచిక **"దివ్యాంగులు"** ప్రధానాంశంగా వెలువడుతుంది.

**యోజన** (తెలుగు) మాసపత్రిక చందా వివరాలు, చిరునామా మార్పు, పత్రిక అందకపోవడం వంటి విషయాలపై ఫోన్ నెం. 040-27546313కు నేరుగా సంప్రదించవచ్చు. **యోజన** పత్రిక చందాకు సంబంధించిన వివరాలకోసం yojana_telugu@yahoo.co.in లేదా yojana.telugu@nic.in మెయిళ్ళ ద్వారా కూడా సంప్రదించవచ్చు.

*- సీనియర్ ఎడిటర్*

సరసమైన పరిష్కారం

# ఈశాన్య భారత దేశంలో జలమార్గాలు



**దేశవ్యాప్తంగా సుమారు 14 వేల 5 వందల కిలోమీటర్ల మేర జలమార్గాలు అందుబాటులో వుండగా, గత ఏడాది నాటికి కేవలం 4 వేల 5 వందల కిలోమీటర్లను జాతీయ జలమార్గాలుగా ప్రకటించారు. ఈశాన్య రాష్ట్రాల్లో కొత్తగా ప్రకటించిన జాతీయ జలమార్గాలు తప్పకుండా సరైన ప్రత్యామ్నాయంగా రూపొందడంతో పాటు ఈ ప్రాంతం లో రవాణా సౌకర్యాల పెంపుదలకు అదనపుతోడ్పాటు అందిస్తాయి.**

భారత దేశంలో జలమార్గాల వినియోగం కొత్త విషయమేమీ కాదు. మొఘల్ చక్రవర్తి అక్బర్ కాలం నుంచి గంగా, యమున నదుల జలమార్గాలను ప్రజల, సరుకుల రవాణాకు ఉపయోగించారు. అనంతరం బ్రిటిష్ వారి పాలనలో దేశంలో అనేక జలమార్గాలను అభివృద్ధి చేశారు. జలమార్గాలుగా అనేక నదులు కొనసాగుతున్నాయి. దేశ స్వాతంత్ర్యానంతరం, రైలు మార్గాలు, రహదారుల అభివృద్ధిపై ఎక్కువగా దృష్టి పెట్టారు. దీనితో జలమార్గాల ద్వారా రవాణా తగ్గింది. దేశవ్యాప్తంగా సుమారు 14 వేల 5 వందల కిలోమీటర్ల మేర జలమార్గాలు అందుబాటులో వుండగా, గత ఏడాది నాటికి కేవలం 4 వేల 5 వందల కిలోమీటర్లను జాతీయ జలమార్గాలుగా ప్రకటించారు. కాగా,అంతర్గత జలరవాణా అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తోంది. 106 అదనపు జల మార్గాలను జాతీయ జలమార్గాలుగా ప్రకటించారు. దీంతో ఇప్పటివరకు 5 మాత్రమే వున్న జాతీయ జలమార్గాల సంఖ్య 111 కు పెరిగింది. వీటిలో 19 నదులు ఈశాన్య భారత దేశంలోనే వున్నాయి.

**బాక్స్ 1 చూడండి.**

| రాష్ట్రం | నదులు/ కాలువల సంఖ్య | నది/కాలువ పేరు |
|---|---|---|
| అరుణాచల్ ప్రదేశ్ | 01 | లోహిత్ |
| అస్సాం | 14 | ఆయి,బరాక్,బెకి,ధన్సిరి/ఛతే,దేహింగ్,దిఖు, డోయన్స్,గంగాధర్,జింజీరామ్,కోపిలి, లోహిత్,పితుమరి,సుబన్సిరి,త్లవంగ్(ధలేశ్వరి) |
| మేఘాలయ | 05 | గనోల్, జింజీరామ్, కిన్షిసింసంగ్, ఉమ్నోగోట్(దవ్కి) |
| మోజోరామ్ | 01 | త్లవంగ్(ధలేశ్వరి) |
| నాగాల్యాండ్ | 01 | తిజు --జుంకి |

**నోట్:** లోహిత్, జింజీరామ్, 19 త్లవంగ్ నదులు ఈశాన్య రాష్ట్రాల్లో ఒకటి కంటే ఎక్కువ రాష్ట్రాల్లోవున్నాయి. అందువల్ల 19 నదులుగా పేర్కొనడమైనది.


**నోట్:** గంగాధర్ నది అస్సోంలో, పశ్చిమ బెంగాల్ కూడా ప్రవహిస్తోంది.

**డా॥ విశ్వపతి త్రివేది,** ఛైర్మన్, నేషనల్ షిప్పింగ్ బోర్డ్, నౌకాయాన మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం
E-mail: drvtrivedi@gmail.com


ఈశాన్య రాష్ట్రాల్లో కొత్తగా ప్రకటించిన జాతీయ జలమార్గాలు తప్పకుండా సరైన ప్రత్యామ్నాయంగా రూపొందడంతో పాటు ఈ ప్రాంతం లో రవాణా సౌకర్యాల పెంపుదలకు అదనపుతోడ్పాటు అందిస్తాయి. ఈశాన్య రాష్ట్రాల్లో జలమార్గాల ద్వారా రవాణాను ఇంకా పూర్తి స్థాయిలో వినియోగించు కోవలసిన ఆవశ్యకత వుంది. జాతీయ జలమార్గం 2 (NW-2), అంటే బ్రహ్మపుత్ర నది – 891 కిలోమీటర్ల పొడవైన బ్రహ్మపుత్ర నది పరీవాహక భాగం, బంగ్లాదేశ్ సరిహద్దు లోని ధుబ్రి నుంచి మొదలుకొని సదియా వరకు వున్న ప్రాంతానికి ఎంతో ప్రాముఖ్యత వుంది. అయితే, ఈ ప్రాంతంలో ప్రజలు, సరకుల సురక్షిత రవాణా కోసం బ్రహ్మపుత్ర నదిపై జల మార్గాల అభివృద్ధి జరగ లేదు. పస్సిఘాట్ వద్ద బ్రహ్మపుత్ర ఎగువ ప్రాంతంలో జలమార్గంలో ప్రతి నిత్యం రవాణా జరుగుతూ వుంటుంది. అయితే సామర్థ్యం, పరిమాణంలో పడవలు, బార్జీలు పరిమితంగానే వున్నాయి. భారత సైన్యం కూడా తమ వాహనాలను నదికి ఒక వైపునుంచి మరో వైపుకు తరలించడానికి ఈ జలమార్గాన్ని వినియోగిస్తోంది. ఈ శతాబ్దం తొలి దశలో ధుబ్రి వద్ద జలమార్గం-2 ప్రారంభమయ్యే ప్రదేశంలో కొంత ప్రాముఖ్యత కలిగిన ఓడ రేవుండేది. అయితే దాన్ని సరిగా నిర్వహించలేదు. ఈ ప్రాంతంలో స్థానిక అవసరాలకు, బంగ్లాదేశ్‌కు చేపలు, కూరగాయల రవాణా జరుగుతుండేది.

బంగ్లాదేశ్ గుండా భారత్-బాంగ్లాదేశ్ ప్రోటోకాల్ మార్గం లో జాతీయ జలమార్గం 2 (NW-2) ను ప్రణాళికావేత్తలు జాతీయ జలమార్గం 1 (NW-1) (హూగ్లి/గంగా నది)తో అనుసంధానం చేశారు. అయితే సరిహద్దు వివాదాలు,బంగ్లాదేశ్ గుండా పడవల్లో ప్రయాణం, ప్రోటోకాల్ మార్గం పొడవునా (బంగ్లాదేశ్‌లో పద్మ నదిలో) నీరు అవసరమైనంత లోతు లేక పోవడం వంటి అంశాలతో ఇది సరైన ప్రత్యామ్నాయం గా మారలేక పోయింది. నిజానికి, ఈశాన్య రాష్ట్రాల్లో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా (చౌక ధరల దుకాణాలు/ రేషన్ షాపులకు) గోధుమలు, బియ్యం రవాణాను ప్రోటోకాల్ మార్గం ద్వారా చేపడితే రవాణా కోసం ఖర్చయ్యే లక్షలాది రూపాయలను ఆదా చేయవచ్చు. దీనితో పాటు రహదారుల పై వాహనాల రద్దీని తగ్గించవచ్చు. ఈశాన్య రాష్ట్రాల్లో ఆహార ధాన్యాల రవాణాకు భారత ఆహార సంస్థ (FCI) ఇందుకవసరమైన చొరవ చూప లేదు. ఒక వేళ చొరవ చూపినా ఇటువంటి చౌక తరహా రవాణా విధానాన్ని అనుసరించడం లో వారు సఫలీకృతులయ్యే వారు కాదు (బాక్స్ 2 చూడండి).

**బాక్స్ 2**
**భారత్-బాంగ్లాదేశ్ ప్రోటోకాల్ మార్గం :**




## బాక్స్ 3




జాతీయ జలమార్గం 2 పై మౌలిక వసతుల ఏర్పాటుకు భారత అంతర్దేశీయ జలమార్గాల ప్రాధికార సంస్థ (Inland waterways Authority of India) (IWAI) ప్రణాళికలు రూపొందిస్తోంది. నిర్మాణాలు చేపడుతోంది. అయితే ఇందుకు చాలా సమయం పట్ట వచ్చు. పాండు వద్ద నదీ తీరం లో రైల్వేల తో కలిసి నిర్మిస్తున్న జెట్టీ పూర్తయ్యింది. కానీ, ఇప్పటి వరకు తగినంత సరకు రవాణా జరగడం లేదు. ధుబ్రి వద్ద IWAI నిర్మిస్తున్న రోరో జెట్టీ (రోల్ ఆన్ రోల్ ఆఫ్ జెట్టీ) దాదాపు పూర్తయ్యింది. అయితే నది అవతలి ఒడ్డున హత్ సింగ్ మరి వద్ద భూమి కోతకు గురి కావడం తో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. ఇక, ప్రోటోకాల్ మార్గం లో మిగిలిన ప్రాంతమైన కరీంగంజ్, ఆషుగంజ్ వైపు జలమార్గం అంశం ఏదో ఒక వివాదం లో కూరుకు పోయి వుంది. ఈశాన్య రాష్ట్రాల్లో 19 అదనపు జలమార్గాల అభివృద్ధికి కేంద్ర నౌకాయాన మంత్రిత్వ శాఖ చేసిన ప్రకటనతో ఈ రాష్ట్రాల్లో నదులను సమగ్రంగా వినియోగించుకొని ప్రజలు, సరకుల రవాణాను సమర్థవంతంగా నిర్వహించడం లో కేంద్రం ప్రణాళికలు రూపొందించడానికి అవకాశం కలుగుతుంది.

■

# ఈశాన్య భారతానికి విద్యుత్ వెలుగులు : సవాళ్లు, అవకాశాలు




**ఈశాన్య భారతంలో ఒక్క సిక్కిం మినహా మిగిలిన రాష్ట్రాలన్నీ జాతీయ సగటుకన్నా అత్యధికంగా విద్యుత్ కొరతను ఎదుర్కొంటున్నాయి. అయితే ఈ ప్రాంతంలో జల విద్యుత్‌కి పుష్కలంగా వనరులు, పునర్ వినియోగ విద్యుత్ అవకాశాలు, అధిక స్థాయిలో అక్షరాస్యత, సమృద్ధిగా నిధుల లభ్యతకి ప్రత్యేక హోదా ఉన్నప్పటికీ విచిత్రంగా వెనుకబాటుతనం వెంటాడుతోంది.**

ప్రపంచంలో ఏ ప్రాంత సామాజిక, ఆర్థిక అభివృద్ధికైనా శరవేగంగా వృద్ధి చెందే విద్యుత్ రంగమే కీలకపాత్ర పోషిస్తుంది. దేశంలోని ఈశాన్య రాష్ట్రాలకు ఈ వాస్తవం సరిగ్గా సరిపోతుంది. తలసరి ఆదాయం, విద్యుత్ వినియోగం, పారిశ్రామీకరణ వంటి అంశాల్లో దేశంలోని ఇతర ప్రాంతాల కన్నా ఈశాన్య రాష్ట్రాలు బాగా వెనుకబడి ఉన్నాయి. ఈశాన్య భారతంలో ఒక్క సిక్కిం మినహా మిగిలిన రాష్ట్రాలన్నీ జాతీయ సగటుకన్నా అత్యధికంగా విద్యుత్ కొరతను ఎదుర్కొంటున్నాయి. అయితే ఈ ప్రాంతంలో జల విద్యుత్‌కి పుష్కలంగా వనరులు, పునర్ వినియోగ విద్యుత్ అవకాశాలు, అధిక స్థాయిలో అక్షరాస్యత, సమృద్ధిగా నిధుల లభ్యతకి ప్రత్యేక హోదా ఉన్నప్పటికీ విచిత్రంగా వెనుకబాటుతనం వెంటాడుతోంది. ఈ నేపథ్యంలో ఈశాన్య ప్రాంత సుస్థిర అభివృద్ధికి విద్యుత్ రంగం ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ప్రాంత రాష్ట్రాలే కాకుండా యావత్ దేశం కూడా ఈ దిశగా కృషి చేయాల్సిన అవసరం ఉంది.

సుస్థిరమైన విద్యుత్ ఉత్పాదనను సాధించడం అంత సులభసాధ్యమైన విషయం కాదు. దీని కోసం అవకాశాలు, సవాళ్ల ఆచరణాత్మక మదింపు ఆధారంగా బహుళ రూపాల్లో సుదీర్ఘమైన వ్యూహాలను అనుసరించాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు వినియోగించని వనరుల నుంచి విద్యుత్ ఉత్పాదనను వేగవంతం చేయడానికి కొన్ని కీలక అంశాలపై దృష్టి పెట్టాలి. ఈశాన్య ప్రాంతాల్లో విద్యుత్ వినియోగానికి ఉన్న డిమాండ్‌ను, ఎగుమతి సామర్థ్యాన్ని అంచనా వేసుకుంటూ విద్యుత్ సరఫరా, పంపిణీ వ్యవస్థను, నియంత్రణ సౌకర్యాలను విస్తరిస్తూ, సామర్థ్య వృద్ధితో పాటు విధానపరమైన, క్రమబద్ధీకరణ చట్రాన్ని, పరిపాలనా నిర్మాణాన్ని, మానవ వనరుల అభివృద్ధిని మెరుగుపర్చుకోవాల్సి ఉంటుంది.

### జలవిద్యుత్‌ను వేగవంతం చేయడం

ఈశాన్య ప్రాంతంలో 90 శాతం అంటే దాదాపు 56000 మెగావాట్ల జల విద్యుత్ ఉత్పత్తి సాధించడం సాధ్యమవు తుందని అంచనా వేస్తున్నారు. ఈ విద్యుత్ సుస్థిర అభివృద్ధికి కేవలం ఈ ప్రాంత అవసరాలను తీర్చడమే కాకుండా మిగిలిన దేశానికి పర్యావరణ అనుకూలమైన, అనుసంధానానికి సాధ్యమయ్యే విద్యుత్‌ను అందించడం సాధ్యమవుతుంది. జల విద్యుత్ కోసం ఏర్పాటు చేసే ప్రాజెక్టులు ఒకవైపు

**కె.రామనాథన్,** ఇంధన-వనరుల సంస్థ (TERI), న్యూ ఢిల్లీ
E-mail : krnathan@teri.res.in

వరదలను అరికట్టడమే కాకుండా మరోవైపు సాగునీటి అవసరాలను కూడా తీర్చడం సాధ్యమవుతుంది.

అయితే జల విద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణం ఎప్పుడూ అత్యంత వ్యయంతో కూడుకొని ఉంటూ, నిర్మాణానికి సుదీర్ఘకాల వ్యవధి తీసుకుంటుంది. దీంతో పాటు ఈ జల విద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణంలో ఆయా ప్రాంతాల జల వనరుల రూపురేఖలు మారిపోవడం, జనావాసాలపై ప్రభావాన్ని చూపడం, ప్రజా ఆరోగ్యం, భూకంప ప్రమాదాలు, పునరావాసం తదితర అంశాలు ఇమిడి ఉంటాయి. వీటితో పాటు శాంతిభద్రతల సమస్య, నిర్వాసితుల సమస్య, ప్రాజెక్టుల కారణంగా భూమి కోల్పోయేవారి భూ వివరాలు అందుబాటులో లేకపోవడంతో బాధితులను గుర్తించడం కూడా పెద్ద సమస్యగా మారుతుంది. వివిధ ప్రభుత్వ శాఖల నుంచి అనుమతులు పొందడం కూడా కష్టంగా ఉంటూ, ప్రాజెక్టు ప్రాంతాలకు సరమైన రోడ్డు రవాణా సదుపాయం లేకపోవడంతో విపరీతమైన జాప్యం జరగడంతో వ్యయం ఇబ్బడిముబ్బడిగా పెరిగే ప్రమాదమూ పొంచి ఉంది. ఈ మొత్తం ప్రక్రియలో మదుపర్ల ప్రయోజాలూ కూడా దెబ్బ తినే పరిస్థితి తలెత్తే అవకాశం ఉంది. టీఈఆర్ఐ ఇటీవల నిర్వహించిన ఓ అధ్యయనంలో మరికొన్ని సమస్యలు వెలుగులోకి వచ్చాయి. ప్రాజెక్టుల నిర్మాణంతో స్థానిక ప్రజలు వారి ఆచార వ్యవహారాలను కోల్పోవడంతో పాటు వారి సామాజిక లావాదేవీలన్నీ ధన రూపేణా జరుపుకోవాల్సి రావడం వంటి సున్నితమైన అంశాలు ప్రాజెక్టు నిర్వాహకులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఇకపోతే స్థానికంగా లభ్యమయ్యే జన వనరుల పరిమాణం ఎప్పుడూ వాతావరణ మార్పుల కారణంగా ప్రభావితం కానుండడంతో జల విద్యుత్ ప్రాజెక్టుల లాభదాయత ఎప్పుడూ ప్రశ్నార్థకంగా మారుతోంది.

పైన పేర్కొన సవాళ్లు సంక్లిష్టమైనవి మరియు సామాజిక, రాజకీయ సున్నితాంశాలతో కూడుకున్నవి. అందుకని ఈ నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూహంలో ఎ) జలాశయాల ఆధారంగా ప్రణాళికలతో పాటు ఆచరణాత్మక సమన్వయం, బి) సమగ్రమైన వనరుల చిత్రపటం, సి) స్థానిక అవసరాలను, అంతర్జాతీయ జల విద్యుత్ సంస్థ నియమ నిబంధనలను దృష్టిలో పెట్టుకొని ప్రాజెక్టు అన్ని దశల్లో సరైన అంచనాలను రూపొందించడం, డి) పారదర్శకంగా, పర్యావరణ ప్రభావ అంచనాల అధ్యయనాన్ని నైపుణ్యంతో నిర్వహించడం, ఇ) ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన అన్ని అనుమతులను సరైన రీతిలో పొందే వ్యవస్థ ఏర్పాటు, ఎఫ్) ప్రజలు, పౌర సమాజంతో ప్రాజెక్టులకు సంబంధించి సరైన, చురుకైన సంబంధాలను నెలకొల్పడం ముఖ్యమైనవి. రాష్ట్రాలు, నిర్వాసిత సంబంధ సమస్యలకు రాజకీయ ఆమోదిత పరిష్కారాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి.

## ఇతర పునర్ వినియోగ విద్యుత్ వనరుల అభివృద్ధి

చిన్న తరహా జల విద్యుత్ ప్రాజెక్టులు, బయోమాస్, సౌర విద్యుత్ ఉత్పాదన వంటి పునర్ వినియోగ విద్యుత్ వనరులను కూడా వినియోగించుకుంటూ మారుమూల ప్రాంతాల్లో గృహ అవసరాలకు అందుబాటులోకి తీసుకొని రావాలి. ఈశాన్య ప్రాంతంలో దాదాపు 1000కి పైగా చిన్న తరహా విద్యుత్ ప్రాజెక్టులు ఏర్పాటు 2200 మెగా వాట్ల ఉత్పాదనను సాధించే అవకాశం ఉంది. ఇక ఇదే ప్రాంతంలో బయోమాస్ ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్ వనరులను ఆచరణాత్మకంగా అభివృద్ధి చేస్తే అవి ఈ ప్రాంత గ్రామీణ విద్యుత్ అవసరాలను తీరుస్తాయి. సౌర విద్యుత్ వాడకానికి కూడా ఇక్కడ భారీగానే అవకాశాలున్నాయి. ఈ దిశగా ఇప్పటికే కేంద్ర పునర్ వినియోగ విద్యుత్ మంత్రిత్వశాఖ సౌర విద్యుత్ నగరాల పథకం కింద ఎనిమిది నగరాలకు మాస్టర్ ప్లాన్ కూడా సిద్ధం చేసింది. అందులో అగర్తలా, ఐజ్వాల్ నగరాలను పైలెట్ ప్రాజెక్టు కింద సౌర నగరాలుగా అభివృద్ధి చేస్తున్నారు.

అయితే ఈ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయడంలో ప్రధానమైన అడ్డంకుల్లో అవి మారుమూల ప్రాంతాల్లో ఉండడం, పునరావాసాలు, మదుపరులకి తగినంత ఆసక్తి లేకపోవడం, ఆచరణ యోగ్యమైన వాణిజ్య ప్రణాళికలు లేకపోవడం ముఖ్యమైనవి. అందుచేత విద్యుత్ ఉత్పాదనకు అందుబాటులో ఉన్న వనరులకు సంబంధించి సమగ్రమైన అంచన, స్థానిక ప్రజల విద్యుత్ అవసరాలపై ఆచరణాత్మక మదింపు కీలకంగా మారాయి. ఈ ప్రాజెక్టుల నిర్మాణం గ్రిడ్‌కి అనుసంధానంగానో లేకపోతే విడిగానో ఉండడం అన్నది ఆయా భౌగోళిక, జనాభా సాంద్రత, వివిధ విద్యుత్ అవసరాలపై ఆధారపడి ఉంటుంది. అంతేకాకుండా ఆయా ప్రాజెక్టులు గ్రిడ్‌తో అనుసంధానమయ్యే అవకాశం ఉండడం, ఉండకపోవడం కూడా ముఖ్యమైంది. సరమైన వాణిజ్యపరమైన ప్రణాళికలను రూపొందించడం కూడా ఈ సందర్భంగా అత్యంత కీలకమైనవిగా మారాయి.

## నియంత్రణతో విద్యుత్ సరఫరా అభివృద్ధి

మారుమూల ప్రాంతాల్లో నిర్మితమైన జల విద్యుత్ ప్రాజెక్టుల నుంచి విద్యుత్‌ను ఈశాన్య రాష్ట్రాల్లో విసిరివేయబడినట్లుగా ఉన్న కేంద్రాలకు, రాష్ట్రం వెలుపలకి సరఫరా చేయడానికి పంపిణీ వ్యవస్థను భారీయెత్తున విస్తరించడంతో పాటు పెద్దయెత్తున పెట్టుబడుల అవసరం కూడా ఉంది. అంత భారీ స్థాయిలో ఏర్పాటు చేసిన పంపిణీ వ్యవస్థ వినియోగం మాత్రం తొలి సంవత్సరంలో

పరిమితంగా ఉంటూ భారీ విద్యుత్ ఛార్జీలకు కారణమవుతుంది. విద్యుత్ ఉత్పాదనలో అనిశ్చితితో పాటు సంక్లిష్టమైన భౌగోళిక స్వరూపం, ఏడాదిలో పనికి అనుకూలమైన కాల పరిమితులనూ పరిగణనలోకి తీసుకోవాలి.

విద్యుత్ సరఫరా వ్యవస్థకి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలి. ఎ) దీర్ఘకాలికంగా విద్యుత్ ఉత్పాదనా ప్రణాళికలు, బి) డిమాండ్ పెరుగుదలలో ధోరణులు, మార్కెట్ మదింపులో మార్పులు, సి) జలాశయాల వారీగా అభివృద్ధి ప్రణాళికలు, డి) నేరుగా అడ్డుపడే అంశాలు, ఇ) నష్ట నివారణ, ఎఫ్) స్మార్ట్ గ్రిడ్ సాంకేతిక పరిజ్ఞానం వంటి సాంకేతిక పురోగతి, జి) వాస్తవ పరిస్థితి ఆధారిత విశ్లేషణ వంటివి విద్యుత్ సరఫరా వ్యవస్థను బలోపేతం చేస్తాయి. ఇక గ్రిడ్లను పునర్ వినియోగ విద్యుత్ ఉత్పాదనతో అనుసంధానం చేయడం కూడా కీలమైందిగా భావించాలి. ఈ నేపథ్యంలో అత్యాధునిక నియంత్రణ పరికరాలను ఏర్పాటు చేయడం కూడా ప్రాధాన్యత సంతరించుకుంటుంది.

## సామర్థ్యాన్ని మెరుగుపర్చుకోవడం

డిమాండ్-సరఫరా చక్రానికి తగిన రీతిలో సామర్థ్యాన్ని పెంపొందించుకోవడం ద్వారా ఏ విద్యుత్ వ్యవస్థ అయినా అవసరమైన అభివృద్ధిని సాధిస్తూ చక్కటి పనితీరును ప్రదర్శిస్తుంది. విద్యుత్ చట్టం, విద్యుత్ వినియోగ చట్టం, జాతీయ వృద్ధి చెందిన విద్యుత్ సామర్థ్య పథకం వంటివి చట్టపరంగా అవసరమైన వాటిని అందిస్తాయి. ఈశాన్య ప్రాంతంలో విద్యుత్ ఉత్పాదన సామర్థ్యాన్ని పెంపొందించడానికి తగినన్ని అవకాశాలున్నాయి. అందువలన ఈ ప్రాంతంలో విద్యుత్ రంగం ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. సుస్థిర వాణిజ్య విధానాల అభివృద్ధి, ప్రజల్లో అవగాహన పెంపొందించడం కూడా ఎంతో అవసరం.

## విధాన, నియంత్రణా పరమైన మద్ధతు

మద్ధతిచ్చే విధానాలు, నియమ నిబంధనలు, చక్కటి పరిపాలనా యంత్రాంగం అన్నవి సుస్థిర అభివృద్ధికి కీలకమైనవి. అందువలన బహుళ రూపాల్లో వ్యూహాలను అనుసరించాలి. అవసరమైన చోట ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యానికి విధాన రూపకల్పన ప్రాముఖ్యత ఇవ్వాలి. దీంతో ఆర్థిక వనరులను పోగుచేయడం, నిర్వహణా సామర్థ్యాన్ని మెరుగుపర్చడం సాధ్యమవుతుంది. నిర్ణీత కాల వ్యవధి ఉన్న విధానాలు, నియంత్రణ ప్రభావిత అంచనా అధ్యయనాలు కూడా అంతిమ లక్ష్యాలను అర్థం చేసుకోవడానికి అవసరమవుతూ అవసరమైనప్పుడు మార్పులుచేర్పులు చేయడానికి దోహదపడతాయి.

## మానవ వనరుల అభివృద్ధి

అవసరమైన నైపుణ్యం ఉన్న మానవ వనరుల లభ్యత కూడా ఇక్కడ కీలకమైంది. వివిధ ఇంజనీరింగ్ విభాగాల్లో సామర్థ్య నిర్మాణం, ప్రాజెక్టు నిర్వహణ, నియంత్రణ వ్యవస్థలకు ప్రాధాన్యత ఉంది.

## ముగింపు

ఈశాన్య ప్రాంతంలో విద్యుత్ రంగంలో సుస్థిర అభివృద్ధి ఎన్నో అవకాశాలతో పాటు మరెన్నో సవాళ్లను కల్పిస్తుంది. వీటిని అధిగమించడానికి బహుళ రూపాలతో కూడుకున్న వ్యూహ రచన అవసరమవుతుంది. జల విద్యుత్ అభివృద్ధిని వేగిరం చేయడం, పునర్ వినియోగ విద్యుత్ వనరులు, భారీ స్థాయిలో పంపిణీ వ్యవస్థను విస్తరించడం వంటి కీలకాంశాలను మార్కెట్ అవసరతలకు అనుగుణంగా మార్చుకుంటుండాలి. సామర్థ్యాలను మెరుగుపర్చుకోవడం, అనుకూల విధానాలను రూపొందించడం, క్రమబద్ధీకరణ చట్రాలను, సమర్థవంతమైన పరిపాలనా యంత్రాంగాలను ఏర్పాటు చేసుకుంటూ మానవ వనరుల అభివృద్ధిపై దృష్టి సారించాలి. ఈ ప్రాంత సుస్థిర అభివృద్ధిలో విద్యుత్ రంగం కీలక పాత్ర వహించడమే కాకుండా దేశ విద్యుత్ భద్రత మెరుగు పరడడానికి కూడా సహాయపడుతుంది. గ్రీన్ హౌస్ వాయువులను తగ్గించే లక్ష్యాలను చేరుకుంటూ విస్తృతస్థాయిలో సౌర, పవన విద్యుత్‌లను గ్రిడ్‌కు అనుసంధానం చేసుకోవాలి.

■

## గమనిక

**వ్యాసకర్తలకు సూచన** యోజన మాస పత్రికకు వ్యాసాలు రాసేవారు తమ వ్యాసాల సాఫ్ట్‌కాపీని పేజిమేకర్ 6.5 లేదా 7 "అను" ఫాంట్ 7లో టైప్‌చేసి పంపుతూ, వ్రాత ప్రతిని కూడా తప్పనిసరిగా హామీపత్రంతో జత చేసి పంపాలి. హామీపత్రంలో ఇది తమ స్వంత రచన అనీ, దేనికీ అనువాదము, అనుకరణ కాదని మాత్రమే కాక, ఈ వ్యాసాన్ని మరే పత్రికకు పంపలేదు / పుస్తకంగా ముద్రించలేదు అని కూడా పేర్కొనాలి. వ్యాసాలకు పేజిమేకర్ మరియు పిడిఎఫ్ ఫార్మెట్‌లూనూ అలాగే యూనికోడ్‌లో టైప్‌చేసి వర్డ్ ఫార్మెట్‌లోనూ అందజేయాలి. రచనలు 15వ తేదిలోపు హామీ పత్రంతో యోజన కార్యాలయానికి పంపాలి. ప్రచురణకు నోచుకోని వ్యాసాలు తిరిగి పంపబడవు. ఈ విషయంలో ఎలాంటి ఉత్తర ప్రత్యుత్తరాలకు తావులేదు. వ్యాసకర్తలు గమనించ గలరు.

**- సీనియర్ ఎడిటర్**

బహుముఖ మేధావి

ఏప్రిల్ 14, డా॥ అంబేద్కర్ 125వ జయంతి సందర్భంగా :

# మనకు తెలియని అంబేద్కర్ అర్థశాస్త్ర నిష్ణాతుడు



డా॥ బి.ఆర్. అంబేద్కర్

**అంబేద్కర్ ఆధునిక భారత దేశపు తొలితరం ఆర్థికవేత్త, నేడు ప్రపంచమంతా జపిస్తున్న స్వేచ్ఛావిపణిని ఆహ్వానించిన, ఆలోచనలను బలపరిచన వారిలో అంబేద్కర్ ఒకరు. రిజర్వు బ్యాంకులో నగదు నిల్వలకు బంగారాన్ని హామీగా ఉంచాలనీ, ద్రవ్య పరిమాణ సిద్ధాంతాన్ని మొదటిసారి ప్రతిపాదించింది ఈయనే!**

భారతదేశంలోని మేధావుల్లో ప్రపంచ స్థాయిలో పేరెన్నికగన్న వారిలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అగ్రగణ్యులు. అంబేద్కర్ రాజ్యాంగ నిర్మాతగానూ, సంఘ సంస్కర్తగానూ, న్యాయకోవిదుడిగానూ, అస్పృశ్యతా నివారణ ఉద్యమ వేత్తగానూ మనదేశంలో చిరపరిచితులు. కానీ, ఆయన ఒక ఆర్థిక వేత్త, సమకాలీన భారత ఆర్థిక వ్యవస్థకు సైతం అంబేద్కర్ మార్గదర్శకుడు అనే అంశం అరుదుగా వెలుగులోకి వస్తుంటుంది. అంబేద్కర్ 20వ శతాబ్దపు అగ్రగణ్యులైన భారతీయ ఆర్థికవేత్తల్లో ఒకరు అనే విషయం బహు కొద్ది మంది మాత్రమే ఉటంకిస్తుంటారు. భారత ఆర్థిక వ్యవస్థను పరిపుష్టం చేసేందుకు అంబేద్కర్ ఆలోచనలు ఆయన 125వ జయంతి ఉత్సవాల సందర్భంగా ప్రస్తావనకు తేవడం సముచితం.

అంబేద్కర్ ఆధునిక భారత దేశపు తొలితరం ఆర్థికవేత్త, నేడు ప్రపంచమంతా జపిస్తున్న స్వేచ్ఛావిపణిని ఆహ్వానించిన ఆలోచనలను బలపరిచన వారిలో అంబేద్కర్ ఒకరు. అంబేద్కర్ కొలంబియా యూనివర్సిటీలో అర్థశాస్త్రంలో తన డిగ్రీ పట్టాను పొందారు. అలాగే ప్రఖ్యాత లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లోనూ అంబేద్కర్ అర్థ శాస్త్రాన్ని అభ్యసించారు. న్యాయ కోవిదుడిగా అంబేద్కర్ పేరొందక మునుపే అంబేద్కర్ భారత్‌లోని నూతనతరం ఆర్థికవేత్తల్లో ఒకరిగా పేరొందారు.

ప్రొఫెసర్ అమర్త్య సేన్ అర్థ శాస్త్రానికి అంబేద్కర్ తండ్రిలాంటి వాడని పేర్కొన్నారు (2007). అంతేకాదు పీడిత ప్రజల తరపున ఆయన విజేత అని, మనం సాధించిన ప్రగతిలో అంబేద్కర్ కృషి గుర్తించదగినది అని, అలాగే అంబేద్కర్ తన స్వంత దేశంలో వివాదాస్పదుడు అయినప్పటికీ, వాస్తవిక కోణంలో మాత్రం ఆయన అలాంటి వాడు కాదని, అర్థశాస్త్రంలో అంబేద్కర్ చేసిన కృషి అద్భుతమని అలాగే చిరకాలం గుర్తుండి పోతుందని పేర్కొన్నారు. దీన్ని బట్టి అంబేద్కర్ భారత ఆర్థికశక్తిగా నిలబెట్టడంలో చేసిన కృషిని గుర్తించవచ్చు.

కొలంబియా యూనివర్సిటీలో అభ్యసించిన అంబేద్కర్‌పై ప్రఖ్యాత అమెరికన్ తత్త్వవేత్త జాన్ డివే ప్రభావం ఎక్కువగా ఉండేది. ఆయన అంబేద్కర్‌కు ఉపాధ్యాయుడు. అలాగే అంబేద్కర్‌కు పబ్లిక్ ఫైనాన్స్ బోధించిన ఎడ్విన్ ఆర్ ఏ సెలిగ్‌మన్

**వెన్నెల మాధవి,** పాత్రికేయురాలు

అప్పటి ప్రపంచ ప్రఖ్యాత ఆర్థికవేత్తలో ఒకరు. ఇక లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో అభ్యసిస్తున్న సమయంలో ఎడ్విన్ కానన్ లాంటి ఉద్దండులు అంబేద్కర్‌ను ప్రభావితం చేసిన వారిలో ఉన్నారు.

అర్థశాస్త్రంలో అంబేద్కర్ చేసిన కృషిని ముఖ్యంగా మూడు అధ్యయన పత్రాల ద్వారా పేర్కొనవచ్చు. వాటిలో ఒకటి "అడ్మినిస్ట్రేషన్ అండ్ ఫైనాన్స్ ఆఫ్ ది ఈస్టిండియా కంపెనీ" (1915), రెండోది "ది ప్రాబ్లం ఆఫ్ ది రూపీ : ఇట్స్ ఆరిజన్ అండ్ ఇట్స్ సొల్యూషన్" (1923) మరియు "ది ఎవల్యూషన్ ఆఫ్ ప్రావిన్షియల్ ఫైనాన్స్ ఇన్ బ్రిటిష్ ఇండియా : ఏ స్టడీ ఇన్ ప్రావిన్షియల్ డి సెంట్రలైజేషన్ ఆఫ్ ఇంపీరియల్ ఫైనాన్స్" (1925). అలాగే 1918లో అంబేద్కర్ ప్రవేశపెట్టిన మరో అధ్యయన పత్రం "స్మాల్ హోల్డింగ్స్ ఇన్ ఇండియా అండ్ దెయిర్ రెమిడీస్" సైతం పేరెన్నికగన్నది. దీంతో పాటు అంబేద్కర్ పలు కమిషన్లకు తన మెమొరండం అందజేత, ఆర్థిక వ్యాసాలు, పలు ప్రసంగాల ద్వారా అర్థ శాస్త్రంలో తన కృషిని సాగించారు. మహారాష్ట్ర ప్రభుత్వం అంబేద్కర్ విడుదల చేసిన అంబేద్కర్ సంకలనాలు, ఉపన్యాసాలు అనే శీర్షికతో పలు వాల్యూములు పుస్తకాలను గ్రంథస్థం చేసి అందుబాటులోకి తెచ్చింది. వీటి ద్వారా అంబేద్కర్ ఆర్థికవేత్తగా ఆయన దృక్కోణాన్ని అధ్యయనం చేసే వీలు దక్కింది.

అంబేద్కర్ సమర్పించిన అధ్యయన పత్రాల్లో పేరెన్నికగన్నది ముఖ్యంగా "ది ప్రాబ్లం ఆఫ్ ది రూపీ" (1923) ప్రధానంగా ఈ అధ్యయన పత్రం భారత్‌లోని ద్రవ్యవిధానాలను చర్చించింది. భారత్‌లో చెలామణిలో ఉన్న ద్రవ్య యూనిట్ రూపాయి. అయితే 1872 నుంచి 1893 మధ్య కాలంలో దేశంలోని రూపాయి ద్రవ్యవిలువను తగ్గించారు. ఇది ఒక రకంగా దేశం నుండి ఎగుమతులను ప్రోత్సహించేందుకు తోడ్పడింది. కానీ దేశ ఆర్థికవ్యవస్థకు దెబ్బ తగిలింది. ద్రవ్యవిలువను తగ్గించడం ద్వారా రూపీ యూనిట్లను ఎక్కువ మొత్తంలో ఉత్పత్తి చేయాల్సి వచ్చింది, అదే సమయంలో ఇంగ్లాండులో చెలామణి అవుతున్న బంగారంతో తయారుచేసిన స్టెర్లింగ్ నాణేలతో ద్రవ్య మార్పిడికి మరిన్ని రూపీలను వెచ్చించాల్సి వచ్చిందని అంబేద్కర్ పేర్కొన్నారు. ఇది ఒక రకంగా దేశ ఆర్థిక వ్యవస్థను కుదేలు చేసింది. చేసే ఎగుమతులకు రాబడికి మధ్య తీవ్రవ్యత్యాసానికి దారి తీసింది. ఇక దిగుమతుల విషయంలో ఎక్కువ మొత్తంలో ద్రవ్యాన్ని చెల్లించాల్సి వచ్చింది. ఈ లోపాన్ని అంబేద్కర్ తన సిద్ధాంత వ్యాసంలో పేర్కొన్నారు. ఇందుకు పరిష్కారంగా అంబేద్కర్ ద్రవ్య మార్పిడికి బంగారు కరెన్సీని ప్రవేశ పెట్టాలని సూచించారు. అప్పుడు వస్తువుకు తగిన విలువ దక్కుతుందని విపణి ప్రోత్సాహకంగా సాగుతుందని సూచించారు. అంబేద్కర్ చేసిన బంగారు కరెన్సీ వాదనకు పలువురి నుంచి మద్దతు లభించింది. విఖ్యాత ఆర్థికవేత్త జాన్ మేనార్డ్ కీన్స్ ఈ వాదనను సమర్థించారు. ఆర్థిక స్థిరత్వం కోసం లావాదేవీలను బంగారం ద్వారా సాగించాలని అంబేద్కర్ సూచించారు.

అలాగే విపణిలో ద్రవ్య వినిమయంపై కూడా అంబేద్కర్ మరెన్నో సూచనలు చేశారు. ఆ తరం ఆర్థిక వేత్తల వలెనే అంబేద్కర్ సైతం ద్రవ్య పరిమాణ సిద్ధాంతాన్ని సమర్థించారు. ముఖ్యంగా అప్పటి ప్రభుత్వం విపణిలో కృత్రిమంగా ద్రవ్యాన్ని ఎక్కువగా ప్రవహింపచేయడాన్ని వ్యతిరేకించారు. అంతేకాదు 1925లో హిల్టన్ యంగ్ కమిషన్‌కు ఇచ్చిన నివేదికలో తన అభిప్రాయాన్ని పొందుపరుస్తూ ''ఒక వ్యవస్థీకృత కరెన్సీని నియంత్రణలో ఉంచాల్సిన బాధ్యత వ్యవస్థదేనని ఆ వ్యవస్థ ప్రభుత్వ నియంత్రణలో ఉండాలని అంబేద్కర్ సూచించారు. అంతేకాదు హిల్టన్ కమిటీకి అంబేద్కర్ మెమొరాండం మూలంగానే రిజర్వు బ్యాంకు విధానాలు రూపుదిద్దుకున్నాయి. అంబేద్కర్ సమర్పించిన "ది ప్రాబ్లం ఆఫ్ ది రూపీ (1923)" ద్వారా రాయల్ కమిషన్ తీవ్రంగా ప్రభావితం అయ్యింది. ఫలితంగా 1934లో భారత రిజర్వు బ్యాంకు చట్టం వచ్చింది. ధరల స్థిరీకరణకు ఒక విధానపరమైన ద్రవ్య నియంత్రణ వ్యవస్థ ఉండాలని అంబేద్కర్ సూచించారు. ప్రస్తుత కాలంలో సైతం బడ్జెట్‌లో ద్రవ్యలోటును నియంత్రించేందుకు ద్రవ్య వినిమయ నియంత్రణ అలాగే దాని వ్యవస్థలపైనే దృష్టి సారించడం గమనార్హం.

ఇక అంబేద్కర్ ప్రవేశపెట్టిన మరో అధ్యయన పత్రం ''ఎవల్యూషన్ ఆఫ్ ప్రావిన్షియల్ ఫైనాన్స్ ఇన్ బ్రిటిష్ ఇండియా" (1925) కూడా పేరెన్నికగన్నది. ఇందులో ముఖ్యంగా ప్రజా పద్దులకు సంబంధించిన అంశాలు ఉన్నాయి. ఈ పరిశోధనలో అంశాలు ముఖ్యంగా సమకాలీన వ్యవస్థకు సైతం వర్తిస్తాయి. విధాన పరంగా తీసుకునే నిర్ణయాలు స్వతంత్రంగా ఉండాలంటే వాటి ఆర్థిక వనరుల కోసం మరో వ్యవస్థపై ఆధారపడకూడదని అంబేద్కర్ సూచించారు. ఇది ఎప్పటికీ ఏ వ్యవస్థకైనా వర్తిస్తుంది.

అలాగే 1949లో అంబేద్కర్ రాజ్యాంగ నిర్మాణంలో భాగంగా కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ విధానాల గురించి చర్చించారు. ప్రజల కోసం ప్రభుత్వాలు వినియోగించే డబ్బును కేవలం నిబంధనలు, నియంత్రణలు, చట్టానికి లోబడి మాత్రమే ఖర్చుచేస్తే సరిపోదని తెలిపారు. వాటితో పాటు విశ్వాసభావం (ఫెయిత్‌ఫుల్ నెస్), జ్ఞానం, ఆర్థిక విచక్షణ ఉండాలని కూడ సూచించారు. అయితే విశ్వాసభావం అనే పదానికి బాధ్యత లేదా ఒక నమ్మకాన్ని పూర్తి చేసే సంకల్పం, హామీ అని నిర్వచనాలను ఇచ్చారు. ఇందుకు కారణం

లేకపోలేదు. ప్రభుత్వాలకు ప్రజలు పన్నుల రూపంలో తమ సంపాదనను ఇస్తున్నారు. కనక, వారికి మెరుగైన సౌకర్యాలను కల్పించడం ప్రభుత్వ బాధ్యత. ముఖ్యంగా మౌలిక సదుపాయాలు, రక్షణ, న్యాయ సేవలు లాంటివి మార్కెట్‌లో అందరికీ దక్కాల్సినవి. అందుకే ఇలాంటి అంశాలపై ఖర్చు చేసే విషయంలో ప్రభుత్వాలు కేవలం ఒక చట్రంలో పనిచేయకూడదని అంబేద్కర్ ఈ అదనపు బాధ్యతలను కూడా జత చేశారు. అయితే ప్రజాధనాన్ని వినియోగించడం అంటే వారికి ఎక్కడ అవసరం ఉందో అక్కడే వినియోగించాల్సి ఉంటుంది. దీనికి బాధ్యత అనేది అవసరం. ఉదాహరణకు ఉన్నతవిద్యకు ప్రభుత్వం ఒక పెద్ద మొత్తంలో బడ్జెట్ కేటాయించింది అనుకుంటే, దానిని తరగతి గదుల ఆధునీకరణకు, లేబోరేటరీల, లైబ్రరీల స్థాపనకు వాడవచ్చు. కానీ అదే బడ్జెట్‌ను దుర్వినియోగపరచే వీలు కూడా ఉంది. అందుకే అంబేద్కర్ ప్రజా ధనం వినియోగం పట్ల విచక్షణ, జ్ఞానం, బాధ్యత కలిగి ఉండాలని సూచించారు. అలాగే ప్రజా ధన వినయోగం పై కాస్త కఠినతరమైన నిబంధనలు కాకుండా పరిస్థితులకు తగ్గట్టుగా ఆ సమయానికి అవసరమైనట్లుగా వినియోగించే వీలు ఉండేలా నిబంధనలు ఉండాలన్నారు.

ఇక అంబేద్కర్ సూచించిన మరో పరిశోధక పత్రం "స్మాల్ హోల్డింగ్స్ ఇన్ ఇండియా అండ్ దేయిర్ రెమిడీస్" (1918), అలాగే స్టేటస్ అండ్ మైనారిటీస్ ( 1947) లో ప్రధానంగా దేశంలోని వ్యవసాయ రంగంపై చర్చించారు. భారతదేశంలోని భూ సమస్య, వ్యవసాయంలో అడ్డంకులు, వనరుల వినియోగంలో వెనుకబాటు, తక్కువ ఉత్పాదకత లాంటి అంశాలు లేవనెత్తారు. అంబేద్కర్ ఉటంకించిన అంశాల్లో ప్రధానమైనది ఉత్పాదకత అనేది వ్యవసాయ భూముల పరిమాణంపై ఆధారపడి ఉండదనేది. ముఖ్యంగా పెట్టుబడి లేబర్ ప్రోత్సహకాల మీదనే ఆధారపడి ఉంటుందని తెలిపారు. పెట్టుబడి, శ్రామికశక్తి, వనరులు అందుబాటులో లేనప్పుడు ఎంత భూమి వినియోగంలో ఉన్నా పెద్దగా ప్రయోజనం లేదని అంబేద్కర్ అన్నారు. అలాగే చిన్న కమతాలకు తోడ్పాటు నందినప్పటికీ వ్యవసాయరంగాన్ని ప్రోత్సహిస్తే ఉత్పాదకత పెరుగుతుందని అంబేద్కర్ సూచించారు. సరిగ్గా అదే లాండ్ సీలింగ్ యాక్ట్‌కు దారితీసింది. అలాగే కులం పేరిట వెట్టిచాకిరీ వ్యవస్థ అమలవడాన్ని సైతం అంబేద్కర్ తీవ్రంగా నిరసించాడు. భూస్వామ్య విధానం వల్లనే గ్రామీణ సమాజంలో అంతరాలు పెరిగి వ్యవసాయ రంగం వికాసం చెందడం లేదని తప్పుపట్టారు.

ఆర్థికవేత్తగా అంబేద్కర్ పలురంగాలపై తన ముద్రనువేశారు. అందులో ప్రధానంగా చర్చించిన అంశాలేంటో విశ్లేషిద్దాం. అంబేద్కర్ 1936లో స్వతంత్ర మజ్దూర్ పార్టీ మానిఫెస్టోలో దేశంలోని పన్ను విధానాలపై ప్రస్తావించారు. పన్నులు అనేవి కేవలం చెల్లింపుదారుల సమర్థత ఆధారంగా వేయాలని అంతే కానీ వారి సంపాదనపై కాదని అన్నారు. అంతే కాదు పేద వర్గాలపై పన్నుల భారం మోపరాదని, ధనికులపై పన్నులు విధించమని అన్నారు. పన్ను మినహాయింపులు అనేవి కొంత స్థాయి వరకూ అమలు చేయాలని సైతం తెలిపారు. అలాగే మరీ ముఖ్యంగా భూ రెవెన్యూ పన్ను విధానాలు సులభతరంగా ఉండాలని వ్యవసాయ భూములపై లేవీ సేకరించరాదని సూచించారు.

## పరిశ్రమల జాతీయాకరణ..

అంబేద్కర్ భారీ పరిశ్రమలను నెలకొల్పడం ద్వారా దేశంలో ఉపాధితో పాటు పారిశ్రామికీకరణ పుంజుకుంటుందని సూచించారు. భారీ పరిశ్రమలను ప్రభుత్వమే నెలకొల్పాలని, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ప్రైవేటు పరిధిలో ఉండాలని సూచించారు. అలాగే రవాణా, బీమా రంగ కంపెనీలను ప్రభుత్వం జాతీయం చేయాలన్నారు. కార్మికులకు సమ్మె హక్కు కల్పించాలని తెలిపారు. స్వతంత్రం అనంతరం అంబేద్కర్ సూచనల మేరకే ఇండస్ట్రీయల్ పాలసీని తయారు చేయడం గమనార్హం.

## సమగ్ర ఆర్థికాభివృద్ధి వ్యూహం..

భారత్ ఆర్థిక పురోభివృద్ధిలో భాగంగా ప్రధానంగా ఆర్థిక అసమానతలను రూపుమాపే విధంగా ముందుకు వెళ్లాలని సూచించారు. దేశంలో మత పరంగా, కుల పరంగా సాగుతున్న దోపిడీని అరికట్టేందుకు విధానాలను రూపొందించాలని సూచించారు.

## కార్మిక సంస్కరణలు.. సంక్షేమం..

1942 నుంచి 1946 వరకు అంబేద్కర్ వైస్రాయి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో లేబర్ మెంబర్‌గా ఉన్నప్పుడు అనేక సూచనలు చేశారు. ముఖ్యంగా ప్రస్తుతం ఉపాధి మార్గం చూపించే మారిన ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్‌ల ఏర్పాటు, ప్రసూతి సెలవు, వేతనంతో కూడిన సెలవు, పనిగంటలు, కార్మిక బీమా తదితర అంశాల్లో అంబేద్కర్ ముద్ర కనిపిస్తోంది

## స్వేచ్ఛా విపణి రంగంలో..

నేడు ప్రపంచ వ్యాప్తంగా వాణిజ్య రంగంలో విస్తరిస్తున్న స్వేచ్ఛావిపణి, గోబలైజేషన్, లిబరలైజేషన్ మరియు ప్రైవేటీకరణ విధానాలను అంబేద్కర్ 1923లోనే ప్రస్తావించారు. స్వేచ్ఛా విపణిని, వాణిజ్యంలో వస్తున్న మార్పుల్ని ముందుచూపుతో అంబేద్కర్ వందేళ్ల క్రితమే ఊహించగలిగారు. అవకాశాలను అందిపుచ్చుకునే సంసిద్ధత కలిగి ఉండాలన్నారు.

***తరువాయి 46వ పేజీలో...***

# ఈశాన్య భారతంలో మౌలిక సదుపాయాలు



**ఆగ్నేయాసియా దేశాల్లో మొదటగా తగిలేది ఈశాన్య భారతదేశమే అవుతుంది. ఈ దిశగా సామాజిక, ఆర్థిక కదలికలు, మార్కెట్లను సమన్వయం చేసుకోవడంలో కచ్చితంగా తొలి ప్రాధాన్యత ఇవ్వవలసిన అంశాలు–రవాణా తదితర మౌలిక సౌకర్యాల మెరుగుదల. ఈశాన్య రాష్ట్రాలలో రకరకాల అభివృద్ధికి ప్రత్యేక పథకం అమల్లో ఉంది. మూడు దశల్లో అమలయ్యే ఈ పథకం పూర్తయితే రాష్ట్రాల రాజధానులతో, 88జిల్లా ప్రధానకేంద్రాలతో, సమీపంలోని జాతీయ రహదారులతో అనుసంధానత ఏర్పడుతుంది.**

1947లో భారత్ విభజన ఫలితంగా మిగిలిన దేశాలతో పోలిస్తే ఈశాన్య భారతం దానికంటూ అది ఎదుర్కొన్న ప్రత్యేక పరిస్థితుల కారణంగా మౌలిక సదుపాయాల రంగంలో వెనకబడిపోయింది. స్వాతంత్ర్యానికి పూర్వం ఈశాన్య భారతం ఇప్పుడున్న బంగ్లాదేశ్ (అప్పుడు ఉమ్మడి బెంగాల్ రాష్ట్రంలో భాగం) తో తూర్పున బర్మాతో (ఇప్పటి మయన్మార్)తోపాటూ మిగిలిన దేశాలతో కలిసి ఉండేది. అయినా రోడ్డు రైలు మార్గాలవంటి మౌలిక సదుపాయాలు ఆశించినంత గొప్పగా లేకపోయినా ఇప్పటితో పోలిస్తే కాస్త మెరుగనే చెప్పాలి. ఇప్పుడు ఈశాన్య భారతం మొత్తాన్ని మిగిలిన భారత్‌తో కలిపేది సన్నటి 27 కి.మీ సిలిగురి రోడ్డు మాత్రమే. దీన్ని చికెన్స్ నెక్ (కోడిమెడ) మార్గం అని కూడా అంటారు. చిట్టగాంగ్ రేవుతో సంబంధాలు తెగిపోయిన తరువాత సరిహద్దులు మూసివేయడంతో ఈ ప్రాంతానికి సముద్ర మార్గం కూడా తెగిపోయినట్లయింది. దీనివల్ల అక్కడి ఉత్పత్తులను,మార్కెట్‌లను రాజకీయ అడ్డుగోడ స్తంభింపచేస్తున్నది. దీని ప్రభావం మొత్తం ఈశాన్య భారత ప్రజా జీవితంపై పరోక్షంగా పడింది.

ఇప్పుడున్న ఈశాన్య భారతం సరిహద్దుల్లో 96 శాతం అంతర్జాతీయ హద్దులాగా ఉన్నాయి. ఉత్తరాన చైనా, భూటాన్ ఉండగా తూర్పున మయన్మార్, దక్షిణ, పశ్చిమాల్లో బంగ్లాదేశ్ ఉన్నాయి. సిక్కిం పడమర హద్దుగా నేపాల్ ఉంది. వాణిజ్యమార్గంలో, దేశంలోని ప్రధాన మార్కెట్లలో భౌగోళికపరమైన, రాజకీయ పరమైన సాన్నిహిత్యం కొరవడడంతో ఈశాన్య భారత ఆర్థిక వ్యవస్థ నిర్మాణపరంగా అతలాకుతలమైపోయింది.

ఈరోజు ప్రపంచం ఆర్థికంగా పుంజుకుంటున్న తూర్పుదేశాలకేసి చూస్తున్నది. ఆ దేశాల్లో ముఖ్యంగా ఆగ్నేయాసియా దేశాల్లో మొదటగా తగిలేది ఈశాన్య భారతదేశమే అవుతుంది. ఈ దిశగా సామాజిక, ఆర్థిక కదలికలు, మార్కెట్లను సమన్వయం చేసుకోవడంలో కచ్చితంగా తొలి ప్రాధాన్యత ఇవ్వవలసిన అంశాలు–రవాణా తదితర మౌలిక సౌకర్యాల మెరుగుదల. దీనికి ప్రధాన భారతభూభాగంతో అన్ని రకాలుగా అనుసంధానం కావడం చాలా అవసరం. ఇది నెరవేరాలంటే దౌత్యపరమైన అంశాలను సానుకూలపరచుకోవడం, ఇరుగుపొరుగు

**డాక్టర్ కృష్ణదేవ్,** రవాణారంగ నిపుణులు.
E-mail : kd.krishnadev@gmail.com

దేశాలతో సరిహద్దు రవాణా సౌకర్యాలను, వాణిజ్య సంబంధాలను అభివృద్ధి చేసుకోవడం కీలకమౌతుంది. ఈ ప్రాంతంలో ఆర్థిక వ్యవస్థ ప్రధానంగా వ్యవసాయాధారమే. తేయాకు, ముడిచమురు, సహజవాయువు, గనులు, స్టీల్ ఫ్యాబ్రికేషన్‌వంటి రంగాలలో ప్రధానంగా పారిశ్రామిక ప్రగతిఉన్నా పూర్తి సామర్థ్యంమేరకైతే ఉండడంలేదు. దీనివల్ల చాలా వనరులు నిరుపయోగంగాపడి ఉండగా ఉపాధి అవకాశాల వత్తిడి మాత్రం ఎక్కువగా సేవారంగంమీదే ఉంటున్నది. అభివృద్ధిలో సమతౌల్యత సాధించడానికి రవాణా సంబంధాలు బాగా ఉపయోగపడతాయి.

1991లో వివిధ ప్రభుత్వాలు అనుసరించిన "లుక్‌ఈస్ట్"(తూర్పుదేశాలకేసి చూద్దాం) విధానం 2007నాటి ఈశాన్య పారిశ్రామిక, పెట్టుబడి అభివృద్ధి విధానం, 2008లో విడుదలచేసి ఈశాన్య ప్రాంత దార్శనిక పత్రం, 2020 (భవిష్య ప్రణాళిక)వంటి చర్యలు సరైన దిశగా పడిన అడుగులే అయినా దీనికి తగిన కృషిని జోడించి సత్ఫలితాలు రాబట్టాల్సి ఉంది. లోగడ ప్రణాళికా పెట్టుబడులు అందుతూనే ఉన్నా, ఈశాన్య భారతంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి మాత్రం ఊపందుకోలేదు. అభివృద్ధి పుంజుకోకపోవడానికి ఏకైక ప్రధాన కారణం ఇదని దార్శనిక పత్రంలో కూడా పేర్కొనడం జరిగింది.

''లుక్‌ఈస్ట్'' విధానానికి ప్రస్తుత ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నది. నవంబర్, 2014లో మయన్మార్‌లో జరిగిన ఆగ్నేయాసియా దేశాల భారత సంఘ (ASEAN) శిఖరాగ్ర సమావేశంలో ఆర్థికాభివృద్ధి, వాణిజ్యం, పెట్టుబడులు, పారిశ్రామిక రంగాలలో ఈ బ్లాకులోని 10దేశాల ప్రాధాన్యతను ప్రధాని తమ ప్రారంభోపన్యాసంలో నొక్కిచెప్పారు. ఈ విధానంలో వాణిజ్యం, సాంస్కృతికం, అనుసంధానత... ఈ మూడు చాలా కీలకం. భారతదేశం కేవలం ''లుక్‌ఈస్ట్'' (తూర్పుదేశాలకేసి చూడండి) మాత్రమే కాదు, "యాక్ట్ ఈస్ట్ " (Act East) (తూర్పుదేశాల్లో కార్యాచరణ) విధానంతో ముందుకు పోతున్నామని ప్రధాని ప్రపంచానికి చాటి చెప్పారు. దీనివల్ల ఆసియా పసిఫిక్ ప్రాంతంలో ద్వైపాక్షిక, ప్రాంతీయ, పలు స్థాయిల్లో నిరంతర సంప్రదింపులద్వారా ఆర్థిక సహకారం, సాంస్కృతిక సంబంధాల పటిష్టత, కీలక సంబంధాల బలోపేతంవంటి చర్యలను ప్రోత్సహించడం ఈ విధానం లక్ష్యం. దీనివల్ల అరుణాచల్ ప్రదేశ్‌తో సహా ఈశాన్య రాష్ట్రాలు ఆర్థికరంగంలో ఏకాకిగా మిగిలిపోవు.

ఈశాన్య రాష్ట్రాలలో అంతర్గతంగానూ, ఇరుగుపొరుగు దేశాలతోనూ అనుసంధానత, మౌలిక సదుపాయాల అభివృద్ధి AEP ప్రధాన సూత్రం. అంటే రోడ్డు, రైలు, అంతర్గత జలరవాణా, టెలికాం, విమానాశ్రయాలు, విద్యుత్ వంటి రంగాలలో పొరుగుదేశాలతో మౌలిక సదుపాయాలు పూర్తిగా అభివృద్ధిచెందేవరకూ ఈ విధానంలోని ప్రయోజనాలను సంపూర్ణంగా విశ్లేషించలేం.

"భారత్‌లో తయారీ" అన్న ప్రధాని నినాదంనుండి అందుకున్న స్ఫూర్తితో 'ఈశాన్య భారతంలో తయారీ' పత్రాన్ని రూపొందించారు. దీనివల్ల కొత్త ఆదాయ మార్గాలు లభించడమేకాక, కొత్త ఉద్యోగావకాశాలు లభిస్తాయి. పొట్టచేతపట్టుకుని ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్ళిపోవడం కూడా తగ్గుముఖంపడుతుంది. పారిశ్రామిక, వాణిజ్య ప్రగతితో ఈ ప్రాంతంకూడా మిగిలిన భారతదేశానికి మరింత చేరువవుతుంది.

ఇవిగాక కొత్తగా ఏర్పాటౌతున్న సంస్థలకు(స్టార్టప్స్) ఈశాన్యభారతం ఆశావహంగా కనిపిస్తున్నది. రెండేళ్ళ పన్ను మినహాయింపు, మూడేళ్ళలో పెట్టుబడి వాటాదారుల నిష్క్రమణవంటివి దీని విశిష్టతలు. 'వెంచర్‌ఫండ్ ' రూపంలో ఈ పెట్టుబడి సమకూరడంవల్ల కొత్త సంస్థలకు అప్పుల భయం ఉండదు. ఇది విజయవంతమయ్యేకొద్దీ ఈప్రాంతంలో ఆదాయ వనరులు, ఉపాధి అవకాశాలు పెరుగుతూపోతాయి. అంతేకాక ఇతర ప్రాంతాల నుంచి దీనికి ఆకర్షితులై సంస్థలను ప్రారంభించేవారి సంఖ్య పెరుగుతుంది. ఈశాన్య భారతంలో ప్రస్తుతం అనుసంధానత ఇలా ఉంది.....

**రహదారులు :**

ఈశాన్య రాష్ట్రాలలో రకరకాల అభివృద్ధికి ప్రత్యేక పథకం (SARDP-NE) అమల్లో ఉంది. మూడు దశల్లో అమలయ్యే ఈ పథకం పూర్తయితే రాష్ట్రాల రాజధానులతో, 88జిల్లా ప్రధానకేంద్రాలతో, సమీపంలోని జాతీయ రహదారులతో అనుసంధానత ఏర్పడుతుంది.

**దీని లక్ష్యాలు :**

* రాష్ట్ర రాజధానీ నగరాలను కలిపే జాతీయ రహదారులను రెండు లేదా నాలుగు వరసలుగా అభివృద్ధి
* 88జిల్లా ప్రధానకేంద్రాలకు రెండు వరసల రహదార్లతో అనుసంధానత
* వెనుకబడిన, మారుమూల ప్రాంతాలకు రహదారి సౌకర్యం
* సరిహద్దుల్లోని కీలకప్రాంతాల్లో రహదారుల అభివృద్ధి
* పొరుగుదేశాలతో అనుసంధానత దీనిని మూడు భాగాలుగా అమలు చేస్తారు.

1. ప్రభుత్వం ఆమోదించిన మొదటిదశ కింద 2041కి.మీ జాతీయ రహదార్లను, 2058కి.మీ రాష్ట్ర రహదారులను

అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. ఆగస్ట్, 2015 వరకు 1565 కి.మీ పూర్తయింది. ఈ దశ మార్చి, 2017కి పూర్తి కావాలనేది లక్ష్యంగా పెట్టుకున్నారు.

2. రెండోదశకింద 1285కి.మీ జాతీయ రహదారి, 2438 కిమీ రాష్ట్ర రహదారులు అభివృద్ధి చేస్తారు. ఇది కూడా మార్చి, 2017కి పూర్తి చేయాలని ఉద్దేశించారు.

3. ఇది మొత్తం అరుణాచల్‌ప్రదేశ్ అభివృద్ధి ప్యాకేజ్‌కిందకు వస్తుంది. 1472 కి.మీ జాతీయ రహదారులను, 847కి.మీ అంతర్జాతీయ రహదారులను అభివృద్ధి చేస్తారు. ఆగస్ట్, 2015 నాటికి 1552 కి.మీ మంజూరుకాగా 230 కి.మీ పూర్తయింది. ఇది మొత్తం మార్చి, 2018కి పూర్తవుతుందని అంచనా.

**బి). ప్రాక్, పశ్చిమ రహదారులు (ఈస్ట్ వెస్ట్ కారిడార్) :**

శ్రీరాంపూర్ (అస్సాం/పశ్చిమబెంగాల్ సరిహద్దు) నుండి సిల్చార్ (అస్సాం) వరకు 670కిమీ మేర నాలుగు వరుసల రహదారిగా దీనిని అభివృద్ధి చేస్తున్నారు. అయితే భూసేకరణ, చెట్లు తరచుగా నరకడం, వరుసబంద్‌లు,శాంతి భద్రతలవంటి పలు అంశాల కారణంగా పనులు మందకొడిగా సాగుతున్నాయి. ఇప్పటివరకు 580కి.మీ మేర పూర్తయింది. మిగిలిన పనులు డిసెంబర్, 2016నాటికి పూర్తిచేయాలని సంకల్పించారు.

**రైలుమార్గాలు :**

ఏప్రిల్ 1, 2012 నాటికి 2661 కిమీ మేర రైలుమార్గం ఉంది. దీనిలో 1601 కిమీ బ్రాడ్‌గేజ్‌గా ఉంది. రైళ్ళద్వారా పర్యాటక పథకాలను ఇక్కడ ప్రోత్సహించాలని ఉద్దేశించారు. వీటిలో ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్య పథకాలుకూడా ఉన్నాయి. అన్ని రాష్ట్రాల రాజధానులతో రవాణా సదుపాయాలకోసం ఇరుగుపొరుగు దేశాల అనుసంధానత లక్ష్యంగా వీటిని అభివృద్ధి చేసేందుకు ఒక బృహత్తర ప్రణాళిక అమల్లో ఉంది.

ఆగస్ట్ 11, 2014నుంచి మేఘాలయకు రైలుమార్గం ఏర్పడింది. ఈ ఏడాది మరో మూడు ప్రాంతాలు అందుబాటులోకి వస్తాయి. రు.38,310 కోట్లతో 2919 కిమీ మేర 20 భారీ ప్రాజెక్ట్‌లు మంజూరయ్యాయి. వీటిలో 10 జాతీయప్రాజెక్ట్‌లు. మార్చి, 2020నాటికి అన్ని రాష్ట్రాల రాజధానులకు రైలుమార్గం ఏర్పడుతుంది.

**విమానాలు :**

ఈశాన్య రాష్ట్రాలలో ఇప్పుడు 12 విమానాశ్రయాలు రాకపోకలతో చురుగ్గా ఉండగా మరో 12 నాన్ ఆపరేటివ్ విమానాశ్రయాలున్నాయి. ఈ ప్రాంతంలో విమానాల రాకపోకలు పెంచడానికి కృషి జరుగుతోంది. దీనిలో భాగంగా ముఖ్యంగా వాణిజ్య విమానాలు తక్కువగా ఉన్నచోట్ల వీటిని పెంచడానికి ఎయిర్ ఇండియా అనుబంధ సంస్థ అలయన్స్ ఎయిర్‌తో షిల్లాంగ్‌లో ఈశాన్యమండలి 2002–2011 మధ్య ATR-42 విమానాలు నడపడానికి ఆర్థిక సాయం అందించింది. ప్రస్తుతం తేజ్‌పూర్, దిమాపూర్, లీలాబరి ప్రాంతాలకు ఎయిరిండియా లేదా అలయెన్స్ ఎయిర్ విమానాలు నడుస్తున్నాయి. ఈ ఆర్థికసాయం కొంతకాలం నిలిపివేసినా బారాపానీతోపాటూ ఈ మూడు ప్రాంతాలకు ఆగస్ట్, 2013నుండి విమానాలు నడపడానికి తిరిగి ఆర్థికసాయం కొనసాగిస్తున్నారు.

దేశంలో అంతర్జాతీయ, ప్రాంతీయ వైమానిక హబ్‌లు(గమ్యస్థానాలకు నేరుగా విమానాలు లేనిచోట్ల ప్రయాణీకులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసే కేంద్రాలు) ఏర్పాటుచేయడానికి ఉద్దేశించిన విధానాన్ని ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. దేశంలోని పలువిమానాశ్రయాల్లో ఈ హబ్‌లు ఏర్పాటుచేయడంలో ఎదురయ్యే అవాంతరాలను పరిష్కరించడానికి అంతర్ మంత్రివర్గ కమిటీ ఏర్పాటుకు ప్రభుత్వం అంగీకరించింది. పౌరయాన శాఖ కార్యదర్శి దీనికి ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు.

ఈ కొత్త విధానం వల్ల భారత్‌లో అంతర్జాతీయ కేంద్రాల (హబ్) అభివృద్ధే కాకుండా ఈశాన్య భారతంతో సహా మారుమూల ప్రాంతాల్లో పట్టణాలకు చెందిన ప్రయాణీకుల వైమానిక అవసరాలను తీర్చేందుకు ప్రాంతీయ కేంద్రాల అభివృద్ధికి కూడా వీలు కలుగు తుంది. టయర్–2, టయర్–3 నగరాలలోవిమానాశ్రయాల నిర్మాణం, ఆధునికీకరణలపై దృష్టి పెట్టడం ద్వారా దేశంలోని మారుమూల ప్రాంతాలకు విమానాల రాకపోకలు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నది.

**అంతర్గత జలమార్గాలు :**

భారత అంతర్జాతీయ జలమార్గాల సంస్థ (IWAI) జాతీయ జలమార్గాలను అభివృద్ధి చేయాలన్న దృఢసంకల్పంతో ఉంది. బ్రహ్మపుత్రానదికి సంబంధించిన జాతీయ జలమార్గం–2 కూడా దీనిలో ఒకటి. ఇది బంగ్లాదేశ్ సరిహద్దు సమీపాన ధూబ్రీనుండి మొదలై సదియా వరకుంటుంది. అలాగే బరాక్‌నదికి సంబంధించి లఖీర్‌పూర్‌నుంచి భాంగా వరకు 121 కిమీలను జాతీయ జలమార్గంగా అభివృద్ధి చేయనున్నారు. జాతీయ జలమార్గం–2 (NW-2)కు సంబంధించి జాతీయ జలమార్గంలో రేవు సౌకర్యాలవంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి, మార్గం విస్తరణకు పథకాలు సిద్ధం చేస్తున్నారు. దీనివల్ల ప్రయాణీకులతోపాటూ సరుకు రవాణా మార్గాల అభివృద్ధికికూడా మార్గం సుగమం అవుతుంది.

ఈశాన్య భారతం ఆర్థికంగా పుంజుకోవడానికి, భారత్ మయన్మార్‌ల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం మెరుగుపరుచుకోవడానికి జాతీయ జలమార్గం-2 కాకుండా ఇతర జలమార్గాలను కూడా అభివృద్ధిపరచాల్సి ఉంది.

**భారత్-బంగ్లా ఒడంబడిక**

అంతర్గత జలరవాణా వాణిజ్యమార్గాల (1700కిమీ)కు సంబంధించి భారత్-బంగ్లాల ఒడంబడిక ప్రకారం జాతీయ జలమార్గం-1(గంగానది)ని జాతీయ జలమార్గం-2 (బ్రహ్మపుత్ర), జాతీయ జలమార్గం-6(బారక్)లతో అనుసంధానం చేయాల్సి ఉంది. ఇది అభివృద్ధిచెందితే ఈశాన్య రాష్ట్రాలనుండీ సుందర్‌బాన్స్, బంగ్లాదేశ్‌ల మీదుగా మిగిలిన భారతదేశానికి రవాణా సౌకర్యాలు సులభతరమౌతాయి.

**కాలాదాన్ బహుళ నమూనా రవాణా పథకం**

మిజోరంను మయన్మార్‌లోని కాలాదాన్ ద్వారా కలకత్తా, హల్దియా రేవులను ప్రత్యామ్నాయ మార్గాలద్వారా కలపడానికి భారత్ విదేశాంగశాఖ ఈ పథకానికి రూపకల్పనచేసింది. హాల్దియానుండి సిత్వే, అక్కడినుండి మయన్మార్‌లోని పాలెత్వాకు, అక్కడి నుండి రోడ్డుమార్గంద్వారా మిజోరంకు రవాణా సౌకర్యం కల్పిస్తారు. సిత్వ్ రేవు నిర్మాణం చురుగ్గా సాగుతున్నది.

అభివృద్ధిని శ్రద్ధగా చేయడం, సకాలంలో పథకాలు పూర్తిచేయడం, స్థానిక ప్రతిభను ప్రోత్సహించడంవంటి చర్యలతో ఇక ఏమాత్రం ఏకాకి కాదన్న విశ్వాసాన్ని ఈశాన్య భారతం పెంపొందించుకుంటుంది. మిగిలిన దేశంతో సమాన అవకాశాలు అందిపుచ్చుకోగలుగుతుంది.

■

*42వ పేజీ తరువాయి...*

## మనకు తెలియని అంబేద్కర్ అర్థశాస్త్ర నిష్ణాతుడు

**జనాభా విస్ఫోటనం.. కుటుంబ నియంత్రణ**

దేశంలో జనాభా విస్ఫోటనాన్ని అదుపుచేయకుండా దేశ ఆర్థిక వ్యవస్థను అదుపుచేయలేమని అంబేద్కర్ పేర్కొన్నారు. ఫ్యామిలీ ప్లానింగ్ ప్రస్తావనను అంబేద్కర్ తెరపైకి తెచ్చారు. ఇదే తర్వాత భారత ప్రభుత్వం తన పాలసీగా మార్చుకుంది.

**మహిళా సాధికారత..**

మహిళలను ఆర్థిక ప్రధాన స్రవంతిలో భాగస్వాములను చేయకుండా దేశ అభివృద్ధి అసాధ్యమని అంబేద్కర్ విశ్వసించారు. దేశ ఆర్థికాభివృద్ధిలో అన్ని వర్గాలు, అన్ని రకాల ప్రజలు భాగస్వాములు అవ్వాలని ప్రత్యేకంగా మహిళలను ఉపాధివైపు నడిపించేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని అంబేద్కర్ సూచించారు.

**మానవ వనరుల వికాసం**

దేశంలో అసమానతలు, కులవ్యవస్థ వేళ్లూనుకుపోవడం వల్లనే మానవ వనరుల వికాసంలో అవరోధాలుగా మారుతున్నాయని అంబేద్కర్ సంకల్పించారు. అంతేకాదు కుల వ్యవస్థ, అంటరానితనం, ఇతర సామాజిక జాఢ్యాలు లేకుండా ఉంటేనే దేశంలో మేలైన మానవ వనరులు వికాసం జరుగుతుందని అంబేద్కర్ విశ్వసించారు.

**ముగింపు..**

ఇటీవల ప్రధాని నరేంద్ర మోడీ దళిత పారిశ్రామికవేత్తల సదస్సులో అంబేద్కర్‌ను కేవలం సామాజిక సంస్కర్తగా మాత్రమే కాకుండా ఆర్థిక వేత్తగా సైతం ఆయన సేవలు అవిరళమైనవి అన్నారు. ఆ దిశగా అంబేద్కర్ దేశ ఆర్థిక పురోభివృద్ధి కోసం సూచించిన మార్గాన్ని ఆచరించాల్సిన అవసరం ఉంది. అంబేద్కర్ సూచించినట్లు నేడు మన దేశంలో కుటుంబ నియంత్రణ, మహిళా సాధికారత, మానవ వనరుల వికాసం లాంటి ఎన్నో అంశాలు అమల్లోకి వచ్చి దేశం ఆర్థికంగా పురోభివృద్ధి సాధించేందుకు దోహదం చేశాయి. లాండ్ సీలింగ్ చట్టం, కనీస వేతన చట్టం, మిగులు భూముల పంపిణీ విధానాలు అంత సమర్థ వంతంగా ఫలితాలు రాబట్టలేదు. అలాగే దేశ ఆర్థిక పరిస్థితి, ద్రవ్యోల్బణం, వ్యవసాయ పరిస్థితులు, మానవ వనరుల కొరత దేశ ఆర్థికాభివృద్ధిని కుంగదీస్తున్నాయి. ఈ నేపథ్యంలో అంబేద్కర్ సూచించిన ఈ మార్గంలో పయనించి వాటిని ఆచరించి అభివృద్ధి పథంలో నడవడం ఆయనకు నిజమైన నివాళి మాత్రమేకాదు దేశ సౌభాగ్యానికి రాచ మార్గం కూడ!

■

### యోజన చందా రేట్లు పెరిగాయి

**యోజన** సంవత్సర చందా రూ. 230/- కు, రెండు సంవత్సరాలకు రూ. 430/- లకు, మూడు సంవత్సరాలకు రూ. 610/- లకు పెంచారు. ప్రత్యేక సంచిక ధరను రూ. 20/- నుండి రూ. 30/-లకు పెంచారు. మార్కెట్‌లో న్యూస్ ప్రింట్‌తో సహా అన్నిటి ధరలూ విపరీతంగా పెరిగి పోవడంతో ఈ పెంపు అనివార్యమైంది. చందాను Bharatkosh.gov.in సైట్‌లో Publications Division లింకును క్లిక్ చేసి ఆన్‌లైన్ ద్వారా చెల్లించవచ్చు. పాఠకులూ, చందాదారులు గమనించి సహకరించగలరు.

*- సీనియర్ ఎడిటర్*

# ఈశాన్య భారతంలో ఆరోగ్య పరిరక్షణ



**భారత్ తన స్థూల జాతీయోత్పత్తిలో 1.1 శాతం నిధులను మాత్రమే ఆరోగ్యంపై ఖర్చు చేస్తోంది. చైనా 2.9 శాతం, బ్రెజిల్ 4.1 శాతం ఖర్చు చేస్తున్నాయి. భారత్‌కు వర్తించే మూస ఆరోగ్య విధానం నమూనా ఏదీ అందుబాటులో లేదు. భారత్‌కు వున్న ఆరోగ్య లక్ష్యాలను సాధించడానికి ప్రత్యామ్నాయ విధానం అవసరం. ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆరోగ్య సంరక్షణ సంస్థలతో ప్రైవేటు, ప్రభుత్వేతర సంస్థలు భాగస్వామ్యమయ్యేలా ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత వుంది.**

పరిచయం : ఆరోగ్య సంరక్షణ రంగం గత కొన్నేళ్లు గా చాలా వేగంగా వృద్ధి చెందుతోంది. ఈశాన్య భారత దేశం ఆరోగ్య పరిరక్షణ మౌలిక వసతుల విషయంలో దేశంలోని మిగతా ప్రాంతాలతో పోలిస్తే వెనుకబడి వుంది. ఇది భౌగోళికంగా దూరంగా వుండడం వల్ల కావచ్చు, ఊహించనంతగా భౌగోళిక – రాజకీయ పరిస్థితుల వల్ల బయటి వారు ఆరోగ్య రంగంలో మౌలిక సదుపాయాలకు పెట్టుబడులు పెట్టడానికి అనుకూల పరిస్థితులు లేకుండా చేయడం వల్ల కావచ్చు. ఈశాన్య భారత్‌లో 2020 సంవత్సరం ఆపై ఆరోగ్య పరిరక్షణకు మార్గాలు అన్వేషించడం చాలా పెద్ద సవాలుగా మారింది. నిరంతర ఆరోగ్య పరిరక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయాలన్న విషయం ఆరోగ్య ప్రణాళిక రూపకర్తలకు పెద్ద సవాలుగా మారింది.

ఆరోగ్య సంరక్షణను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం ముందు నుంచి అనేక ఆరోగ్య పథకాలు ప్రారంభించింది. మరిన్ని పథకాలు చేపట్టడానికి కృషి చేస్తోంది. 1948లో భోర్ కమిటీ సిఫార్సులను అనుసరించి ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ అనే భావన వ్యాప్తిలోకి వచ్చింది. జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ (ఇప్పుడు జాతీయ ఆరోగ్య మిషన్)ను 2005 లో ప్రారంభించారు. గ్రామాల్లో వ్యాధుల నివారణ, చికిత్స.. ఈరెండు సేవలను అందుబాటులోకి తీసుకు రావాలన్న లక్ష్యంతో క్షేత్ర స్థాయిలో ఆశా కార్యకర్తలు కీలక పాత్ర పోషించే విధంగా దీన్ని చేపట్టారు. జాతీయ ఆరోగ్య మిషన్ ప్రభావం అద్భుతంగా వుంది.

ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో అమలు చేసిన సహస్రాబ్ది లక్ష్యాలు (MDG) 2015 కల్లా పూర్తయ్యాయి. ఇందులో భాగంగా భారత్‌లో శిశుమరణాలను తగ్గించడానికి, పౌష్టికాహార లోపాన్ని నివారించడానికి, వ్యాధినిరోధకతను పెంపొందించడానికి, త్రాగు నీరు, పారిశుద్ధ్యం మెరుగుదల తదితర అంశాలపై చర్యలు చేపట్టారు. గమ్యం చేరుకోవడంలో ఎమ్‌డీజీ లక్ష్యాలు అంతగా విజయవంతం కాలేదు. ఎమ్‌డీజీ లక్ష్యాల స్థానంలో కొత్తగా సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు (SDG)లను 2015 నుంచి 2030 వరకు అమలు చేస్తున్నారు. ఆరోగ్య రంగానికి సంబంధించినంత వరకు ఎమ్‌డీజీ లక్ష్యాలను నిర్దిష్ట సమయంలో చేరుకోలేక పోవడానికి ఐదు ప్రధాన అంశాలు కారణమయ్యాయి.

**డా . బిమన్ టాడా,** డైరెక్టర్, రీజినల్ రిసోర్స్ సెంటర్, జాతీయ ఆరోగ్య మిషన్, గువాహాతి, అస్సాం
E-mail: putuaghee@yahoo.com

**అవి ఏమిటంటే**

1. ఎక్కువ నిధుల ఆవశ్యకత.
2. అందుబాటులో వున్న నిధులను వీలైనంత సమర్ధంగా వినియోగించడం.
3. మానవ వనరులు, మౌలికసదుపాయాల కొరత.
4. పటిష్టమైన రాజకీయ సంకల్పం లేకపోవడం.
5. డిమాండు సప్లై మధ్య తీవ్ర అంతరం వుండడం.

**భారత్ ఏ స్థానంలో వుంది**

భారత్ తన స్థూల జాతీయోత్పత్తిలో 1.1 శాతం నిధులను ఆరోగ్యంపై ఖర్చు చేస్తోంది. చైనా 2.9 శాతం, బ్రెజిల్ 4.1 శాతం ఖర్చు చేస్తున్నాయి. సరిపోయినన్ని నిధులు లేకుండా సరైన ప్రజా ఆరోగ్య వ్యవస్థను నిర్వహించలేం. దీనికి తోడు, భారత్ కు వర్తించే ఆరోగ్య విధానం నమూనా ఏదీ అందుబాటులో లేదు.

భారత్‌కు వున్న ఆరోగ్య లక్ష్యాలు సాధించడానికి ప్రత్యామ్నాయ విధానం అవసరం. ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆరోగ్య సంరక్షణ సంస్థలతో ప్రైవేటు, ప్రభుత్వేతర సంస్థలు భాగస్వామ్యమయ్యేలా ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత వుంది. భారత్‌లో ప్రస్తుత ఆరోగ్య సంరక్షణ విధానం మారుతున్న ఆరోగ్య అవసరాలకు అనువుగా మార్పులను స్వీకరిస్తూ, భవిష్యత్తులో వచ్చే అవకాశాలను, కష్టనష్టాలకు స్పందించాల్సి వుంటుంది.

ఆరోగ్య సంరక్షణ పంపిణీ లో ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో (PPs) కొత్త యంత్రాంగాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. భారత్‌లో ఆరోగ్య సంరక్షణ విధానంపై శాప్-లాప్ (SAP-LAP) విశ్లేషణ ఏం చెబుతోందంటే ఇటువంటి ప్రభుత్వ-ప్రయివేటు భాగస్వామ్య నమూనా లను ప్రోత్సహిస్తే అవి విజయవంతమవుతాయని అంటోంది. ఇటువంటి ప్రభుత్వ-ప్రయివేటు భాగస్వామ్య నమూనాలు వాటి పరిధిలోనూ, సేవలందించడంలోను విభిన్నంగా వుంటాయి కాబట్టి వాటిని రూపొందించడానికి స్పష్టమైన మార్గదర్శకాలు లేదా విధానం వుండాలి.

భారత్‌లో గత రెండు దశాబ్దాలుగా ఆరోగ్య సంరక్షణ పంపిణీ వ్యవస్థ పని తీరుపై ఆందోళన వ్యక్తమవుతోంది. స్థూల జాతీయోత్పత్తిలో కేవలం 1.1% నిధులు మాత్రమే ప్రజా రోగ్యానికి కేటాయించడం వల్ల పెరుగుతున్న ఆరోగ్య సంరక్షణ వసతులకు ఏ విధంగానూ సరిపోవు. భారత ప్రభుత్వ పత్రాల ప్రకారం (2005) కేవలం 10 శాతం మందికి మాత్రమే ఏదో ఒక ఆరోగ్య బీమా వుంది. దేశంలో 40 శాతం మంది వైద్య ఖర్చుల కోసం అప్పు చేయడమో లేదా ఆస్తులు అమ్ముకోవడమో జరుగుతోంది. భారత్‌లో 25 శాతం ప్రజలు ఒక జబ్బుకే ఆసుపత్రుల పాలై పేదరికంలోకి జారుకుంటున్నారు. ప్రస్తుతం అమలులోవున్న ప్రజారోగ్య వ్యవస్థ దేశ ఆరోగ్య లక్ష్యాలను సాధించడంలో విఫల మైంది.

**ఈశాన్య భారత్ స్థానమేది**

ఈశాన్య రాష్ట్రాల్లో వైద్య సంరక్షణ మౌలిక సదుపాయాల కొరత, తగినంత వైద్య సిబ్బంది లేక పోవడం, కఠినమైన కొండ, గిరిజన ప్రాంతాలు కావడంతో దేశంలో అభివృద్ధి చెందిన రాష్ట్రాల కంటే చాలా వెనుకబడి వున్నాయి. ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధికి విజన్-2020 ప్రకారం వైద్య రంగంలో అన్నీ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వంద శాతం ప్రాథమిక ఆరోగ్య సేవలను విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 2020 నాటికి అందరికీ ఆరోగ్యం సాధించాలంటే ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను గ్రామీణ స్థాయిలో విస్తరించాలి, త్రాగు నీరు, పారిశుద్ధ్యం, వైద్య విద్య కార్యక్రమాలను సమీకృత పరచాలి. ఆరోగ్య రంగంలో మౌలికసదుపాయాలను అభివృద్ధి చేయడంతో పాటు వైద్య కళాశాలలను, పారా మెడికల్, నర్సింగ్ విద్యా సంస్థలను నెలకొల్పాలి. ప్రాంతీయ వైద్య విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలి. క్యాన్సర్ చికిత్సకు, హెచ్ఐవీ, ఎయిడ్స్ నివారణకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలి. స్థూల జాతీయ ఉత్పత్తిలో 6 శాతం నిధులను ఆరోగ్య రంగానికి బడ్జెట్‌లో కేటాయించాలి.

ఈ ప్రాంతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను (PHC) కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలను(CHC), జిలా ఆసుపత్రులను (DH), రాష్ట్ర ప్రభుత్వ ఆసుపత్రులను భారత ప్రజా ఆరోగ్య ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని 12వ పంచ వర్ష ప్రణాళిక కింద వైద్య ఆరోగ్య రంగంపై ఏర్పాటైన కార్యాచరణ బృందం సిఫార్సు చేసింది. వైద్య సిబ్బంది కొరతను తీర్చడానికి, రోగుల సంరక్షణ సదుపాయాలను పెంపొందించడానికి ప్రతి రాష్ట్రంలో వైద్య కళాశాలలు, నర్సింగ్ కళాశాలలు ఏర్పాటు చేయాలి.

ఈశాన్య రాష్ట్రాల్లో ఆరోగ్య రంగంలో మౌలిక వసతుల అభివృద్ధి జాతీయ సగటు కంటే తక్కువగా వుంది. పీహెచ్‌సీలు, సీహెచ్ సీలు, జిలా ఆసుపత్రుల్లో సిబ్బంది కొరత తీవ్రంగా వుంది. దీంతో మొదటి రిఫరెల్ ఆసుపత్రులు, ద్వితీయ శ్రేణి సంరక్షణ సదుపాయాల అభివృద్ధి జరగలేదు.

ప్రైవేటు పెట్టుబడుల కొరత, సిక్కిం మినహా మిగిలిన ఈశాన్య రాష్ట్రాల్లో తలసరి ఆదాయం తక్కువగా వుండడంతో బలహీనమైన మార్కెట్ ఆర్థిక వ్యవస్థ వల్ల ఈ ప్రాంతంలో ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలు దేశంలో మిగతా ప్రాంతాల కంటే వెనుకబడి వున్నాయి. ఈశాన్య ప్రాంతంలో ఏ ప్రభుత్వం కూడా ఆరోగ్య అంశాన్ని అభివృద్ధి ప్రణాళికలో చేర్చలేదు. ఈశాన్య రాష్ట్రాల్లోని ఆసుపత్రులకు తగినన్ని వనరులతో పాటు సిబ్బంది, వైద్య పరికరాలు, నిధులు సమకూర్చవలసిన అవసరం వుంది. సగటున ఈ ప్రాంతంలో ఆసుపత్రులు దుర్భర పరిస్థితుల్లో వున్నాయి.

ఎక్కువ భాగం ప్రైవేటు ఆసుపత్రులు తమ లైసెన్సులను పునరుద్ధరించుకో లేదని, దారిద్ర్య రేఖకు దిగువున వున్న వారికి ప్రత్యేక పథకులులేవని అసోం రాష్ట్ర శాసన సభా సంఘం నివేదికలో పేర్కొంది. వైద్యుల పేర్ల గానీ, డాక్టర్ ఫీజు వివరాలు, విద్యుత్ జనరేటరు లేకపోవడం, ఇరుకైన అప్రోచ్ రోడ్లు, చాలినంత పార్కింగ్ స్థలంలేక పోవడం, ల్యాబ్, కనీస అర్హతలు లేని వారిని నర్సింగ్ సిబ్బందిగా వినియోగిస్తున్నారని నివేదికలో తెలిపారు. అన్ని ఈశాన్య రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి కొనసాగుతోందని తెలిపారు. ఆరోగ్య సంరక్షణ పంపిణీ విధానంలో భారీగా రాజీ పడ్డారు. రోజులు గడిచే కొద్దీ ఆరోగ్య సంరక్షణ కు అయ్యే ఖర్చు పెరిగిపోతోంది. ఈ నేపథ్యం లో ప్రజలకు అందుబాటు ధరలో నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ అందించడం 2020 సంవత్సరం ఆపై కూడా అందె అవకాశం లేదు.

**ఇబ్బందులు ఎక్కడున్నాయి?**

మన దేశంలోని ఆసుపత్రుల్లో ఆరోగ్య సంరక్షణ నిపుణుల కొరత వుంది. 99 శాతం ఆసుపత్రులు ఈ సమస్యను ఎదుర్కొం టున్నాయి. ఈ అంశంపై సర్వే నిర్వహిస్తే 70 శాతం ఆసుపత్రుల్లో పలు వైద్యుల పోస్టులు 2 నుంచి 6 నెలల వరకు ఖాళీగా వుంటున్నాయి. 88 శాతం ఆసుపత్రుల్లో సీనియర్ వైద్యుల పోస్టులు రెండు నుంచి ఎనిమిది నెలల వరకు ఖాళీగా వుంటున్నాయి.

ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) **2013 లెక్కల ప్రకారం ప్రపంచ దేశాల్లో సగటున 10 వేల మంది జనాభాకు 15 మంది వైద్యులుంటే మనదేశంలో ఆరుగురి కంటే తక్కువ మంది వైద్యులున్నారు.** వైద్యానికయ్యే ఖర్చు వల్ల కలిగే ఆర్థిక భారానికి పరిహారం అందించేలా చర్యలు చేపట్టి, మన వైద్యులు విదేశాల్లో ప్రాక్టీసు చేసుకోవడానికో లేక పెద్ద పట్టణాల్లో ప్రాక్టీసు చేసుకోవడానికే పరిమిత మవుతూ వుంటే డాక్టరు-రోగి నిష్పత్తి ఎప్పటికీ పెరగదు. ఈశాన్య రాష్ట్రాల్లో కొండలూ, గిరిజన ప్రాంతాలు కావడం వల్ల సమాచార వ్యవస్థకు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆసుపత్రుల్లో సరైన వసతులు లేకపోవడం వల్ల వైద్యులు, నర్సులు సేవలందించడానికి ముందుకు రాకపోవడం కూడా డాక్టరు-రోగి నిష్పత్తి తక్కువగా వుండడానికి ఒక కారణం.

ఆరోగ్య విధానంలో ప్రభావం చూపించే ఆరు ముఖ్య విధులను ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) నివేదిక-2000 (WHO, 2000)లో పేర్కొంది. అవి ఏమిటంటే : పరిపాలన, ఆర్థికవెసులుబాటు, మానవ, భౌతిక వనరులు, సేవల పంపిణీకి వ్యవస్థ, నిర్వహణ . వీటిని నిర్వహించాలంటే మారుతున్న కాలానికి అనుగుణంగా ఆరోగ్య వ్యవస్థ స్పందిస్తూ, వాటిని అనుసరించాల్సిన అవసరం వుంది.

**ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం సరైన ప్రత్యామ్నాయం :**

భారత్‌లో, ప్రత్యేకించి ఈశాన్య రాష్ట్రాల్లో ఆరోగ్య సంరక్షణ పంపిణీ రంగం లో ప్రస్తుతమున్న సవాళ్లను అధిగమించడానికి, అందుబాటులో వున్న వనరులను ఉపయోగించుకుంటూ, భవిష్యత్ అవసరాలను అంచనా వేసుకుంటూ, అవకాశాలు ప్రమాదాలను గుర్తించి ,ఇందుకు అవసరమైన వ్యూహాత్మక ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి. 2001లో సుశీల్ ప్రతిపాదించిన శాప్-లాప్ (SAP-LAP) నమూనా ఇటువంటి వ్యూహా త్మక ప్రణాళికను అమలు చేయడానికి ఆచరణ యోగ్యమైనదిగా వుంది. సుశీల్ చేసిన సూచన ప్రకారం, ఇందులో ప్రభుత్వేతర సంస్థలకు ఎంత స్వేచ్ఛనిస్తే, అంతలా మార్పులు తీసుకు రావడానికి అవకాశముంటుంది. శాప్-లాప్ విధానం కింద వివిధ భాగస్వాములు పరస్పరం చర్చించుకోవడం వల్ల సానుకూల మార్పులు తీసుకురావడానికి అవకాశము ఉంటుంది.

వేగంగా మారుతున్న ఆరోగ్య సంరక్షణ రంగంలో 2020 సంవత్సరం ఆపై కూడా సమర్ధవంతమైన ఆరోగ్య వ్యవస్థ నిర్వహణకు ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం (PPP) విధానాన్ని అమలు చేయడానికి శాప్-లాప్ విశ్లేషణ ఒక అవసరమైన సాధనం.

ప్రస్తుతమున్న ఆరోగ్య సంరక్షణ మౌలిక వసతులు లోప భూయిష్టంగా వున్నాయి, వనరుల కొరతతో మన ఆరోగ్య లక్ష్యాలను సాధించడానికి అవి దోహద పడవు.

అందువల్ల, వినూత్న భాగస్వామ్యంతో, ఇరు పక్షాల పరిమితులతో పీపీపీ విధానాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. ప్రజల ఆరోగ్య సంరక్షణ, ప్రైవేటు భాగస్వాముల ప్రయోజనాల మధ్య సమతూకం పాటించాల్సి వుంటుంది.

**ముగింపు**

ఈశాన్య రాష్ట్రాల్లో పీపీపీ నమూనా అమలు చేయడానికి సంబంధించినంత వరకు, ప్రైవేటు భాగస్వాములను మదు పరులను ఆకర్షించాలి. వారిని ప్రత్యేకంగా ప్రోత్సహించాలి. ఈశాన్య రాష్ట్రాల్లో పీపీపీ నమూనా విజయవంతం కావాలంటే, పటిష్టమైన రాజకీయ సంకల్పంతో అనుకూల పరిస్థితులు కల్పించాలి. శాంతి భద్రతల పరిస్థితిని చక్క దిద్దాలి.

మదుపరులతో ఈ ప్రాంత ప్రజలు స్నేహపూర్వకంగా వ్యవహరించాలి. మదు పరుల నుంచి బలవంతంగా డబ్బులు వసూలు చేయడం, చందాలు డిమాండ్ చేయడం మానుకోవాలి.

దీనిపై ఒకేలా ఆలోచించే వ్యక్తులు ముందుకు వచ్చి ప్రభుత్వ భాగస్వామ్యంతో కొత్త ప్రాజెక్టులు చేపట్టాలి. చివరిగా, అందరూ కలిస్తే మనం ఏదైనా సాధించగలమని చెప్పగలను.

■

# ప్రచురణల విభాగం

website: publicationsdivision.nic.in

## ఆన్‌లైన్‌లో లభ్యమయ్యే మరిన్ని ప్రముఖ ప్రచురణలు

- India 2016 (also available as eBook)
- Bharat 2016 (also available as eBook)
- Legends of Indian Silver Screen (also available as eBook)
- Abode Under The Dome
- Winged Wonders of Rashtrapati Bhavan
- Right of The Line : The President's Bodyguard
- Indra Dhanush
- The Presidential Retreats of India
- Rashtrapati Bhawan
- Belief In The Ballot (also available as eBook)
- Gandhi : Jeevan Aur Darshan (hindi)
- 1857 The Uprising
- Sardar Patel-Sachitra Jeevni(hindi) (also available as eBook)
- Sardar Patel - A Pictorial Biography (also available as eBook)
- Basohli Painting
- Kangra Painting
- Indian Women : Contemporary Essays
- Bharat Ki Ekta Ka Nirman (hindi) (also available as eBook)
- Yuva Sanyasi (hindi)
- Gazetteer of India Vol.2
- The Geet Govinda of Shri Jaydev
- Who's Who of Indian Martyrs (Vol-I)
- Who's Who of Indian Martyrs (Vol-II)
- Saga of Valour
- Some Aspects of Indian Culture
- Art & Science of Playing Tabla (also available as eBook)
- Indian Classical Dance
- Celebration of Life : Indian Folk Dance
- Nataraja
- Bengali Theatre: 200 Years (also available as eBook)
- Bihari Satsai (hindi)
- Bihari Satsai - A Commentary
- Eye In Art
- Looking Again At Indian Art
- The Life of Krishna In Indian Art
- Pahari Painting of Nala Damayanti Theme
- Ajanta Ka Vaibhav (hindi)
- Bharatiya Kala - Udhbhav Aur Vikas (hindi)
- Bharatiya Chitrakala Main Sangeet Tatva (hindi)
- South Indian Paintings
- Garhwal Chitrakala (hindi)
- A Moment In Time
- Samay, Cinema Aur Itihas (hindi)
- Indian Cinema Through The Century
- Bharatiya Cinema Ka Safarnama (hindi)
- A History of Socialism
- Lamps of India
- Bharat Ke Durg (hindi)
- Wood Carving of Gujarat
- Lawns And Gardens
- Paryavaran Sanrakshan : Chunotiyan Aur Samadhan (hindi)

**eBooks**

- Lokmanya Bal Gangadhar Tilak
- The Gospel of Buddha
- Introduction To Indian Music
- Sardar Vallabhbhai Patel
- Sardar Vallabhbhai Patel (Adhunik Bharat Ke Nirmata Series)
- Lauh Purush Sardar Patel
- Aise They Bapu
- Mahatama Gandhi -A Pictorial Biography
- Gandhi In Champaran
- Mahatma Gandhi And One World

ముద్రించిన మా ప్రచురణలు **flipkart.com** లోను
ఈ-పుస్తకాలు **kobo.com** లోను లభిస్తాయి

## గమ్యం ఈశాన్యం-2016



కేంద్ర ఈశాన్య రాష్ట్రాల వ్యవహారాల మంత్రిత్వ శాఖ మొదటిసారిగా ఢిల్లీలో "గమ్యస్థానం ఈశాన్యం-2016" పేరిట ఫిబ్రవరి 12 నుండి, 14 వరకు మూడు రోజుల పాటు ఒక ఉత్సవాన్ని నిర్వహించింది. ఈశాన్య ప్రాంతంలోని సంప్రదాయ సిద్ధమైన ఆర్థిక, సామాజిక, సంస్కృతిక బలాలను బయటకు తేవడం ప్రధాన లక్ష్యంగా ఈ ఉత్సవాన్ని కేంద్ర ఈశాన్య రాష్ట్రాల వ్యవహారాల మంత్రి జితేందర్ సింగ్ ప్రారంభించారు.




ఇలాంటి ఉత్సవాన్ని త్వరలో ముంబై, బెంగుళూరులలో కూడ నిర్వహిస్తారు. దీనివల్ల, యువ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు, వ్యాపార వేత్తలకు మరిన్ని అవకాశాల ద్వారాలు తెరుచుకుంటాయి. ఈ కార్యక్రమంలో, ఈశాన్య భారత సమగ్రాభివృద్ధికి, పర్యాటక రంగ ప్రోత్సాహానికీ సమాచార సాంకేతిక రంగం ఇంతవరకు ఉపయోగించుకోని అవకాశాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు.



ఆప్రాంత సమ్మిళిత అభివృద్ధికి గల అవకాశాలను కూడ విస్తృతంగా చర్చించారు. దీనికి అవసరమైన నైపుణ్య శిక్షణ, మార్కెటింగ్ వంటి అవకాశాలను గురించి కూడ చర్చించారు. చివరి రోజున కళా, సాంస్కృతిక ప్రదర్శనలు, జానపద సంగీతంవంటి ప్రదర్శనలను నిర్వహించారు. ఫ్యాషన్ షో, క్విజ్ పోటీలు, సంప్రదాయ నృత్యాలు వంటివి కూడ ప్రదర్శించారు.



ఈ మూడు రోజుల కార్యక్రమంలో వ్యవసాయం, పర్యాటకం, ఆహారశుద్ధి, నైపుణ్యాభివృద్ధి, చేనేత-చేతివృత్తులు, ఐటి, చిన్నవ్యాపారాల ప్రారంభం వంటి అంశాలపై ఫలవంతమైన చర్చలు జరిగాయి.

ఇవేకాక, ఈ కార్యక్రమంలో ఈశాన్యప్రాంతంలోని అన్ని రాష్ట్రాల నుండి వివిధ అభివృద్ధి అంశాలపై స్టాళ్ళను కూడ ఏర్పాటుచేశారు.

■

**Publishing date 06th April 2016, Posted on 7-8 April 2016**

**Yojana (Telugu) April 2016 RNI Regd. No 37729/80 Regd. No. H/HD-663/2015-17**




Printed & Published by Mrs. Sadhana Rout, Additional Director General and Head on behalf of the Publications Division, Ministry of I & B, Govt. of India. and Printed at Prakhya Art Printers Pvt. Ltd. 1-8-724/A/31, Vegetable Market Street, Nallakunta, Hyderabad - 500 044. E-mail: print@prakhyaarts.com and Published at Yojana (Telugu), 205, 2nd Floor, C.G.O. Towers, Kavadiguda, Hyderabad - 500 080. Senior Editor: Vijayakumar Vedagiri, Tel: 040-27546314